తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్య మాస పత్రిక


# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక

జులై-2024 ✦ వెల: ₹20



శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి
ప్రత్యేక సంచిక




చవకబారు వస్తువులు విలువైనవి కావు...
విలువైన వస్తువులు చవకగా ఉండవు!!

Jaquar

**Sambamurty Enterprises**
12-10-04, Convent Street,
Vijayawada-520 001.
fone: 0866-2563824, 9676444548

తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్యమాస పత్రిక / శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి ప్రత్యేక సంచిక

# హాస్యానందం

జులై-2024

21వ సంవత్సరం
241 వ సంచిక

ముఖచిత్రం: వైష్ణవి

**Publisher& Editor-**
**Ramu.P**

**Full Pillar** : Bnim

**Cartoon Feature Editor**: Bachi

**Creative Team**

Dr. K.Ramakrishna
Kandlakunta SarathChandra
Vadlamannati Gangadhar
Dayakar, Gandhi, Nagisetty,
GopalKrishna, Bomman
Sangram, Krishna

**D.T.P:** P. Ramalakshmi,
9440304993

**Digital Media Director:**
Surya

**Well Wishers:**
Dr.K.V.Ramanachary, *(I.A.S.Retd)*
Tanikella Bharani
Dr.Sudarsan
K.V.V.Satyanarayana
Gudibandi Venkata Reddy
Dr.V.V.Rama Kumar

**Prize Sponsers**
K.V.V.Satyanarayana,
*Cartonist* JSR
K.Sundaresayya &
Satyavathi
Md.Raj Mohammed
Nimmi Madhubala
Mallika, Lakshmi
Bachi,
S.V. Ramana,
P. Srikantha Sarma

సంవత్సర చందా-రూ.300/-
(పోస్టల్ చార్జీలతో)

2 సంవత్సరాల చందా-రూ.500/-
(పోస్టల్ చార్జీలతో)

**జీవిత చందా-**
**రూ.5000/-లు**

Gpay *or* Ppay #
9849630637

email:
**hasyanandam.mag@gmail.com**
web:
**www. hasyanandam.com**

Editorial Office:
**HASYANANDAM**
# 8-215/4, Near Ramalayam,
**Po:YERRABALEM-522 503**
Mangalagiri Mandal, Guntur dist.
*Ph* : **9849630637**

**Hyderabad & Secunderabad Distributor:**
M.Panduranga,
**Risingsun News Agency**
Abids, Hyderabad. Cell. 9666680857.



గమనిక:
ఈ పత్రికలో ప్రచురింపబడే వ్యంగ్య, హాస్య రచనలు, కార్టూన్లు కేవలం హాస్యం కోసం ప్రచురించినవి మాత్రమే. ఏ వ్యక్తిని గాని, సంస్థని గాని కించపరచాలన్నది అభిమతం కాదు. ఇందులో ప్రచురించిన రచనలన్నీ ఆయా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే.

Smile in Every Page...Satisfaction in Every Smile

## శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మిగారి
## 'విజయానందం'


| | |
|---|---|
| శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మిగారి గురించి క్లుప్తంగా... | 10 |
| విజయ'లక్ష్మి'గారిలోని 'సరస్వతి'తో ముఖాముఖీ | 18 |
| విజయవిహారం | 26 |

### కథలు

| | |
|---|---|
| పూర్వాభాద్ర | -12 |
| జీ పే | -22 |
| సుగుణకి దయ్యం పట్టింది | -28 |
| సైలింగ్ ఐన్ ది సేమ్ బోట్ | -34 |
| కారులో షికారు | -36 |
| నేను చావను... నువ్వు చచ్చిపో! | -40 |
| రోలు మోడల్ | -44 |
| చిన్ని పత్రిక | -48 |

### శీర్షికలు

| | | |
|---|---|---|
| ఈనెల ప్రోత్సాహక బహుమతులు | | 8 |
| పదానందం | పోపూరి విశ్వనాథ్ | 50 |


**గమనిక:** 'ప్రత్యేక సంచికగా' రూపొందించటం వలన ఈ సంచికలో రెగ్యులర్ శీర్షికలు,ధారావాహికలు ప్రచురించబడలేదు. వచ్చే సంచికలో ఇవి యధావిధిగా ప్రచురింపబడతాయి.




### ఈ సంచికలో కార్టూనిస్టులు

| | | |
|---|---|---|
| ✦ జయదేవ్ | ✦ సునీల్ | ✦ సురేష్ |
| ✦ సరసి | ✦ నాగిశెట్టి | ✦ తోపల్లి ఆనంద్ |
| ✦ ప్రసిద్ధ | ✦ రామ్‌శేషు | ✦ టి.ఆర్.బాబు |
| ✦ జకీర్ | ✦ శర్మ | ✦ వందన శ్రీనివాస్ |
| ✦ టి.భాస్కర్ | ✦ చక్రవర్తి | ✦ శంబంగి |
| ✦ బొమ్మన్ | ✦ బీవీఎస్ | ✦ ఆదినారాయణ |
| ✦ కె.వి.సుబ్రహ్మణ్యం | ✦ డేవిడ్ | ✦ రామ్ ప్రసాద్ |
| ✦ పద్మ | ✦ గిరి | ✦ రామ్ ప్రసాద్ |
| ✦ భాను | ✦ క్రిప్ | ✦ గుత్తుల శ్రీనివాస్ |



### కార్టూన్ శీర్షికలు


| | | |
|---|---|---|
| ఈ నెల దినం | -రామ్‌శేషు | -24 |
| రిటైర్డ్ లైఫ్ | -బొమ్మన్ | -32 |
| అబ్బాయి పెళ్ళి | -జయదేవ్ | -42 |




**హాస్యానందం అభిమానులకు... ఆప్తులకు... హాస్యప్రియులకు...సన్నిహితులకు హాస్యాభివందనాలు!**

**మ**నమందరం కోరుకునేది ఆనందంతో కూడుకున్న జీవితం!... ఆ ఆనందం ఎవరి స్థాయిలో వారు పొందుతాం! అయితే మన ఆనందం కోసమే కళలు సృష్టించబడ్డాయి. కళాకారులలైన నటీనటులు, రచయిత, రచయిత్రులు, కార్టూనిస్టులు తమ ప్రతిభతో మనల్ని ఆనందింపజేస్తుంటారు.

'ఆనందం' కోసం ఉపయోగపడే గొప్ప ప్రక్రియ 'హాస్యం'!...

అదే హాస్యానందం!

పాఠకులను అక్షరాలతో నవ్వించే ఈ 'హాస్యబ్రహ్మ'లను 'సత్కరించాలనే' ఉద్దేశంతో హాస్యానందం ప్రత్యేక సంచికలు రూపొందిస్తోంది. తెలుగు పత్రిక చరిత్రలో ఇలా ప్రత్యేక సంచికలను వెలువరిస్తున్నది ఒక్క హాస్యానందమే!

**హాస్యాన్ని అందలం ఎక్కిస్తున్న వారికి పట్టాభిషేకం చేయడమే మా ఉద్దేశం.**

ఈ పరంపరలో ఈ సంచిక 'హాస్య సాహితీ సామ్రాజ్యలక్ష్మి' శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మిగారి ప్రత్యేక సంచికగా రూపొందించటం జరిగింది. సున్నితమైన హాస్యం, మన మధ్యే జరిగే సంఘటనలు, మనసుకు హత్తుకునే శైలీ... ఇవన్నీ విజయలక్ష్మిగారి ప్రత్యేకతలు. మనకు మహిళా రచయిత్రులు ఎంతోమంది ఉన్నా... విజయలక్ష్మిగారు మాత్రమే హాస్య రచయిత్రిగా గుర్తింపు పొందారంటే వారు నిబద్ధతతో రాసిన హాస్య కథలే నిదర్శనాలు.

'శ్రీవారికి ప్రేమలేఖ' హాస్యప్రియులకు విందుభోజనం...

వడ్డించింది జంధ్యాలగారైతే... వండింది మాత్రం విజయలక్ష్మిగారే.

వీరి హాస్య రచనా సేద్యంలో ఎన్నో సంఘటనలు. వాటిలో కొన్నింటిని ఈ సంచికలో ఆవిష్కరించామనే భావిస్తున్నాం!

ఆవిడకు ఆప్తులైన చాలామంది విజయలక్ష్మిగారి గురించి తమ అభిప్రాయాలు రాసి ఈ ప్రత్యేక సంచికకు, మరింత ప్రత్యేకతను సంతరింపజేసారు. వారందరికీ పేరు పేరునా ధన్యవాదాలు.

ఎప్పట్లానే ఈ ప్రత్యేక సంచిక మిమ్మల్ని అలరిస్తుందని ఆశిస్తూ...

అందరూ హాయిగా, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ.....




✦ కె.సువర్చల, తిరుపతి.

**హా**స్యానందం...తెలుగులో వెలువడుతున్న ఏకైక హాస్య మాస పత్రిక. పత్రికే కాదు... కార్టూనిస్టుల పాలిట కల్పతరువు! జూన్ సంచికలో ప్రచురించిన తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం సభ వివరాలు చదివాక నాకు అనిపించిన ఫీలింగ్ ఇది!... ఎన్ని బహుమతులు?... ఎంతమంది విజేతలు? గ్రేట్! హాస్యానందం!!



✦ ఆర్.మురళీకృష్ణ, బెంగళూరు.

**జూ**న్ హాయ్... సానందంగాలో ఎడిటర్‌గారు చెప్పినట్లు ఇప్పుడు 'స్వయం ప్రకటిత మేధావులు' ఎక్కువయి పోయారు. ఇంకా బాధాకరమైన విషయమేమిటంటే 'నేను చెప్పిందే శాసనం' అని 'వాగు'తున్న వీరిని చూస్తే అసహ్యం కలుగుతుంది. ఈ క్రమంలో ఓ భయం కూడా కలుగుతుంది- నిజంగా పనికి వచ్చే విషయాలు 'వీళ్ళ' వలన 'మరుగున' పడేస్తామేమోనని! చెప్పే నీతులు, చేసే పనులకు పొంతన లేకుండా బ్రతికేస్తున్న ఈ మేధావుల బారి నుండి ఎవరు కాపాడుతారో?

✦ శ్రీజ వేముల, కాకినాడ

**హా**స్యానందం జూన్ సంచికలో ప్రచురించిన కథలు చాలా బావున్నాయి. కథల ఇతివృత్తాలు కొత్తగా ఉండి అలరించాయి. తెలుగులో మనం చేస్తున్న చిన్న చిన్న పొరపాట్లు ఎంత పెద్దవో 'తెలుగా మజాకా?!' లో వివరిస్తున్న తీరు అభినందనీయం! ఇక యండమూరి, యర్రంశెట్టి శాయి కలిసి రా(సి)స్తున్న సీరియల్ హాస్యం ఎలా ఉండాలో తేటతెల్లం చేస్తుందనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. నిండుగా హాస్యంతో కళ కళలాడుతున్న మన హాస్యానందం పది కాలాలు వర్ధిల్లాలని నా ఆకాంక్ష!

✦ కె.విశ్వేశ్వరరావు, హైదరాబాద్.

**హా**స్యానందం జూన్ సంచికలో ప్రచురించిన కథలు చాలా బావున్నాయి. కథల ఇతివృత్తాలు కొత్తగా ఉండి అలరించాయి. తెలుగులో మనం చేస్తున్న చిన్న చిన్న పొరపాట్లు ఎంత పెద్దవో 'తెలుగా మజాకా?!' లో వివరిస్తున్న తీరు అభినందనీయం! ఇక యండమూరి, యర్రంశెట్టి శాయి కలిసి రా(సి)స్తున్న సీరియల్ సూపర్! హాస్యం అంటే ఇది! అనిపించే కథాగమనం అందరికీ(రచయిత(త్రు)లకు) మార్గదర్శనం.

✦ బి.వి.శ్యామల, చెన్నై

**మా** ఇంటిల్లిపాదీ ఆనందానికి ఆసరా అయిన హాస్యానందానికి మా హాస్యాభినందనాలు! మీ కృషి మా ప్రతి చిరునవ్వులో ఋజువవుతూనే ఉంది!... మీకు మరోసారి మా ధన్యవాదాలు!

## ముళ్ళపూడి సింగిల్ పేజీ హాస్య కథల పోటీ ఫలితాలు



**హాస్యానందం సౌజన్యంతో శ్రీ ఏ.వి.కృష్ణమూర్తిగారు నిర్వహించిన ఈ హాస్య కథల పోటీలో బహుమతి పొందిన కథలు.**

న్యాయనిర్ణేత–'కళారత్న' బ్నిం

✦ **అక్షర స్వయంవరం**
–పోలప్రగడ జనార్ధనరావు(జెన్నీ)

✦ **సంసార సర్వస్వం**
–ద్విభాష్యం రాజేశ్వరరావు

✦ **స్వామీజీ దీవెన**
–డి.వి.డి.ప్రసాద్

✦ **చెయ్యి తిరిగితే...**
–ఎన్.డి.ఎస్.వి.నాగేశ్వరరావు

✦ **వంట వచ్చిన మొగుడు**
–యలమర్తి అనూరాధ

✦ **భామా కలాపం**
–పద్మ పైడిమర్రి

✦ **పడుచు పెళ్ళాం- సైకిల్ సవారీ**
–రంగనాథ్ సుదర్శనం

✦ **అలా జరిగింది**
–కొత్తపల్లి రవి కుమార్

✦ **ఉత్తమురాలు**
–మోచర్ల అనంత పద్మనాభరావు

✦ **భాష**
–మన్నవ ప్రియా సిస్టర్స్

**ఈ కథలు హాస్యానందం ఆగష్టు సంచికలో ప్రచురించబడతాయి.**

హాస్యానందం సౌజన్యంతో




ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీబాచిగారు, తమ తల్లిగారు శ్రీమతి అన్నం భాగ్యవతి (బాచి) గారి స్మారకార్థం ఈ కార్టూన్ పోటీలు నిర్వహిస్తున్నారు.

| మొదటి బహుమతి | రెండవ బహుమతి |
|---|---|
| రూ.5000/-లు, మెమెంటో+సర్టిఫికేట్ | రూ.3000/-లు, మెమెంటో+సర్టిఫికేట్ |
| **మూడవ బహుమతి** | **జ్యూరీ బహుమతులు** |
| రూ.2000/-లు, మెమెంటో+సర్టిఫికేట్ | రూ.500/-లు చొప్పున 10 బహుమతులు |

పాల్గొన్న వారందరికీ సర్టిఫికేట్లు.

హాస్యాభిమాని, కార్టూనిష్టులు **శ్రీఎస్.వి.రమణ గారు** తమ తల్లిదండ్రులు శ్రీసోమయాజుల శివరామయ్య, శ్రీమతి హైమవతి గార్ల స్మారకార్థం ఈ కార్టూన్ పోటీలు నిర్వహిస్తున్నారు.




| మొదటి బహుమతి | రెండవ బహుమతి |
|---|---|
| రూ.2,500/-లు, మెమెంటో+సర్టిఫికేట్ | రూ.1,500/-లు, మెమెంటో+సర్టిఫికేట్ |
| **మూడవ బహుమతి** | **జ్యూరీ బహుమతులు** |
| రూ.1,000/-లు, మెమెంటో+సర్టిఫికేట్ | రూ.500/-లు చొప్పున 5 బహుమతులు |

ఒక ప్రముఖ కార్టూనిస్ట్‌కి సన్మానం

- ఈ మెయిల్‌కి కార్టూన్లు పంపవలెను- **sreedhar.annam@yahoo.in**
- రెండు పోటీలకు విడివిడిగా కార్టూన్లు పంపవలెను.

ఆగష్టు 15న విజయవాడలో బహుమతి ప్రదానోత్సవం నిర్వహించబడుతుంది. బహుమతి పోస్ట్‌లో పంపడం జరగదు! వివరాలు హాస్యానందం ఆగష్టు సంచికలో...

**కార్టూన్లు చేరవలసిన ఆఖరు తేదీ : 20-07-2024**

హాస్యానందం సౌజన్యంతో

**భారతీయ జ్యోతిర్వాస్తు విజ్ఞాన సంస్థ, అమరావతి వారి సమర్పణలో**

# దసరా కార్టూన్ల పోటీ

జ్యోతిష, వాస్తు శాస్త్రములను ఏ విధంగానూ కించపరచకుండా, వాటి లోని పెడధోరణులను, లోపాలను సున్నితంగా, వ్యంగ్యంగా, హాస్యస్ఫోరకంగా ఎత్తిచూపే కార్టూన్‌లను పోటీకి ఆహ్వానిస్తున్నాము.

| అంశం: జ్యోతిష్యం, వాస్తు | మొదటి బహుమతి | రెండవ బహుమతి | మూడవ బహుమతి |
|---|---|---|---|
| | రూ. 2,000/- లు | రూ. 1,500/- లు | రూ. 1,000/- లు |

**10 ప్రోత్సాహక బహుమతులు ఒకొక్కరికీ -రూ. 500/-లు**

కార్టూన్లు మాకు చేరవలసిన ఆఖరు తేదీ- **సెప్టెంబర్-01,2024.**

కార్టూన్లు ఈ మెయిల్‌కి పంపండి- **hasyanandampoteelu@gmail.com**

## ఈ నెల ప్రోత్సాహక బహుమతులు

**4000 రూపాయల బహుమతులు**


మన కార్టూనిస్ట్‌లను ప్రోత్సాహించాలనే సదుద్దేశంతో **ప్రతి నెలా** హాస్యానందంకు వచ్చిన కార్టూన్‌లలోంచి కొన్ని మంచి కార్టూన్లకు **ఇచ్చే ప్రోత్సాహక బహుమతులు.**




'కార్టూన్ మిత్ర'

**శ్రీ కె.వి.వి.సత్యనారాయణగారు**

**ఈ కార్టూన్‌కి రూ.1000/-లు** బహుమతిగా ఇస్తున్నారు.






**శ్రీమతి నమ్మి మధుబాల**


**(బాపు) రమణల లోగిలి-ఫేస్బుక్ గ్రూప్)**


కార్టూన్ కళ పై ఆరాధనతో... ఈ మూడు ప్రోత్సాహక బహుమానం ఇస్తున్నారు.

← మొదటి బహుమతి- **రూ.500/-లు**

↙ రెండవ బహుమతి- **రూ.300/-లు**


↓ మూడవ బహుమతి- **రూ.200/-లు**






కార్టూనిస్ట్ **శ్రీ జె.ఎస్.ఆర్.**
(జె.శ్రీరామచంద్రమూర్తి గారు)
వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.







**శ్రీకుప్పచ్చి సుందరేశయ్య,**
**శ్రీమతి సత్యవతి వార్లు**
**ఈ కార్టూన్‌కి 500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.







కార్టూనిస్ట్
**ఎమ్.డి. రాజ్ మహమ్మద్ గారు**
ఈ కార్టూన్‌కి
**500 రూపాయలు**
బహుమతిగా ఇస్తున్నారు.






**దివ్యశ్రీ శ్రీమతి చిట్టావఝ్ఝుల యల్లారి**
**బాల వెంకట సత్య సూర్యకాంతం** జ్ఞాపకార్థం
కుమార్తెలు **మల్లిక, లక్ష్మీ** అందిస్తున్న
ప్రోత్సాహక బహుమానం-
**500 రూపాయలు**




## ప్రతి నెలా పోటీలే!

కార్టూనిస్టు మిత్రులకు నమస్కారం. ప్రతి నెలా హాస్యానందంకు వచ్చే కార్టూన్లలోంచి **8 మంచి కార్టూన్లకు బహుమతులు** ఇస్తున్నారు కార్టూన్ ఇష్టులు! మీరు ఇక నుంచి పంపే కార్టూన్లకు బహుమతి రావాలనే ఉద్దేశంతోనే కార్టూన్లు గీయండి! సందేశాలున్నప్పటికీ హాస్యం మాత్రం 'మిస్' కాకుండ చూస్కొంటే... మీకు బహుమతి 'మిస్' అవ్వదు. ఆల్ ది బెస్ట్!

# శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మిగారి గురించి క్లుప్తంగా...



- జననం-జూలై 18 ,1953.
- విద్య-డిగ్రీ పూర్తి కాలేదు.
- 1970 లో వివాహం.
- 1982 లో రచనా వ్యాసంగం ప్రారంభం.
- మొదటి నవల ప్రేమలేఖ చతుర మాస పత్రికలో ప్రచురించబడింది. ఆ నవల ఆధారంగా శ్రీవారికి ప్రేమలేఖ సినిమా వచ్చింది.
- మూడు నవలలు సినిమాలుగా వచ్చాయి.
  1.ప్రేమలేఖ-శ్రీవారికి ప్రేమలేఖ.
  2. సంపూర్ణ గొలాయణం-
  ప్రేమ ఎంత మధురం
  3.శంకర్రావు పెళ్లి-
  ప్రేమ చిత్రం పెళ్లి విచిత్రం.
- 20, నవలలు
- 300 దాకా కథలు,వ్యాసాలు.
- చాలా కథలు బహుమతులు గెల్చుకున్నాయి.
- అన్ని ప్రముఖ పత్రికలలో రచనలు ప్రచురింపడ్డాయి.
- ఆలిండియా రేడియోలో 25 ఏళ్ళుగా ఎన్నోమార్లు ప్రసంగాలు. కథాపఠనం.
- గవర్నమెంట్ వారి పథకాలకు ఆధారంగా 4 నాటికలు.
- టీ.వీ సీరియల్స్‌కి రచనా సహకారం, కథలు ఇవ్వటం.
- క్యోంకి సాస్ భీ కభి బహు థి హిందీ సీరియల్‌ను తెలుగులో కలిసుందాం రా పేరుతో తీశారు. ఆ సీరియల్‌కి 250 ఎపిసోడ్‌లు రచనా సహకారం చేశారు.
- వనిత టీవీలో వచ్చిన సూపర్ అత్త జీనియస్ కోడలు సీరియల్‌కి రచన సంభాషణలు.
- **కథా సంపుటాలు-**
  చంద్రహారం, మాఇంటి రామాయణం. ఆనందమే అందం, సన్మానం, పూర్వి, స్క్రిప్ట్ సిద్ధంగా వుంది సినిమా తియ్యండి, జీవన జ్యోతి, అమ్మ ఫోటో.
- వ్యాసాలు.(పత్రికలలో వచ్చిన కాలమ్స్)
  పొత్తూరి విజయలక్ష్మి హాస్య కథలు
  (ఈనాడు ఆదివారం)
  కొంచెం ఇష్టం కొంచెం కష్టం.
  (ఆంధ్రభూమి దినపత్రిక)
  జ్ఞాపకాల జావళి.
  (ఆంధ్రభూమి వార పత్రిక)
  నోస్టాల్జియా, నోస్టాల్జియా-2
  (ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధం)
  కాసిని కథలు కాసిని కబుర్లు.
  (ఫేస్బుక్లో పోస్టింగులు)
- **నవలలు-**
  ఒక ప్రేమ కథ, ఒక పెళ్లి కథ, శంకర్రావుపెళ్లి, ప్రేమించని ప్రేయసి, ఆనందమానంద మాయెనే, శ్రీరస్తు శుభమస్తు, సంపూర్ణ గోలాయణం, కృష్ణ పక్షం,శుక్ల పక్షం, త్రివేణి, లక్ష్మీకళ్యాణం, ప్రేమలేఖ, ఆత్మ కథ, ఆ 21 రోజులు.
- 20పైగా కథలు వివిధ కథా సంకలనాల్లో వచ్చాయి.
- పొత్తూరి విజయలక్ష్మి హాస్య కథలు ఎక్కువ సంఖ్యలో కొని వివాహాది శుభ కార్యాలలో అతిథులకు బహుమతిగా చాలామంది ఇచ్చారు.
- మాఇంటి రామాయణం కథ ఆధారంగా రూపొందించిన నాటిక ఇంటింటి భారతం నంది పురస్కారాలు గెలుచుకుని ఎన్నో చోట్ల విజయవంతంగా ప్రదర్శిచ బడుతోంది.
- పూర్వి కథ ఆధారంగా రూపొందిన మనస్విని నాటిక ఆజో విభో పోటీలో ద్వితీయ బహుమతి గెలుచుకుంది.
- **పురస్కారాలు-**
  - పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి కీర్తి పురస్కారం,
  - గృహలక్ష్మి స్వర్ణ కంకణం,
  - ఢిల్లీ తెలుగు అకాడమీ ఉద్యోగరత్న అవార్డు,

- ✤ అమృతలత హాస్య పురస్కారం.
- ✤ తురగా కృష్ణమోహన్ స్మారక పురస్కారం.
- ✤ లేఖిని సంస్థ శేషారత్నం.
- ✤ మునిమాణిక్యం నరసింహారావు
- ✤ కొత్తూరు సుబ్బయ్య గారి భానుమతి.
- ✤ విజయ భావన. విజయనగరం వారి ఉగాది పురస్కారం.
- ✤ సుశీలా నారాయణ రెడ్డి అవార్డ్,
- ✤ ముళ్ళపూడి వెంకటరమణ అవార్డ్.
- ✤ తెలుగు రాష్ట్రాలలో అన్ని ప్రముఖ నగరాలతో పాటు డల్లాస్‌లో కూడా సన్మానాలు.
- ✤ కావలి తెలుగు సాహితీ వేదిక వారిచే సాహితీ శిరోమణి బిరుదు.
- ✤ విజయ భావన విజయనగరం వారిచే హాస్య కళాపూర్ణ బిరుదు.

- ✦ 'పూర్వి' కథాసంపుటి మీద చెన్నై యూనివర్శిటీ నుండి బోయిని మాధవి అనే విద్యార్థిని M.Phil చేసింది.
- ✦ నాగార్జున యూనివర్సిటీ నుంచి శ్రీమతి పరుచూరి విజయలక్ష్మిగారు పొత్తూరి విజయలక్ష్మి అంశంపై పిహెచ్ డి. చేశారు.
- ✦ అష్టావధానం శతావధానాలలో అపస్తుత ప్రసంగం.
- ✦ మంచి వక్త. ఎన్నో సభలలో కీలకో పన్యాసాలు.
- ✦ అన్ని రసాలు రాసినా ప్రముఖ హాస్య రచయిత్రిగా పేరు ప్రఖ్యాతులు.
- ✦ తెలుగుతో బాటు ఇంగ్లీషు,హిందీ, కన్నడ, బెంగాలీ, తమిళ భాషల్లో మాట్లాడటం.
- ✦ హాస్యం, మానవ సంబంధాలు, సంస్కృతి ప్రతిబింబించే విధంగా మాత్రమే రచనలు చేయాలని నిశ్చయం.


**చిరునామా.**

**పొత్తూరి విజయలక్ష్మి,**
301, శ్రీ వైభవలక్ష్మి నిలయం,
11-13-650/ బి, రోడ్ నెం.3,
హరిపురి కాలనీ, ఎల్‌బి నగర్,
హైదరాబాద్-500 074,
ఫోన్: 99490 59007.



**శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మిగారి గురించి ఓ సందర్భంలో 'కళారత్న' బ్నిం గారు రాసిన సన్మాన పత్రం**

# విజయానందం





'ఏ'నారి' చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం మగ జాతి చరిత్ర సమస్తం. ఆడాళ్లని వేపుకు తినడం...." అంటూ చక్కగా స్త్రీవాద కవిత్వం రాసుకుంటూ రెచ్చిపోక...ఇదెక్కడి విడ్డూరం అండీ విజయలక్ష్మి గారూ!! మీరిలా హాస్య రచయిత్రి అని పేరు పడ్డారు? మీ పేరు నిజంగా మీ పేరేనా? మీ వారి 'పెన్' పేరా? ఈ అనుమానందేనికంటే... ముళ్ళపూడి వెంకటరమణగారు కూడా సి. విజయలక్ష్మి అనే కలం నామంతో రాశారని చరిత్ర సాక్ష్యం. అందుకే మా డౌటానుమానం! గరిట భర్తకిచ్చేసి...పెన్ను పట్టిన ప్రతి ఆడ స్త్రీ కూడా నవ్వు...లవ్వూ...నలిపి పడేసి...చక్కగా కాయితాల మీద మగజాతిపై కారాలు, మిరియాలూ... నూరుతూ కళాక్షేపం చేస్తారు కదా... అలాంటి మీరు ఇదేంటండి.... 'నవ్వుల' రచయిత్రిగా పుస్తకాలు రాసేయడమేంటి? 'లవ్వుల' రచయిత్రిగా మూడు సినిమా కథలు అమ్ముకోవడం ఏమిటి?

అదలా ఉంచండి... 'హాస్యబ్రహ్మ'గా విఖ్యాతులైన జంధ్యాలగారు మీ హాస్యరచనలు నచ్చి స్వీకరించి... 'శ్రీవారికి ప్రేమ లేఖ' చిత్రం తీసేసి మీకు కిరీటం పెట్టడం ఏంటి? మళ్లీ... ఆయనగారే మీ మరో లవ్వు రచన ప్రేమ చిత్రం-పెళ్లి విచిత్రం' లాంటి చిత్రం నిర్మించడం ఏమిటి? ఇదంతా బహు చిత్రం కదా?!

ఏ మాటకామాటే చెప్పుకోవాలి. స్త్రీవాద రచయిత్రులకి తెలియదు గాని అన్ని రసాల్లోకి హాస్యం రాయటం బహుకష్టం. పొరబాట్న హాస్య రచయిత్రిగా పేరు వచ్చి నెత్తిమీద తిష్టవేస్తే... ఇంక ఆ రైటర్ గిలగిల్లాడాల్సిందే... ఆపేరు నిలుపుకోవడానికి అలాంటిది! హాస్యం రాసి నవ్వు తెప్పించడం మీకు 'ఫన్తో' పుట్టిన విద్య. అలాగని హాస్యం రాసి నవ్వు రప్పించకపోతే... పాఠకులు 'ఇది హాస్యంరోయ్!' అని గొల్లున నవ్వేసే ప్రమాదం వుంది. ఆ భయం మీకు పుష్కలంగా ఉందనటానికి మీ రచనల్లో చాలా పేజీలు సాక్ష్యం పలుకుతాయి. మీ చెవులు చూస్తాయి కాబోలు మీ కళ్లు వింటాయి అనుకుంటాం. మీ వేళ్లు పలుకుతాయేమో... ఇది మీ రచనలు చూస్తుంటే కలిగే అభిప్రాయం!!

'చూసినదల్లా రచన- రాసిందల్లా హాస్యం' అయిన మీ కల్పనాచాతురికి, చమత్కృతికీ పక పక లాడింది తెలుగు పాఠక లోకం. 20 నవలలు,300 కి పైగా కథలు- వందలాది వ్యాసాలు రచించిన ప్రతిభకి అబ్బురపడి.. మీరచనలపై పరిశోధన చేసి డాక్టరేట్ తీసుకున్నారంటే మీరూ డాక్టరున్నర అయినట్లే. రచనలో మీరు పొందిన బహుమతులు మిరందుకున్న సత్కారాలు, మేం ఇప్పుడు లెక్కలుగట్టి చెప్పలేం గానీ, బహు'మతులు' దోచిన మీకు బాపురమణ అకాడమీ (ఆత్రేయపురం-హైదరాబాద్) నేడు 'రమణ అవార్డు 'నిచ్చి గౌరవిస్తోన్నందుకు పులకిస్తోంది. నిండు నూరేళ్ల పాటు మీరు హాయిగా ఇలాగే నవ్వుల విందు నందిస్తూ ఉండాలని ఆకాంక్షిస్తోంది!

విజయానందం

# పూర్వాభాద్ర

శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి

కథ

**"ఏమండీ చూసారా!... సూరి బావగారికి మళ్లీ వచ్చిందిట!!" ఇల్లెగిరి పోయేలా కేక పెట్టింది నీరజ.**

**"ఏవొచ్చింది?! వైరల్ ఫీవరా?" అడిగాడు శ్రీధర్.**

**"ఛ! కాదు!! పోటీల్లో బహుమతి వచ్చిందిట."**

**"మళ్లీనా? ఎంతట?"**

**"మూడు వేలు."**

"ఓస్ అంతేనా! వంటావిడ వాణిగారికి వర లక్ష్మీ వ్రతం నాడు వంట చేస్తే ఇస్తారు ఆ మాత్రం."

"చాల్లే వూరుకోండి. కథలు రాయటం అంటే మాటలా!... చూడండి మెసేజ్ పెట్టి గంట కాలేదు అప్పుడే ఎన్ని కామెంట్‌లు వచ్చాయో!"

అని ఫోన్ చేతిలో పెట్టింది.

జాతరలో జనంలా పోటెత్తాయి కామెంట్స్.

'యాభై ఏళ్ల వయసులో కలం పట్టి విజృంభించి రాస్తున్న సూర్యానికి అభినందనలు.'


'క్రికెట్‌లో ధోని రచనల్లో మా సూరి బావ!'

'మన వంశ గౌరవాన్ని ఇనుమడింప జేస్తున్న సూర్యం!' అంటూ బోలెడన్ని మెసేజ్‌లు

"చూసారా?" అడిగింది.

"ఆ! చూసా! మీ గ్రూప్‌కి పనా పాడా! మా ఇంట్లో పాలు విరిగి పోయాయి... అన్నా వెల్లువలా వచ్చి పడిపోతాయి కామెంట్లు. మీ కన్నా ఛానల్ వాళ్ళు నయం!" విసుక్కున్నాడు.

ఒళ్ళు మండిపోతోంది అతనికి.



సదరు సూర్యనారాయణ శ్రీధర్‌కి స్వయానా తోడల్లుడు. ఆ మధ్య ప్రమోషన్ మీద సీట్ మారాడు. అదో పిచ్చి పోస్ట్.

బల్ల దగ్గర కూచుని రోజు మొత్తం మీద అరడజను సంతకాలు పెట్టటం... అంతే! అంతకు మించి పనేం లేదు... ఎంతసేపని గోళ్ళు కొరుక్కుంటూ కూచుంటాడు! కాలక్షేపం కోసం ఏదో రాయటం మొదలు పెట్టాడు. పత్రికలకి పంపించాడు. శతభిష అని జన్మనక్షత్రం పేరు కలం పేరుగా పెట్టుకున్నాడు.

ఒకటి రెండు కథలు అచ్చయ్యాయి.

బంధువులు సంబరపడిపోయారు.

ఆ శతభిష ఎవరో కాదు... మన సూర్యమే అని చెప్పుకున్నారు.

ఆ తరువాత శతభిషకు కథల పోటీలో బహుమతి వచ్చింది. అత్తారింటి వాళ్లు ఏమీ లేకపోతేనే హడావిడి చేసేస్తారు. మరి ఇటువంటి అవకాశం వస్తే ఊరుకుంటారా! ఒకటే డబ్బా కొట్టేసుకుంటున్నారు.

ఏవిటో అంత గొప్ప కథ అని పనిగట్టుకుని చదివాడు. ఏడ్చినట్టు ఉంది.

హీరో పేరు రాము. వాడికి ఉద్యోగం ఉంది. జాలిగుండె కూడా వుందిట.

వీధి పంపు దగ్గర నీళ్లు పట్టుకునే ఆడవాళ్లను చూసి భరించలేక తెల్లారుజామునే లేచి తన ఇంట్లో పంపు నించి నీళ్లు పట వీధిలో అందరికీ తలా ఒక బిందెడు ఇచ్చి వస్తాడుట. ఆడవాళ్ళందరూ కృతజ్ఞతతో నీళ్ళ అన్నయ్య నీళ్ళఅన్నయ్య అని ఆనందంతో కళ్ళ నీళ్ళు పెట్టుకుని ఉమ్మడిగా వచ్చి రాఖీ పండుగనాడు అతనికి రాఖీలు కడతారు.

అదీ కథ!

అదో కథ...దానికి ఓ బహుమతి. అది చూసి వీళ్లంతామెచ్చి మేకతోలు కప్పటం. ఆయన తెగ సంబరపడి పోవటం. ఓవర్ యాక్షన్ అని విసుక్కున్నాడు శ్రీధర్.

ఆమధ్య ఏదో ఫంక్షన్‌లో కనిపించాడు. అది వరకులా కాకుండా పంచకట్టు, నిలువుబొట్టు తెగ ఫోజులు కొడుతున్నాడు.

మావగారేమో– "మా పెద్దల్లుడు. రచయిత శతభిష." అని గర్వంగా అడిగినవారికి అడగని వారికి పరిచయం చేయటం.

"మా బావను చూడండి. మీరూ వున్నారు ఎందుకూ?" అని అర్థాంగి నసుగుడు.

ఒళ్లు మండిపోతోంది శ్రీధర్‌కి. ఇప్పుడు మళ్లీ ఇంకో బహుమతి వచ్చింది. ఇలా అయితే నా బ్రతుకు బజారు అయిపోతుంది. ఏదో చెయ్యాలి అనుకున్నాడు కసిగా.

ఇంకోటి మరోటి ఎందుకు తనూ రచనలే చేస్తే చిన్న గీత పక్కన పెద్ద గీత గీసినట్లు అవుతుంది. కాకపోతే అతనిలాగా కథ రాస్తే అతన్ని కాపీ కొట్టినట్టు అవుతుంది కాబట్టి ఇంకేదైనా ప్రక్రియ ఎంచుకోవాలి. ఆవేశం వుంది. కానీ ఏం చేయాలి?! అసలు ఎట్లా ఆరంభించాలి తెలియటం లేదు.

భార్యతో చర్చించాడు. నీరజ చాలా సంతోషించింది.

"మీరు కూడా రచనలు చేసి పేరు తెచ్చుకుంటే ఇంతకంటే నాకేం కావాలి! నా వంతు సహాయ సహకారాలు అందిస్తాను." అన్నది.

అంతలోనే అదృష్టం కలిసి వచ్చి అతనికి ఒక గ్రూపుతో పరిచయం ఏర్పడింది. ఇంటికి వచ్చి భార్యకు ఆ శుభవార్త వినిపించాడు.

"ఏం గ్రూపు?" అడిగింది నీరజ.

"కొ ర సం."

"అంటే??"

"కొత్త రచయితల సంఘం.'

"ఇంకా మీరు రచయిత కాలేదుగా! అప్పుడే మీకో సంఘం కూడానా! ఒక కథ అయినా అచ్చయ్యాక అప్పుడు చేరండి సంఘంలో." అంది.

"అలా అని ఏమైనా రూల్ ఉందా?ముందు చేరి తరవాత రాస్తే ఎవరైనా ఉరి తీస్తారా?" నిలదీసి అడిగాడు.

"ఉరి తీయరు గానీ అందరూ కొత్తవాళ్లతో అయితే ఏం ప్రయోజనం. పేరున్న రచయితలు ఎవరైనా ఉంటే వాళ్లు సలహాలు చెబుతారు అప్పుడు బాగుంటుంది." అన్నది.


"అవన్నీ పాత రోజుల్లో. ఇప్పుడు ఎక్కడ చూసినా ఈర్ష్య, అసూయ. ఒకరిని చూసి ఒకరు కుళ్లుకోటం తప్ప మరొకరిని భుజం తట్టి ప్రోత్సహించే వాతావరణం లేదు... అందరూ కొత్తవాళ్లయితేనే సుఖం." అన్నాడు.

కొరసం సభ్యులు వారానికి ఒకసారి ఎక్కడైనా కలుసుకుని రచనా వ్యాసంగం గురించి మాట్లాడుకుంటారు.

కొత్త సభ్యుడు చేరగానే... అతని ఇంట్లో మీటింగ్ పెట్టటం కొరసం అలవాటు. శ్రీధర్ ఇంట్లో కొరసం సమావేశం ప్రారంభమైంది.

ప్రస్తుతం నవలలకు కొరతగా ఉంది. తెలుగు కథలు వర్షంలా కురుస్తున్నాయి కాబట్టి నవల రాస్తే బావుంటుంది అనుకున్నారు.

అది యదార్థమే... కానీ అమ్మో ఏకంగా




## చాలా గొప్ప రచయిత్రి



### విజయానందం



**పొత్తూరి** విజయలక్ష్మి గారు– 'శంకర్రావు పెళ్ళి' అని నవల రాసారు. ఆ నవలని సినిమాగా తీసినప్పుడు ఆ సినిమాకి స్క్రీన్‌ప్లే, డైలాగులు నేను రాసాను. 'ప్రేమ చిత్రం–పెళ్ళి విచిత్రం' ఆ సినిమా. అప్పటినుండి ఆవిడతో పరిచయం. ఆవిడ రచన విధానంలో చాలా సహజమైన హాస్యం ఉంటుంది. నాకు తెలిసీ అంతగా కామెడీ రాయగలిగినవారు తెలుగులో స్త్రీ రచయితలెవరూ లేరు.

ఆవిడ One and only lady Writer. చాలామంది అనుకుంటారు ఆవిడ కామెడీయే రాస్తారని. కామెడీతో పాటు కరుణ రసం కూడా సమానంగా పండించగల రచయిత్రి, ప్రతిభాశాలి. ఆవిడ మాటల్లో కూడా హాస్యం వుంటుంది. చాలా గొప్ప రచయిత్రి. ఆవిడ కోసం హాస్యానందం ఇలా ప్రత్యేక సంచిక తీసుకొస్తున్నందుకు చాలా సంతోషం.

ఈ సందర్భంగా ఆవిడకి అభినందనలు తెలియజేస్తున్నాను. నమస్కారం. **–దివాకరబాబు, సినీ రచయిత**

నవల రాయటం అంటే మాటలా!... అని భయ పడ్డారు.

శ్రీధర్ మాత్రం జంకలేదు.

"కొడితే ఏనుగు కుంభస్థలాన్ని కొట్టాలి!" అన్నాడు.

"సరే మీరే మాకు స్ఫూర్తి... మీరు మొదలు పెట్టండి. వారం వారం మనం కలుస్తాము కదా! అప్పుడు చదివి వినిపించండి. సలహాలు సర్దుబాట్లు చేసుకోవచ్చు." అన్నారు.

ఆనాటి సమావేశం ముగిసింది.

బుర్ర వేడెక్కిపోయేలా ఆలోచించి మూడు పేజీలు రాశాడు.

మర్నాడు భార్యకు వినిపించాడు.


"ప్రకృతి ఒడిలో ఒక పల్లెటూరు రామా పురం. రామాపురంలో పెద్ద ఆసామీ సోమ శంకరం గారు. వారి భార్య సోమలక్ష్మి. వాళ్ళకి నలుగురు కొడుకులు. రాజారావు, భీమారావు, సుబ్బారావు, గోవిందరావు.

రాజారావు భార్య రాజ్యలక్ష్మి. భీమారావు భార్య భీమలక్ష్మి. సుబ్బారావు భార్య సుబ్బ లక్ష్మి. గోవిందరావు భార్య గోవింద లక్ష్మి.

రాజారావుకు ముగ్గురు పిల్లలు. కుమార్, ఈశ్వర్, ముకుంద్. భీమారావుకు ముగ్గురు పిల్లలు. వసంత, కళ్యాణి, భైరవి.

సుబ్బారావుకి నలుగురు పిల్లలు సూర్యం, సత్యం, విశ్వం, చంద్రం.

గోవింద రావుకి పిల్లలు లేరు. అతని బావ మరిది నారాయణ. అతనికి నలుగురు పిల్లలు.




అచ్యుత, కేశవ, మాధవ, రుక్మిణి...." అంటూ చదువుతూ అనుమానం వచ్చి... భార్యను చూసాడు. హాయిగా నిద్ర పోతోంది. ఒళ్ళు మండిపోయింది అతనికి. వీపు మీద ఒక్కటి వేశాడు.

ఉలిక్కి పడి లేచింది నీరజ.

"నేను చదువుతుంటే వినకుండా నిద్ర ఏమిటి?" అని కోప్పడ్డాడు.

"ఏమిటో హూద్ హూద్ తుఫానులాగా అన్ని పాత్రలు వచ్చేసరికి అయోమయంగా వుంది. కళ్ళు మూసుకుని పోయాయి." అంది.

"అంతేలే! నీ వంటి నిరక్షర కుక్షి దగ్గర చద వటం నాది బుద్ధి తక్కువ!" అన్నాడు.

మరుసటి వారం కొరసం సమావేశంలో తను రాసింది చదివాడు.

బాగుంది అన్నారు వాళ్లు. ఓ పది పేజీలు రాసేసరికి అతనికే విసుగేసింది.

"ఏమిటో అన్ని పాత్రలు పేర్లు గుర్తు పెట్టు కోవడం కష్టంగా ఉంది." అన్నాడు భార్యతో.

"రాసేవాళ్ళు మీకే అయోమయంగా ఉంటే చదివే వాళ్ళకి ఎలా ఉంటుంది! కురుక్షేత్ర యుద్ధంలో లాగా అన్ని పాత్రలు ఎందుకు?... కాస్త తక్కువ పాత్రలతో నవల ప్రారంభిస్తే మీకూ సుఖం. చదివే వాళ్ళకి సుఖం" అన్నది నీరజ.

ఆ నవల అక్కడ ఆపేసి మరో నవల ప్రారం భించాడు.

✦ ✦ ✦


సునీల్ సుచిత్రలకు రెండు నెలలు క్రితం పెళ్లి అయింది. వాళ్ళు చాలా అన్యోన్యంగా కాపురం చేసుకుంటున్నారు.

సునీల్ ఆఫీస్ పని మీద బెంగుళూర్ వెళ్ళాడు... పని పూర్తి చేసుకుని స్టేషన్‌కు వెళ్లి రైలు ఎక్కుదాం అని బయలు దేరాడు. దారిలో ఆటోను లారీ గుద్దింది.

అక్కడికక్కడే ప్రాణం పోయింది... అని రాసి సమావేశంలో కొరసం వాళ్ళకి వినిపించాడు.

"అద్భుతం! అమోఘం!! మొదటి సీన్‌లోనే హీరో చచ్చిపోవటం చాలా గొప్ప ఆరంభం... ఈగ సినిమాలాగా మీ నవల కూడా సూపర్ హిట్ అవుతుంది." అని ప్రోత్సహించారు.

నీరజ మాత్రం– "శుభమా... అని నవల



మొదలుపెట్టి మొదటివారంలోనే హీరోని చంపేయడం ఏమిటండి?"

"పోనీ రెండో వారంలో చంపనా?" అన్నాడు.

"హీరోను చంపాలనే ఆలోచన ఎందుకు వచ్చింది?"

"వద్దంటావా!?... అయితే హీరోయిన్‌ను చంపేస్తాను. సునీల్ బెంగుళూరు నుండి వచ్చేసరికి సుచిత్ర చచ్చిపోయింది."

"హీరోయిన్ పోతే మిగిలిన కథ ఎట్లా నడుస్తుంది??"

"పాయింటే! ఓ పని చేద్దాం... వాళ్ళిద్దరినీ సజీవంగా ఉంచుతాను. సునీల్ మేనత్త కొడుకు రామరాజు, సుచిత్ర మేనమామ కొడుకు భీమరాజు వీళ్ళ ఇంటికి వచ్చారు."

"బావుంది. కొత్త మొహాలు ప్రవేశించాయి." అంది నీరజ.

"రామరాజు, భీమరాజు సినిమాకెళ్లి వస్తుంటే యాక్సిడెంట్ అయింది. ఇద్దరూ చచ్చిపోయారు."

"హరి హరీ ఈ చంపే గోల ఏమిటండీ?"

"మరి క్యారెక్టర్ వైండప్ చెయ్యాలిగా?"

"ఒక పాత్రను సృష్టిస్తే దాంతో కొంత కథ నడపాలి... వర్ణనలు, సన్నివేశాలు వుండాలి. చివర్లో చెయ్యాలి వైన్‌డప్పు! మొదటి వాక్యంలో సృష్టించి రెండో వాక్యంలో చంపేస్తూ వుంటే ఎవరు మిగుల్తారు? నవల ఎలా రాస్తారు మీ తలకాయ?" అంది విసుగ్గా.

మర్రోజు మరో మూడు పేజీలు రాశాడు... భార్యకు వినిపించాడు.

"తెల్లవారింది. చెట్టు మీద పిట్ట కూ...కూ అని కూస్తోంది. పనిమనిషి బర్రా...బర్రమని వాకిలి చిమ్ముతోంది. స్టౌ మీద నీళ్లు సల...సలా మరుగుతున్నాయి. పక్కింటి కాంతారావు ఖల్లు...ఖల్లు మని దగ్గుతున్నాడు."

"ఇక చాలు ఆపండి! ఏమిటీ శబ్దాలు? కథ ఏదీ?!" అని విసుక్కుంది.

"సరే సన్నివేశం రాస్తాను! నువ్వు వంట చేసుకో." అన్నాడు.

ఒక సన్నివేశం రాసి... వంటింట్లోకి పట్టుకెళ్ళాడు.

"సుచిత్ర సునీల్ ఆఫీసుకు వెళ్ళగానే బకెట్లో సగం దాకా నీళ్లు పట్టి చారెడు టైడ్ పొడి వేసి అతని ప్యాంటు, షర్టు, అండర్‌వెర్స్, తన చీర, జాకెట్టు, అండర్ వేర్స్...నానబెట్టి బండకేసి బాది నీళ్ళలో బాగా జాడించి పిండి దులిపి... తాడు మీద ఆరవేసింది." అంటూ సన్నివేశం చదివి భార్య వంక చూశాడు.

"ఆవదం తాగినట్టు ఏమిటి మొహం అట్లా పెట్టావ్?" అన్నాడు విసుగ్గా!

"మీరు రాసింది విని! అసలు మీరు ఏం రాయదలచుకున్నారూ?" నిలదీసింది.

"ఏమో ఇంకా ఏమీ అనుకోలేదు ఆ విషయం గురించి." అన్నాడు.

"అంటే ఓ కథ అని అనుకోలేదా?"


"అలా ఏం అనుకోలేదు. ఎప్పటికప్పుడు బుర్రలో ఏం ఆలోచన వస్తుందో... అది రాసేస్తాను!" అన్నాడు.

"బాగానే వుంది సంబడం. అలిగి ఇంట్లోంచి వెళ్లిపోయి ఎక్కడికి వెళ్ళాలో తెలియక ఏబ్రాసి మొహం వేసినట్లు ఓ కథ అంటూ లేకుండా నవల మొదలు పెడితే అది ఇలానే ఏడుస్తుంది. ముందు ఒక విషయం



## సరసి జనాభ సోదరి

## విజయానందం



**నా**కు చాలామంది అక్కలు... ఆత్మీయంగా మాట్లాడితే చాలు వాళ్ళ డేటాఫ్ బర్తులు తెలుసుకోకుండానే 'అక్కా' అని పిలిచేస్తా. వాళ్ళు కూడా 'తమ్ముడూ' అని పిలిచేస్తారు. ఆ పిలుపే నాకు ఆనందం.

అలా పిలిచే ఓ అక్క విజయలక్ష్మిగారు. 'మీతో మాట్లాడ్డమే ఓ 'కోఎడ్యుకేషన్' అంటూ వుంటా. ఎందుకంటే ఆమెతో కబుర్లు చెబుతూ వుంటే నాకు బోలెడు కార్టూను ఐడియాలొస్తాయి మరి!

నాకే కాదు మొహాల్లో నవ్వు దీపాలు ఆర్పేసుకుని చీకట్లో మగ్గే వాళ్ళతో ఆమె నాలుక్కబుర్లు చెప్పేసరికి... వాళ్ళ మొహాల్లో నవ్వు కాంతులు విరబూస్తాయి.


ఓసారి ఓ పుణ్యక్షేత్రానికి ఈ అక్కయ్య బావగారితో కలిసి వెళ్ళి ఆ వూళ్ళో వుండే గుళ్ళన్నీ తిప్పి దర్శనాలు చేయించడానికి ఓ ఆటో మాట్లాడుకున్నారు. అన్నీ చూపించి సాయంత్రం రైల్వేస్టేషను దగ్గర డ్రాప్ చేస్తోంటే– "బాబూ అందరు దేవుళ్ళనీ చూపించినట్టేనా?" అని అడిగింది అక్క.

'సాయంత్రం వరకూ తెలిసిన దేవుళ్ళందర్నీ చూపించానమ్మా... మీరు వెళ్ళాక ఎవరన్నా దేవుడు తెలిస్తే ఫోను చేసి చెబుతా వద్దురు గాని." అన్నాడు ఆటో అబ్బాయి.

ఓ పెళ్లిలో కలిసాం మేము. "ఏంటే రత్నం. ఇలా చిక్కిపోయావ్? చక్కగా గుండ్రంగా వుండేదానివీ?" అంది అక్కయ్య.

మా రత్నం ఎప్పుడూ తలుచుకు నవ్వుకుంటూ వుంటుంది.

నవ్వించేవారి చుట్టూ నలుగురు చేరతారు. అక్కయ్యకి అభిమానులు వేలల్లో వుంటారు అందుకే! ఆమె రచనలు, ప్రస్థానం గురించి అందరూ ఎలాగూ చెబుతారు కదా? అందుకే నేనా అంశం టచ్ చెయ్యట్లా. తెలుగులో హాస్యరచయిత్రుల గణన ప్రారంభిస్తే నెంబరు వన్ అక్కయ్యే నా దృష్టిలో. నలుగురినీ నవ్వించే గొప్ప వరం ఇచ్చిన ఆ దేవుడు ఆమెకు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఓ తమ్ముడుగా మనసారా కోరుకుంటున్నాను. **– సరసి**



అనుకోండి. ఆ తర్వాత దానితో కథ అల్లండి." అని సలహా ఇచ్చింది.

ఒక గంట తీవ్రంగా ఆలోచిస్తే వచ్చింది కొత్త ఐడియా –"శుక్రగ్రహం మీదికి వెళ్తాడు హీరో. మార్స్ నుండి వస్తుంది హీరోయిన్. వాళ్లిద్దరూ శుక్రగ్రహం మీద పరిశోధనలు జరుపుతూ... ప్రేమించుకుంటూ చివరికి పెళ్లి చేసుకుంటారు ఎలా ఉంది నా నవల?" అని అని అడిగాడు.

"మన ఇంటికి తూర్పుదిక్కు ఎటువైపు ఉందో ఎప్పుడూ అనుమానమే మీకు. అటువంటిది శుక్రగ్రహం గురించి ఏం తెలుసని రాస్తారు?"

"గూగుల్‌లో చదివి రాస్తాను."

"మనకు కొంత తెలిస్తే మిగతా సమాచారం కోసం గూగుల్ మీద ఆధారపడవచ్చు. ఏమీ తెలియకుండా గూగుల్‌ని నమ్ముకుంటే సొర కాయ బుర్ర పట్టుకుని సముద్రం ఈదినట్లే."

"నువ్వొకతివి! నక్షత్రకుడు లాగా ప్రతిదానికి అడ్డు పడిపోతున్నావ్! ఇలా అయితే నేను ఏం రాయను? మా కొరసం వాళ్ళు చూడు. నేను ఏం చెప్పినా శభాష్ అంటారు." విసుక్కున్నాడు.

"మీకు తోడు పోయిన వాళ్లే మీ కొరసం వాళ్లు. ఎన్ని పంపినా తిరిగి రావటం తప్పించి నాలుగు కథలు అచ్చయిన వాళ్ళే లేరు... కొన్నాళ్ళు ఆ కొరసంను పక్కన పెట్టేసి మంచి కథలు చదివితే ఓ ఐడియా వస్తుంది." అని సలహా ఇచ్చింది. కొన్నాళ్ళు రాయటం మానేసి మంచి కథలు చదివాడు.

"వాళ్లంతా చాలా గొప్పగా రాశారు... నేను అలా రాయగలను అంటావా?" అన్నాడు కాస్త దిగులుగా.

"నిజంగా రాయాలని కోరిక ఉంటే, మొదలు పెట్టండి. వాళ్లంతా కూడా పుడుతూనే రాసే సారా?" ప్రోత్సహించింది

"ఏం రాయను?...మంచి కథాంశం దొర కాలి కదా!"

"మీ అనుభవాలు రాయండి."

"రాయటానికి ఏమున్నాయి? పెద్దలు కుదిర్చిన పెళ్లి, సంసారం, ఉద్యోగం, గానుగెద్దు జీవితం అంతేగా!" అన్నాడు నిరుత్సాహంగా.

"మీ జీవితం అంటే మీదే కాదు... మీరు చూసిన వ్యక్తుల గురించి." సలహా చెప్పింది.

"అంటే నీ ఉద్దేశం!"

"మీ తాతయ్యగారి గురించి రాయండి."

"ఎప్పటివో పాత చింతకాయ పచ్చడి లాంటి సంగతులు రాస్తే చదివేవాళ్ళు చదువుతారా?"

"కళ్ళకద్దుకుని చదువుతారు! జీవితమే ఒక పెద్ద కథ. అనుభవాలను అందంగా చెప్తే అంద రికీ నచ్చుతుంది... ఎక్కడో వెతుక్కుని ఏదో రాయటం కంటే మనకు తెలిసిన విషయం రాయటం సుఖం. సంధులు, సమాసాలంటూ కఠినమైన భాష జోలికి పోకుండా సరళంగా రాస్తే కళ్ళకద్దుకుని చదువుతారు." అంది.

శ్రీధర్‌కి భార్య సలహా తీసి పారేయాల్సింది కాదు అనిపించి, ఆరాత్రి సరిగా నిద్ర పట్టలేదు.

మర్నాడు పొద్దున్నే లేచి మొదలు పెట్టాడు.

కొండవారిపల్లె. మారుమూల ఓ కుగ్రామం. అందులో జన్మించాడు రాఘవరావు. ఆయనకు కాస్త జ్ఞానం వచ్చే సరికి స్వాతంత్ర్య పోరాటం ముమ్మరంగా నడుస్తోంది.... అంటూ మొదలు పెట్టాడు.

యాభై ఎకరాల సుక్షేత్రమైన భూమి వున్న ఆసామీ అయిన ఆయన రెండు జతల ఖద్దరు బట్టలతో, ఎంత నిరాడంబరంగా జీవించాడో దేశం కోసం ఏం త్యాగం చేశాడో రాశాడు. పిల్లలకు వారసత్వపు ఆస్తిగా నిస్వార్థం, పరో పకారం అందించిన విషయం రాశాడు... కేవలం నాలుగు వందల ఖర్చుతో కూతురి పెళ్లి ఎట్లా చేశాడో రాశాడు.

మొదలు పెట్టాక భూమిలోని జలలా పొంగి వచ్చాయి ఆలోచనలు.

రాస్తూ భావోద్వేగానికి గురయ్యాడు.

వింటున్న నీరజకి కళ్ళు చెమర్చాయి. పూర్తి చేసి పత్రికకు పంపించాడు. ఆడపిల్లను అత్తా రింటికి పంపించినట్టు గుండె బరువెక్కింది అతనికి.

కొన్నాళ్ళు గడిచాయి. ఒకరోజు అతనికి ఫోన్ వచ్చింది. మీరు రాసిన నవల ప్రచురణకు స్వీకరించామని.

ఎగిరి గంతులు వేశాడు శ్రీధర్. పరుగున వెళ్లి భార్యకి ఈ శుభవార్త చెప్పాడు.

రాసింది తనైనా మొత్తం ఘనత అంతా నీదే అన్నాడు. నీరజ ఆనందం అంతా ఇంతా కాదు. గ్రూప్‌లో పెడతానంటూ పరుగున వెళ్లి పోస్ట్ చేసేసింది.

అందరూ ఆశ్చర్యపోయారు... తోడల్లుడు రాస్తున్నాడని పంతానికి పోయి ఏదో రాసి పారేసే వుంటాడు అనుకున్నారు ఎగతాళిగా.

తీరా 'మహానుభావుడు' సీరియల్ మొదల య్యాక గొప్పగా రాశాడు అని మెచ్చుకున్నారు.

ఓ పెళ్ళిలో అతగాడి మామగారు "ఇతను మా చిన్నల్లుడు. రచయిత. పూర్వాభాద్ర అనే కలం పేరుతో రాస్తాడు." అని పరిచయం చేస్తుంటే గర్వం కలగాల్సింది పోయి మొహ మాటం వేసింది శ్రీధర్‌కి.

ఆ మాటే భార్యతో చెప్తే ముచ్చట పడింది.

"ఇదే రచయితకు వుండాల్సిన... ముఖ్య లక్షణం. ఇక మీకు తిరుగు లేదు పూర్వాభాద్ర గారూ!" అంది మురిపెంగా.






# డ్రామా ఈజీ! కామెడీ కష్టం!!



–జగన్నాథశర్మ

ఈనాడు యాజమాన్యం సినిమా నిర్మాణం వైపు దృష్టి సారించింది. సినిమాకు అనుగుణంగా చతురపత్రికలో ఏదేని నవల వచ్చి ఉంటే... సూచించమన్నది. సంపాదకవర్గం కిందా మీదా పడింది. ఆఖరికి శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మిగారి నవల 'ప్రేమలేఖ'ను సూచించింది. సినిమాతీశారు. సూపర్ హిట్టయిందది.

ఆ సందర్భంగా రచయిత్రిని ఆహ్వానించారు. ఈ నాడు కార్యాలయానికి అప్పుడొచ్చారు పొత్తూరివిజయలక్ష్మి. ఎక్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీఅట్లూరి రామారావు గారితో, ఛైర్మన్‌గారిని కలిశారు. వెనుతిరిగి వెళ్లిపోతూ... విపుల, చతుర సెక్షన్‌లోకి వచ్చారు. అందరినీ పలకరించారు. నన్ను పరిచయం చేశారామెకు. ఈ సంఘటన 1983లో జరిగింది. తర్వాత 1995 వరకూ విజయలక్ష్మి గారిని కలిసే భాగ్యం నాకు లభించలేదు. పుష్కరకాలం అయింది. చూపులు తప్పిపోయాయి అనుకున్నాను. కాని తప్పి పోలేదు. ఈ టీవీలో చీఫ్ స్క్రిప్ట్ రైటర్‌గా నేను జాయినయ్యాను. అప్పుడు మళ్లీ విజయలక్ష్మిగారిని చూశాను.

కామెడీ సీరియల్ కోసం మంచి కథ కావాలంటే... చెప్పేందుకు వచ్చారామె.

చాలా ఏళ్ల తర్వాత.. నవ్య వీక్లీకి సంపాదకుణ్ణి అయిన తర్వాత వారిని మళ్లీ నేను కలుసుకునే అవకాశం లభించింది. నవలలపోటీకి పోరు పెడితే నవల రాశారామె. మంచి నవల. ఒకరకంగా ఆత్మకథ. బహుమతి ఇచ్చాం... ఆ నవలతో నవ్య సర్క్యులేషన్ పెద్దమొత్తంలో పెరిగింది. ఆ సంగతి చెప్పి, థాంక్స్ అంటే...

“థాంక్స్ అని చెప్పి తప్పించుకోకు శర్మా! రాయడం మానుకుందామనుకునే వేళ మళ్లీ రాయించావు. తెగ రాయాలనిపిస్తున్నదిప్పుడు. రాసిందంతా నువ్వే వేసుకోవాలి.” అన్నారు.

“అంతకంటే భాగ్యం ఉందా?” అన్నాను.

రెండేళ్లయినా నవల ఊసే లేదు. అడిగితే ఇదిగో రాస్తున్నా! అదిగో రాస్తున్నానంటూ తప్పించుకునేవారు విజయలక్ష్మి.

“ఏమైంది మేడం! ఎందుకు రాయట్లేదు?” అనడిగితే–“ఆలోచిస్తే అంతటా హాస్యమే గాని, అనుభూతిస్తే అంతటా విషాదమేనయ్యా!” అన్నారు.

“డ్రామా రాయడం ఈజీనయ్యా! కామెడీ రాయడమే కష్టం.” అన్నారు.

ఒకప్పుడు ఇవే మాటలు... నేను ప్రముఖ రచయిత డి.వి. నరసరాజుగారిదగ్గర విన్నాను. బాగా చదువుకున్నవారూ, జీవితాన్ని బాగా వడబోసినవారు మాత్రమే అలా మాట్లాడగలరు. లేడీ మునిమాణిక్యం మా విజయలక్ష్మి గారు. కీర్తిశేషులు శ్రీరమణగారూ, నేనూ ఈ విషయమై చాలాసార్లు చర్చించుకున్నాం.



నేను అధ్యక్షుణ్ణయితే విజయలక్ష్మిగారు ముఖ్య అతిథిగానూ... ఆమె అధ్యక్షురాలయితే, నేను ముఖ్య అతిథిగానూ చాలా వేదికలు ఇద్దరం పంచుకున్నాం.

“చేతిగోళ్లు తీసుకుంటున్నప్పుడు, వేలికి గాయం అవ్వడం పెద్ద ట్రాజెడీ. అదే మార్నింగ్ వాక్‌కి వెళ్లి, మ్యాన్‌హోల్‌లో పడి మనిషి చనిపోవడం పెద్ద కామెడీ.” అన్నారోసారి విజయలక్ష్మిగారు.

“కామెడీ జనాన్ని ఏడిపించాలి. నవ్వించిందంటే...అది థర్డ్ క్లాస్ కామెడీ.” అన్నారు. వాటిని సమీక్షించలేకపోయాను. అధ్యక్షునిగా నాకప్పుడు మాటలు కరువయ్యాయి.

నా శ్రీమతి రమణితో చాలా చనువుగా ఉంటారామె. పెళ్లిభోజనాల్లో రమణి సరిగా వడ్డించుకోలేనప్పుడు... కల్పించుకుని, రమణి విస్తరినిండా వడ్డించడం విజయలక్ష్మిగారికి సరదా!

“ఎంత బాగా తింటే అంత మంచిది రమణీ! బాగా తినడం బ్యాంక్ అకౌంట్ లాంటిది. ఎంత బాగా తింటే... అంతగా ఇన్‌వెస్ట్ చేసినట్టనుకో!” అన్నారు.

“అన్నాన్ని ప్రేమించగలవారే అందరినీ ప్రేమించగలరు.” అని నవ్వారు.

విజయలక్ష్మిగారి భర్తపోయిన తరువాత ఆవిడ నాతో ఫోన్లో మాట్లాడుతూ– “అది కాదుశర్మా! అన్నిటికీ ఎక్స్‌పెయిరీ డేట్ ఉంటుంది. స్పష్టంగా పేర్కొని హెచ్చరిస్తారు కూడ. మనిషి విషయంలో ఎందుకా సౌలభ్యం లేకుండాపోయింది? తెలిస్తే జాగ్రత్తపడతాం కదా!” అన్నారు.

“హాస్యం అనేది...నవ్వించి పేలిపోయే డైనమైటయ్యా! నా హాస్యం నన్నే పేల్చేసింది... ఒకటి నిజం శర్మా! ఎంతటి దుర్దినానికైనా ఇరవై నాలుగుగంటలే టైం... ఆ రోజు గడిచిపోయిందీ...చీకటిపోయి వెలుగొస్తుంది. మళ్లీ అంతా మామూలే!” అన్నారు.

మామూలయ్యారు కొద్దిరోజులకి. నాకు కావాల్సింది అదే! మెదడుతో ఆలోచించేవారే భయస్తులు. హృదయంతో ఆలోచించేవారికి ఏ భయాలూ ఉండవు. విజయాలు వారివే!

అందుకే విజయలక్ష్మిగారంటే నాకు చాలా చాలా ఇష్టం... వారి రచనలంటే ఇంకా ఇంకా ఇష్టం.

# "అది నాకు నల్లేరు మీద బండి నడక!"

-శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి

**హాస్యం!... ఆనందం!... మరి మనకు హాస్యంతో ఆనందాన్ని పంచేవారు ఎంతోమంది ఉన్నా...మన ఇంట్లోనో... పక్కింట్లోనో... ఎదురింట్లోనో... జరుగుతున్న సంఘటనలు మనకెంత నవ్విస్తాయో... తన కలంతో మన కళ్ళెదుటే నిలుపుతారు. నవ్వులతో మనల్ని ఆనందింపజేస్తున్న... శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మిగారి పుట్టిన్రోజు జులై, 18 సందర్భంగా ఈ ప్రత్యేక సంచిక రూపొందించటం జరిగింది. తన రచనలతో మనల్ని నవ్వించే విజయ'లక్ష్మి'గారిలోని 'సరస్వతి'ని ఒకసారి ఈ ముఖాముఖీలో పరికిద్దాం!**



✦ **మీ గురించి మీ మాటల్లో వినాలని ఉంది....**

నేను 1953 లో జన్మించాను.మా నాన్నగారు వల్లూరి వెంకటకృష్ణమూర్తి గారు పిడబ్ల్యూడి లో ఇంజనీర్. అమ్మ సత్యవాణి. నాకు ఒక అన్నయ్య. పెద్ద చదువులు ఏమి చదువుకోలేదు.1970లో నాకు వివాహం జరిగింది మా శ్రీవారు శివరావు గారు రైల్వేలో ఇంజనీర్. మాకు ఇద్దరు పిల్లలు.అమ్మాయి శిరీష, అల్లుడు శ్రీనివాస్ అబ్బాయి ప్రవీణ్ కుమార్, కోడలు రాధ. ఒక మనవడు ఇద్దరు మనవరాళ్ళు. నాది స్నేహ స్వభావం. పదిమంది కావాలి అనుకునే కలుపుగోరు స్వభావం. సున్నితమైన మనస్తత్వం. అందరూ బాగుండాలి అని నా కోరిక. ఎవరికైనా మంచి జరిగితే సంతోషం కలుగుతుంది. అలాగే ఎవరైనా బాధ పడుతున్నారు అంటే మనసు విలవిలలాడి పోతుంది.

✦ **రచయిత్రిగా మారాలనే కోరిక కలగడానికి బలమైన సంఘటన ఏమైనా ఉందా?**

చిత్తరంజన్‌లో ఉండగా అక్కడ తెలుగు అసోసియేషన్ కార్యక్రమాలు నిర్వహించే వాళ్ళం. వాటిలో చిన్నపిల్లల కోసం చిన్న చిన్న స్కిట్లు రాశాను. అలా రాయటం నాకు ఎంతో తృప్తిని ఆనందాన్ని కలిగించింది. అలా రాయటం ప్రారంభించాను.

✦ **కథాంశాలను మీరు ఎలా ఎన్నుకుంటారు.**

నా జీవితానుభవాలు, మా కుటుంబంలోని వ్యక్తులు, నా కథల్లో ముఖ్యాంశాలు. సమాజంలో నేను చూసిన సంఘటనలను అంశాలుగా ఎంచుకొని కథలు రాయటం నా అలవాటు.

✦ **రచయిత్రిగా మీపై ఎవరి ప్రభావమైనా ఉందా?**

బీనాదేవిగారి ప్రభావం ఉన్నది. ఆమెకు నేను ఏకలవ్య శిష్యురాలిని.

✦ **ఈ మధ్య హాస్య కథలకు కొసమెరుపు ముఖ్యమంటున్నారు. ఈ 'కొసమెరుపులు' హాస్య కథలకు ఎంత వరకు అవసరం?**

ఏ కథకు అయినా కొసమెరుపు ముఖ్యమే. కొసమెరుపు లేని కథ పేలవంగానే ఉంటుంది. హాస్య కథలకు ఈ విషయంలో మినహాయింపు లేదు.

✦ **గొలుసు హాస్య నవల వ్రాయాల్సి వస్తే... మీతో పాటు ఎవరిని తీసుకుంటారు! ఎందుకు?**

చందుశైలజ, కొచ్చర్లకోట జగదీష్ వీరిద్దరిని తీసుకుంటాను. ఎందుకంటే నా శైలి వారిద్దరి శైలి కలుస్తాయి. గొలుసు నవల రాయడానికి శైలి చాలా ముఖ్యం.

✦ **ఎవరి హాస్య కథలు మీకు ఇష్టం?**

చాలామంది ఉన్నారు. బీనాదేవిగారు, భానుమతిగారు, బి.వి.రమణ రావుగారు, కవనశర్మగారు, తోలేటి జగన్మోహనరావుగారు, శ్రీరమణ, సోమరాజు సుశీలగారు, పలాని వారి కథలు అని కాకుండా కథ చదివి హాయిగా నవ్వుకుని... దాచుకుని పదే పదే చదువుకున్న సందర్భాలు కూడా వున్నాయి.

✦ **మీరు రాసిన నవలలు చాలా సిన్మాలుగా వచ్చాయి. అయితే 'ఫలానా' నవలని సిన్మాగా తీసుంటే బావుండు అని మీకు అనిపించిన నవలేమైనా ఉందా?**

మూడు నవలలు సినిమాగా వచ్చాయి. ప్రేమలేఖ– శ్రీవారికి ప్రేమలేఖ, సంపూర్ణ గోలాయణం–ప్రేమ ఎంత మధురం, శంకర్రావు పెళ్లి– ప్రేమ చిత్రం పెళ్లి విచిత్రం.

నేను రాసిన నవలలో కృష్ణపక్షం శుక్లపక్షం నవల సినిమాగా వస్తే బాగుంటుంది అని కోరిక. డైరెక్టర్ కె.వాసు గారికి ఈ కథ చాలా నచ్చింది. ఆయన ద్వార సినిమాగా తీయడానికి ప్రయత్నాలు జరిగాయి. కానీ దురదృష్టం ఆగిపోయింది. శ్రీరస్తు శుభ మస్తు నవల సినిమాకి బాగుంటుంది అని నాకు అనిపిస్తుంది

✦ **మీరు ఇప్పటివరకూ రాసిన నవలలో, మీకు బాగా నచ్చిన నవల? మీకు బాగా నచ్చిన పాత్ర ఏమిటి?**

ప్రేమలేఖ, ఆత్మకథ నవలలు నాకు చాలా ఇష్టం. కృష్ణపక్షం శుక్లపక్షంలో రాజేంద్ర, ఒక ప్రేమ కథ ఒక పెళ్లి కథలో ఆర్పికె నాకు చాలా నచ్చిన పాత్రలు.

✦ **ఒక గృహిణిగా, కథా రచయిత్రిగా, ఈ రెండు బాధ్యతలని మీరు ఎలా బాలన్స్ చేయగలిగారు?**

ఆడుతూ పాడుతూ చేసేశాను... ఇవి రెండూ కాక విమెన్స్ ఆర్గనైజేషన్‌లో కీలక మైన పదవి కూడా పోషించాను. నిజం చెప్పాలంటే రచనా వ్యాసంగం నాకు దేవు డిచ్చిన వరం. గృహిణిగా రొటీన్ నుంచి మార్పుగా రచనలు చేసుకుంటూ అమిత ఆనందాన్ని పొందాను.

✦ **నవల, కథ, ఈ రెండు ప్రక్రియల్లో ఏది రాయడానికి ఎక్కువ ఆసక్తి చూపుతారు?**

రెండూ ఇష్టమే.... కాకపోతే నవల రాయ డానికి చాలా ఓపిక శ్రద్ధ కావాలి. కథ త్వరగా రాసేయొచ్చు.

✦ **ఒక మంచి హాస్య కథ వ్రాయడానికి, మీరు తీసుకునే జాగ్రత్తలు ఏవిటి?**

ప్రత్యేకమైన జాగ్రత్తలంటూ ఏమీ లేవండి. హాస్య కథ అంటే అలవోకగా రాసేసు కుంటాను. అది నాకు నల్లేరు మీద బండి నడక.

✦ **స్వీయ అనుభవాలనుండి వచ్చే కథలూ, కల్పించి రాసే కథలలో ఎక్కువ శాతం ఏ పంథా మీరు అనుసరిస్తారు?**

నూటికి నూరుపాళ్ళు స్వీయ అనుభవాలు, నేను చూసిన సంఘటనలు ఆధారంగానే కథ రాస్తాను. అందులో ప్రాణం ఉంటుం దని నా ప్రగాఢ నమ్మకం. కల్పించి కథలు రాయటం చాలా చాలా తక్కువ. వెతికితే ఒకటో రెండో ఉంటాయేమో అటువంటి కథలు.

✦ **'వెబ్ పత్రికలు' పెరిగాయి. 'వర్డ్ ఫైల్'లో కథ వ్రాయడం వంటివి నిన్నటితరం రచ యితలకి ఇబ్బంది అవుతుందంటారా?**

ఏదైనా కొత్త విషయం నేర్చుకోవాలి అంటే కొంత వయసు వచ్చిన తర్వాత కొంచెం కష్టమే. కానీ సీనియర్ రచయితలు చాలా మంది అవన్నీ నేర్చుకొని ఉత్సాహంగా రచనలు చేసేస్తున్నారు. అది నిజంగా చాలా ప్రశంసించ తగిన విషయం.

రాయాలని ఆసక్తి ఉండాలే కానీ అటు వంటివన్నీ నేర్చుకోవడం బ్రహ్మవిద్య ఏం కాదు. అడ్డుకట్ట కూడా కాదు.

✦ **హాస్య రచన చేయడం కష్టమైన ప్రక్రియ, అలాంటి ఈ ప్రక్రియలో మంచి హాస్య రచయిత్రిగా పేరు తెచ్చుకోవడానికి మీరు అనుసరించిన మార్గం ఏమిటి? హాస్య రచనలు చేయాలనుకునేవారికి మీ సలహా ఏమిటి?**

మా ఇంటి వాతావరణం నేను హాస్య రచనలు చేయడానికి చాలా దోహద పడింది.

ఇంట్లో అందరూ సరదాగా నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ ఆహ్లాదంగా గడి పేసాం. మాకు కష్టాలు బాధలు లేవు అని కాదు...ఉన్నాయి కానీ... పెద్దగా పట్టించు కునే వాళ్లం కాదు. కాబట్టి నా ధోరణిలో నేను రాసుకుంటూ పోయాను.


హాస్యం రాయాలని ప్రత్యేకంగా ఏనాడూ ప్రయత్నించలేదు.... అది అలా జరిగి పోయింది అంతే.

మా ఇంట్లోని వాళ్ళనే పాత్రలుగా పెట్టి, మా ఇంట్లో జరిగిన సంఘట నల ఆధారంగా రాసేస్తే... నా రచనా విధానం పాఠకులకు నచ్చటం వల్ల ఇన్నేళ్లుగా హాస్యం రాయగలిగాను.

ప్రయత్నం అంటూ ఏమీ లేదు. భగవంతుడి కటాక్షం, పాఠకుల ఆదరణ నన్ను హాస్య రచయిత్రిగా నిలబెట్టాయి.

నిజాయితీగా చెప్పాలి అంటే నేను నిమిత్త మాత్రురాలిని.

ఇక రచయితలకు సలహా ఇవ్వటం విష యానికి వస్తే నాకు సలహాలు ఇవ్వటం రాదు. నాకు ఎవరు సలహాలు ఇవ్వలేదు కాబట్టి అనుభవం కూడా లేదు.












✦ **హాస్య ప్రధానంగా సాగే కథలలో కూడా సందేశం ఉండా లంటారా?**

ఏ కథలోనైనా సందేశం ఉంటే మంచిదే. కానీ సందేశం కోసమే కథ రాయటం అనవసరం. కథలో ముఖ్యంగా కావలసింది రీడబిలిటీ. మొదలుపెడితే చివరి దాకా చదివించగలిగితే చాలు. హాస్య కథలకు కూడా ఇది వర్తిస్తుంది.

✦ **మీరు ఏదైనా కార్టూన్ చదివి, దానిని కథగా లేదా నవలగా వ్రాసిన సందర్భాలు ఉన్నాయా? కనీసం అనిపించిన సందర్భం!**

లేదు. అటువంటి ఆలోచన రాలేదు. ఇప్పుడు మీరు చెప్తుంటే ఎవరైనా మిత్రులతో సంప్రదించి మీరు కార్టూన్ వేయండి నేను కథ రాస్తాను అని ప్రయత్నం చేయా లని అనిపిస్తోంది.

✦ **చాలామంది 'మంచి రచయిత కావాలంటే, ముందు మంచి పాఠకుడు అవ్వాలి' అని అంటారు మరి మీరేమంటారు?**

నూటికినూరుపాళ్ళు ఏకీభవిస్తాను.

✦ **కార్టూన్ల పై మీ అభిప్రాయం?... మీ అభిమాన కార్టూనిస్ట్ ఎవరు? ఎందుకూ?**

కార్టూన్ ఒక అద్భుతమైన ప్రక్రియ. జీవం ఉట్టిపడేలా బొమ్మ వేసి దాని కింద రెండు వాక్యాలు రాస్తే కడుపుబ్బ నవ్వుకుంటారు పాఠకులు. పది పేజీల కథ చెప్పే అంశాన్ని ఒక కార్టూన్ చెప్తుంది. ఏక శ్లోకీ రామాయణం ఏక శ్లోకీ భారతం లాగా అన్నమాట. కార్టూన్ అనగానే గుర్తు వచ్చే పేరు బాపు గారు, సుధామగారు, శంకుగారు, జయదేవ్‌గారు, రాగతి పండరి గారు, మల్లిక్ గారు... ఒకరా ఇద్దరా? ఎంతోమంది అద్భుతమైన కార్టూనిస్టులు ఉన్నారు మనకు. నా అభిమాన కార్టూనిస్ట్ సరసి. వారి కార్టూన్లలో ఆడవాళ్ళను కించపరచడం ఉండదు అందుకనే నాకు ప్రత్యేకమైన గౌరవం... నాకు కార్టూనిస్టులు అంటే అమితమైన అభిమానంతో పాటు... నాకు అది రాదు కదా అని కించిత్తు అసూయ కూడా.

> కార్టూన్ ఒక అద్భుతమైన ప్రక్రియ. జీవం ఉట్టిపడేలా బొమ్మ వేసి, దాని కింద రెండు వాక్యాలు రాస్తే కడుపుబ్బ నవ్వుకుంటారు పాఠకులు. పది పేజీల కథ చెప్పే అంశాన్ని ఒక కార్టూన్ చెప్తుంది. ఏక శ్లోకీ రామాయణం, ఏక శ్లోకీ భారతం లాగా అన్నమాట.

✦ **హాస్యానందం పత్రికపై మీ అభిప్రాయం?**

హాస్యం అంటే అందరికీ ఇష్టం. కానీ హాస్యానికి ఉన్న విలువ మాత్రం చాలా తక్కువ. విడిగా హాస్య కథలు అని పోటీ పెడితే తప్ప మామూలు కథల పోటీలో హాస్య కథకు బహుమానం రాదు. గొప్ప గొప్ప కథ సంకలనాలలో హాస్య కథకు తావు ఉండదు.

ఇటువంటి పరిస్థితులు నెలకొన్న సమయంలో హాస్యం కోసం అంటూ ఒక పత్రిక స్థాపించి నడపటం గొప్ప విషయం. విలువలకు కట్టుబడి, ఎటువంటి అసభ్యతకు తావు ఇవ్వకుండా, వెకిలి హాస్యం కాకుండా ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందరికీ అందిస్తూ నడుస్తున్న పత్రిక హాస్యానందం. ఒక హాస్య రచయిత(త్రి) లేదా కార్టూనిస్టు కోసం ఒక సంచిక మొత్తం కేటాయించటం హాస్య రచనలు చేసేవారుగా పేరుపడిన మాలాంటి వారికి ఊహకు కూడా అందని విషయం.

అందరూ తేలికగా చూసే హాస్యరసానికి పట్టం కడుతున్న హాస్యానందం వారికి హాస్య రచయిత్రిగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

ఇంటర్వ్యూ: **వద్లమన్నాటి గంగాధర్**



# విజయానందం

## 'హాస్యానంద లాస్య' పొత్తూరి విజయలక్ష్మి

## మనసు తేలికపడుతుంది...



**మీకో** సరదా ప్రశ్న.. మీకు తెలిసిన తెలుగు హాస్య రచయిత్రి పేరు చెప్పండి (పొత్తూరి విజయ లక్ష్మి గారి పేరు కాకుండా)....

తట్టలేదు కదూ?

ఇంకా ప్రయత్నించండి...

ఇంకా తట్టలేదు కదూ...

అవును!... పొత్తూరి విజయలక్ష్మిగారి పేరు తప్ప, ఇంకో వేరే పేరు తట్టదు.

హాస్యం అంటే చాలామంది... కథలో పాత్రలకి 'డింభకరావు', 'ఆండాళ్ళు'లాంటి పేర్లు పెట్టి, అదే హాస్యం అనేసుకోమని, మన చేతుల్తో మనమే కితకితలు పెట్టేసు కుని నవ్వేసుకోమంటారు.

కానీ హాస్యం అనేది సహజంగా ఉండా లని, నిత్య జీవిత సంఘటనల్లోంచి రావా లని, ఆరోగ్యంగా నలుగురితోనూ నవ్వు కునేలా ఉండాలనే ఉన్నత స్థాయి రచనలని మనందరికీ అందించిందీ, అందిస్తు న్నదీ...శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మిగారు.

ఎప్పుడైనా మనసు బాగాలేనప్పుడు... ఆవిడ రచనలు చదివి చూడండి...

హాయిగా నవ్వుతాము.

మనసు తేలిక పడుతుంది.

అందరూ శ్రీవారికి ప్రేమలేఖ సినిమా లోని హాస్యం అద్దిరిపోయిందని అంటారు. కానీ ఆ సినిమాకి ఆధారమైన విజయలక్ష్మి గారి'ప్రేమలేఖ' నవల చదవండి... సినిమా కన్నా చాలా రెట్లు ఆనందిస్తారు... మనస్ఫూర్తిగా నవ్వుకుంటారు!

విజయలక్ష్మి గారు హాస్యం మట్టుకే రాస్తారేమో అనేసుకునేరు... బహుముఖ ప్రజ్ఞాశాలి ఆవిడ.

ఆమె రచించిన పూర్వి, ఆత్మకథ పుస్త కాలు చదివి చూడండి... (విజయ)లక్ష్మిలో నున్న సరస్వతి కనబడుతుంది!

**–రవీంద్ర కంభంపాటి,రచయిత**



**హా**స్యం అంటే చిలకమర్తి, మునిమాణిక్యం, ముళ్ళపూడి, ఆదివిష్ణు అంటూ మగరచయితల పేర్లు బోలెడు ఏకరువు పెట్టచ్చు గానీ.... ఇప్పుడున్న ఏకైక హాస్య రచయిత్రి మాత్రం పొత్తూరి విజయలక్ష్మి అంటే కొందరికి 'కొంచెం కష్టం' కలగచ్చు కానీ నేనయితే ఢంకా బజాయించి చెబుతాను. అత్తగారి కథల భానుమతి గారి తర్వాత హాస్యం రాసే స్త్రీలే లేరనుకుంటూంటే 'విజయ'పతాక నెగురవేస్తున్నది ఈవిడే.

'కష్టాల కారుమబ్బుల అంచున... కలకలనవ్వుల హరివిల్లులు చూపించే' రచయిత్రి అని అవసరాల రామకృష్ణారావు గారు ఊరికే అనలేదు. 'లాఫ్టర్ ద బెస్ట్ మెడిసెన్' అనడానికి ఆవిడ కథలే కాదు, కబుర్లూ దాఖలాయే!

'పొత్తూరి విజయలక్ష్మి హాస్య కథలు' అనే పుస్తకం ఇప్పటికి ఏడు ముద్రణలు పొందింది. ఏడవ ముద్రణ ఈ 'ఏడు' వచ్చిందే! హాస్యానికి నేడు 'ఈడు' వచ్చిందంటే – ఆవిడ 'పాలనే' కారణం. హాస్యానికి ఆవిడ 'పోషణే' కారణం. 'శ్రీవారికి ప్రేమలేఖ' సినిమా కథా రచయిత్రిగా పొత్తూరి విజయలక్ష్మిగారు చాలామందికి తెలిసేవుంటారు. 'ఆనందమే అందం' అని నిరూ పించిన వారావిడ! 'కాసిని కథలు–కాసిని కబుర్లు' ఏవి రాసినా, ఏవి చెప్పినా పడీ పడీ నవ్వించడం ఆవిడకు 'పెన్ను'తో పెట్టిన విద్య. ఆంధ్రభూమి దినపత్రికలో ఆవిడ 'కొంచెం ఇష్టం–కొంచెం కష్టం' అంటూ కాలమ్ నిర్వహించడానికి పరోక్షంగా నేనూ కారణం అని చెప్పుకోవడం నాకు 'కొంచెం ఇష్టం!' ఆవిడతో బాటుగా 2015 మార్చి 15న ప్రముఖ హాస్య చమత్కార చక్రవర్తి కీ.శే. ముని మాణిక్యం నరసింహారావు గారి 117వ జయంతి ఉత్సవ సందర్భంగా మునిమాణిక్యం సాహితీపీఠంవారి హాస్యనిధి పురస్కారం నేనూ అందు కున్నానని గర్వంగా చెప్పుకోవడం కూడా 'చాలా ఇష్టం!'

'స్క్రిప్ట్ సిద్ధంగా వుంది సినిమా తీయండి' అన్నట్లుగానే – ఆవిడలో హాస్యానికి ఎన్నడూ కొదవలేదు. దానిని 'వెలికితీయండి' హాస్యానందం ప్రత్యేక సంచిక వెలువరించడం ఆ తీయదానికే ఒక తీపి కబురు అని విశ్వసిస్తున్నాను.

ఆవిడ అన్నట్లుగా హాస్యకథలకు సాహిత్య జీవన ప్రవంతిలో సింహభాగం దక్కాల్సే వుంది! **శృంగార హాస్య కరుణా రౌద్ర వీర భయానకా బీభత్సాద్భుత శాంతశ్చ నవనాట్యే రసస్మృతాః** అని నవరసాలలో హాస్యం ద్వితీయమే అయినా, నిజానికి అద్వితీయమైనది. 'ద్వితీయ' అంటే భార్య అనే అర్థమూ ఉంది. భార్య లేనిదే ఎలా పురుషుడి జీవితం పరిపూర్ణం కాదో, అలాగే హాస్యం లేనిదే ఎవరి జీవితమూ పరిపూర్ణం కాదు.

'కదిలేదీ కదిలించేదీ పరిపూర్ణపు బ్రతుకిచ్చేదీ – హాస్యమే! హాస్యంతో పొత్తు ఊరినప్పుడే మనిషి బ్రతుకులో విజయలక్ష్మి తాండవిస్తుంది. శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి గారి హాస్య రచనలు అలాంటి పరిపూర్ణతకు పాఠకులకు లభించిన వరాలు.

1982లో రాయడం మొదలుపెట్టి నాలుగు దశాబ్దాలుగా మూడువందల కథలు, పధ్నాలుగు నవలలు మూడు సినిమాలు, రెండు టీవీ సీరియల్స్,కాలమ్స్...ఇలా ఆవిడ రచనా 'చంద్రహారం' విలువైనది, కుటుంబ జీవన ఇతివృత్తాలే ప్రధానంగా – మానవ మనస్తత్వాలను జల్లెడ పడుతూ, అశ్లీలా, అసభ్యతలకు తావులేని, సంస్కారవంతమైన ఆశావహదృక్పథం హాస్య రచనలు పండించిన 'అన్నపూర్ణ' ఆవిడ. క్లుప్తత, గాఢత ఆవిడ హాస్యానికి రెండంచులు. 'సన్మానం'కు సమ్మానాలుగా నిలిపిన ఈ 'హాస్యానందలాస్య'కు నాకన్నా ఇరవై నెలలు చిన్నదే కనుక శుభాశీస్సులు. శతమానం భవతి. ఉర్వి అపూర్వి'– శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మిగారికి!!

**–సుధామ, 9849297958**



విజయానందం

# జీ పే

శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి
కథ

**"ఏవండీ... సర్వేశ్వరరావుగారి అబ్బాయికి ఎన్నేళ్ళు?"**
**తలెత్తి చూశాడు ప్రసాదరావు.**
**ఓ బీరకాయ చేత్తో పుచ్చుకుని నిలబడి వుంది సరస్వతి.**
**అలా హఠాత్తుగా అడిగేసరికి ఆయనకి గభాల్న గుర్తు రాలేదు.**
**ఆలోచించి గుర్తు తెచ్చుకుని సమాధానం చెప్పాడు.**

"మన కార్తీక్ కంటే మూడేళ్లు పెద్ద. అంటే ముప్ఫై ఐదు వుంటాయి."

"ఆహాఁ!" అని వెళ్లి పోయింది ఆవిడ.

భార్యకు సమాధానం చెప్పి వాస్తవంలోకి వచ్చిన ఆయనకి ఒళ్ళు మండిపోయింది.

పొద్దున ఫలహారం చేశాక సావకాశంగా కూర్చుని మందులు వేసుకుంటాడు.

బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ వగైరా ఆరోగ్య సమస్యలు చాలానే ఉన్నాయి ఆయనకి.

ఆరేడు మాత్రలు వేసుకోవాలి. మాత్రలు వేసుకోవటం మామూలు విషయం కాదు. వేరుశెనక్కాయలు వొల్చినట్లు వొలవాలి.

అదికాస్తా చేతుల్లోంచి జారిపోయి దొర్లుకుంటూ అక్కడ ఎక్కడికో పోయి నుంచుంటుంది. వెతుక్కుని తెచ్చుకునే సరికి తల ప్రాణం తోకకు వస్తుంది.

ఇంకో సమస్య కూడా ఉంది. అన్నీ వేసుకున్నట్లా ఏదైనా మర్చి పోయానా అని చూసుకుంటూ ఉండాలి. దీనికి చాలా ఏకాగ్రత అవసరం.

నేను మందులు వేసుకుంటున్న సమయంలో పలకరించి ఏకాగ్రత భంగం చెయ్యకు అని ఎన్నోసార్లు చెప్పాడు భార్యకి. అయినా వినదు. ఇప్పుడు అదే అయింది. బీపీ మాత్రల స్ట్రిప్ చేతిలో ఉంది. వేసుకున్నానా లేదా అని సందేహం వచ్చింది. దీనికంతటికీ కారణం అయిన భార్య మీద పీకలదాకా కోపం వచ్చింది.

"ఇదుగో సరస్వతీ! ఇట్రా... ఎన్నిసార్లు చెప్పినా బుద్ధి రాదా నీకు? ఇప్పుడు సర్వేశ్వరరావుగారి అబ్బాయి వయసు విషయం అంత అర్జెంటా?... మధ్యలో మాట్లాడించావు. మందు విషయం మర్చి పోయాను." అంటూ విరుచుకుపడ్డాడు.

"ఇంకా కాలేదా!... మందులు వేసుకోవడం?... ఎప్పుడనగా మొదలుపెట్టారు. అయి పోయిందేమో అనుకున్నాను." అనేసి వెళ్ళిపోయింది ఆవిడ.

"మొండి ఘటం. ఇక మారదు!" అని విసుక్కున్నాడు.

తీరిగ్గా కూర్చుని ఉండగా అడగొచ్చు కదా ఇటువంటి పిచ్చి ప్రశ్నలు అన్నీ. ఆహాఁ! అప్పుడు బెల్లం కొట్టిన రాయి లాగా మాట్లాడదు.

స్నానం ముగించి కూర్చుని విష్ణుసహస్రం చదువుకుంటుండగా వచ్చి– "ఏవండీ నైరుతి రుతుపవనాలు ఎప్పుడు వస్తున్నాయి?" అని అడుగుతుంది.

ఆవిడకు సమాధానం చెప్పేసరికి... ఏ నామం దగ్గర ఆగిపోయామో గుర్తుండదు. అటూ ఇటుగా మళ్లీ ఎక్కడో మొదలు పెట్టుకోవాలి.

మధ్యాహ్నం భోజనం చేసి పడుకుని నిద్ర పడుతూ ఉండగా "ఆదిభట్లలో విల్లాలు చవగ్గా ఉన్నాయిట కదా!... మీకేమైనా తెలుసా?" అంటుంది.

పడుతూ వున్న నిద్ర కాస్త తేలిపోతుంది. ఇక చచ్చినా



నిద్ర పట్టదు. పోనీ ఏమైనా ముఖ్యమైన విషయం మాట్లాడుతుందా అంటే... అన్నీ తలా తోకా లేని ప్రశ్నలే! వయసుతో వచ్చిన చాదస్తం. ఎంత చెప్పినా అర్థం కాదు. అవన్నీ ఏదో సర్దుకు పోవచ్చు... మరో క్లిష్ట సమస్య వచ్చి పడింది. ఇటీవల డబ్బు వ్యవహారం కూడా ఫోన్ లోకి వచ్చేసింది.

జీపే, పేటీయం వగైరా వాడుతున్నారు అందరూ. కూరల కొట్టు వాళ్లు కూడా ఐదువందలనోట్ ఇచ్చి చిల్లర ఉందా అని అడిగితే ... లేదు సార్! పేటీఎం చేసేయండి అంటున్నారు. ఆయన తోటి వాళ్ళు అందరూ అవే వాడుతున్నారు. ఇంకా పాత పద్ధతులే పట్టుకుని వేలాడు తున్నావేం ప్రసాద రావూ! అని ఎగతాళి చేస్తున్నారు. డబ్బు లావాదేవీల విషయంలో జాగ్రత్తగా వుంటాడు ప్రసాదరావు. వద్దులే ఈ గొడవ అనుకున్నాడు.

ఆయన వద్దనుకున్నా తప్పలేదు. కరోనా గొడవ వచ్చి పడ్డాక పాల వాడు, పేపర్‌వాడు, కేబుల్‌వాడు మేము రాలేము... ఆన్లైన్ పేమెంట్ చేసేయండి. అంటున్నారు. ఆయన కొడుకు ఆ ఊర్లోనే హైటెక్ సిటీ దగ్గర ఉంటున్నాడు. వారానికోసారి వచ్చి కనబడి వెళతారు. ఇదీ విషయం అంటే... అదెంత పని. అరనిమిషంలో చేస్తా! అన్నాడు. ఈయన భయపడుతూ ఉంటే ధైర్యం చెప్పాడు.

'మా పక్కింటి ఆవిడకి 82 ఏళ్లు. ఆకుకూరల దగ్గరనుండి , ఆక్సిజన్ సిలిండర్ దాక అన్ని ఆన్లైన్‌లో తెప్పించుకుంటుంది. అదేం బ్రహ్మ విద్య కాదు.' అన్నాడు.

"బోలెడన్ని మోసాలు జరుగుతాయిట. మన డబ్బంతా కాజేస్తారుట" అన్నాడు ప్రసాదరావు.

"మీకు నాలుగైదు బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నాయి కదా? ఒక చోట నుండి ఆపరేట్ చేద్దాం! అందులో ఎక్కువ డబ్బు లేకుండా చూసు కుందాం." అని ఉపాయం చెప్పి... ఒక బ్యాంకు ఖాతాలో పదివేలు మాత్రం వుంచి దానికి జీపే కి లింక్ చేశాడు. ఎలా వాడాలో దగ్గర కూర్చుని ఓపిగ్గా చెప్పాడు. కొడుక్కే పది రూపాయల చొప్పున పదిసార్లు పంపించేసరికి అలవాటయింది ప్రసాద్‌రావుకి.

ఎటొచ్చి భార్యతోనే భయంగా వుంది.

"ఇదుగో ముందే చెప్తున్నాను. నేను జీపే చేస్తున్నప్పుడు నువ్వు వచ్చి పిచ్చి ప్రశ్నలు వేయకు. అసలే నాకు కొత్త...డబ్బుతో వ్యవహారం. ఆ సమయంలో నాకు కాన్సెంట్రేషన్ కావాలి. నా జోలికి రాకు."అని చాలా సీరియస్‌గా హెచ్చరించాడు.

"ఏవిటది గీపేనా?" అడిగింది. సరస్వతి.

"నీ తలకాయ! 'గీపే కాదు జీపే. అంటే ఆన్లైన్‌లో డబ్బు పంపిం చడం. చాలా జాగ్రత్తగా ఉండాలి నువ్వు మధ్యలో దూరిపోయి పిచ్చి ప్రశ్నలు వేయకు." అన్నాడు.

"సరే! మీరు ఆ జీపేనో గీపేనో చేస్తుంటే ఆ ముక్క ముందే నాతో చెప్పండి. లేకపోతే గదిలోకి వెళ్లి తలుపు గడియ వేసుకుని హోటల్లో లాగా గది బయట 'డు నాట్ డిస్టర్బ్' అని అట్ట మీద రాసి పెట్టండి." అని సమాధానం చెప్పింది



ఏకైక తెలుగు హాస్య మహిళా రచయిత్రి

## విజయానందం



**హా**స్య రచనలు మన సమాజానికవసరం అని గట్టిగా నమ్మిన ప్రముఖ తెలుగు మహిళా హాస్య రచయిత్రి శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మిగారు.

హాస్య రచనల ద్వారా మంచి సందేశాన్ని బలంగా మనసుల్లోకి పంపవచ్చుని, తద్వారా మనసు తేలికబడుతుందని ఆమె బలంగా నమ్మారు. మానసిక ఆరోగ్యం బాగుంటే శారీరిక ఆరోగ్యం కూడా చాలా బావుంటుందని, అలా చేయగలగడం ఒక్క హాస్యానికి మాత్రమే సాధ్యమని వారు సదా విశ్వసిస్తారు.

వారి రచనలో రూపొందిన హాస్య నాటిక 'ఇంటింటి భాగోతం' (2018), TORI లో వచ్చిన వారి కథ 'మా ఇంటి రామాయణం', 'పూర్వి' కథల సంపుటి మొదలైనవి శ్రీమతి విజయలక్ష్మిగారిని హాస్య ప్రియులకు అత్యంత ఆప్త హాస్య రచయిత్రిగా పరిచయం చేశాయి. వారు రచించిన అనేక హాస్య నవలల్లో 'ఐ లవ్ యు డాక్టర్', ఓ 'ఒక ప్రేమ కథ', 'ఒక పెళ్లి కథ' బహుళ హాస్య ప్రజాదరణకు నోచుకున్నాయనడంలో అతిశయోక్తి లేదు.

దాదాపు ఏకైక తెలుగు హాస్య మహిళా రచయిత్రిగా నాలుగు దశాబ్దాలకు పైగా తమదైన హాస్యామృతాన్ని ఉదారంగా పంచుతున్న శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మిగారు తెలుగు హాస్య ప్రియులు చేసుకున్న అదృష్టమే అనక తప్పదు. **-శంకు**

ఓ నెల రోజులు గడిచాయి.

ప్రసాదరావు జీపేకి బాగానే అలవాటు పడ్డాడు.

కొడుక్కి పది రూపాయల చొప్పున కాకుండా బయటవాళ్ళకి వంద రెండు వందలు పంపించే స్థాయికి ఎదిగాడు.

'ఇదిగో నేను జీపే చేస్తున్నాను నా జోలికి రాకు' అని భార్యకు చెప్పి మరీ పని మొదలు పెడుతున్నాడు.

ఒకరోజు వీధి చివర ఉన్న బట్టల కొట్టుకి వెళ్లి తువ్వాళ్లు, దుప్పట్లు కొన్నాడు. రెండువేలు అయింది బిల్.

"క్యాష్ ఇస్తారా?" అన్నాడు ఆ కొట్టు ఓనరు కాంతారావు.

"ఈమధ్య క్యాష్ తీసుకు తిరగడం లేదు. జీపే వుంది." అన్నాడు దర్జాగా.

తీరా పేమెంట్ ప్రక్రియ మొదలుపెట్టేసరికి సర్వర్ డౌన్ అని వస్తోంది. జేబులో క్యాష్ లేదు. చచ్చేంత మొహమాటం వేసింది ప్రసాదరావుకి.

"పాకెట్ ఇక్కడే ఉంచండి రేపు వచ్చి తీసుకు వెళ్తాను..." అన్నాడు మొహమాటంగా.

"భలేవారే... తీసుకు వెళ్ళండి. ఇది పీక్ అవర్ కదా! అందుకే అవటం లేదు.కాసేపాగితే సెట్ అయిపోతుంది. ఇంటికి వెళ్ళాక నిదానంగా చేయండి." అని పేకెట్ ఇచ్చి పంపించాడు.

కొడుక్కి ఫోన్ చేసి జరిగినదంతా చెప్పాడు.

ప్రసాదరావుకి మొదటినుంచి అప్పులు, బాకీలు అల వాటు లేదు. పరాయివాళ్ళ డబ్బు పావలా తన దగ్గర ఉంటే పాము పిల్ల పక్కన ఉన్నట్లు ఉంటుంది ఆయనకి. వాళ్లది వాళ్ళకి ఇచ్చేదాకా తోచదు. ఇంటికి రాగానే మళ్లీ ప్రయత్నం చేశాడు... ఇంకా సర్వర్ డౌన్‌లోనే వుంది.


"రేపు చెయ్యచ్చు...అప్పటికీ అవ్వకపోతే కొట్టుకి వెళ్లి డబ్బిచ్చి వద్దురు గాని. ఒకటే టెన్షన్ పడిపోతున్నారు ఇలా అయితే బీపి పెరిగిపోతుంది." అని కోప్పడింది సరస్వతి.

భోజనం చేసి మంచం ఎక్కాక కూడా విసుగు చెందని విక్రమార్కుడిలాగా ప్రయత్నం చేయసాగాడు.

## ఈ నెల 'దినం'



**ఇంటర్నేషనల్ జోక్ డే -జులై,1**




పది గంటల ప్రాంతంలో అదృష్టం బాగుండి సర్వర్ డౌన్ బదులు ఎంటర్ గూగుల్ పిన్‌కోడ్ అని పట్టిక వచ్చింది.

ఎంటర్ చేశాడు. పే అని వచ్చింది. కాంతారావు నెంబరు రాసి పెట్టుకున్న కాయితం పుచ్చుకునే తిరుగుతున్నాడు సాయంత్రం నుంచి. నంబర్ ఎంటర్ చెయ్యటం మొదలు పెట్టాడు.

"నాకు తెలియక అడుగుతాను... ఇది బట్టలకొట్టు కాబట్టి సరి పోయింది. హోటల్‌కి వెళ్లి టిఫిన్ తిని బిల్లు కట్టే ముందర ఈ గిపే పని చేయకపోతే ఎట్లా?" పక్కనుండి అడగనే అడిగింది సరస్వతి.

కోపం వచ్చినా దృష్టి మరల్చకుండా సంయమనం పాటిస్తూ పని పూర్తి చేశాడు. డబ్బు వెళ్ళిపోయింది.

"సమయానికి వస్తాయి పిచ్చి అనుమానాలు నీకు!" అని భార్యను కోప్పడి నిద్రకు ఉపక్రమించాడు.

రెండు రోజుల తర్వాత బట్టల కొట్టు కాంతారావు ఫోన్ చేశాడు.

"ప్రసాదరావుగారూ! ఏమీ అనుకోకపోతే నా అమౌంట్ పంపిస్తారా? మీరు ఇవ్వరు అని కాదు. కానీ అప్పుడు బిల్లు రాసేశాను కదా అని బాకీల్లో రాయలేదు. ఆలస్యం అవుతుంది అంటే రాసుకుంటాను." అన్నాడు మర్యాదగా.

తెల్లబోయాడు ప్రసాదరావు.

"అదేంటి! అప్పుడే పంపించేశాను కదా!" అన్నాడు.

"నాకు రాలేదు!" అన్నాడు కాంతారావు.

ఉన్నపాటున లేచి బట్టలు మార్చుకుని షాప్‌కి వెళ్ళాడు. కాంతారావుకి చూపిస్తే – "అదీ సంగతి ఒక నెంబర్ పొరపాటుగా ఎంటర్ చేశారు మీరు. నాకు రావలసిన డబ్బు ఇంకెవరికో వెళ్ళి పోయింది." అని చెప్పాడు.

ప్రసాద్‌రావుకి కళ్ళు తిరిగినంత పనయ్యింది.


వెంటనే కొడుక్కి ఫోన్ చేశాడు.

తండ్రి కంగారు చూసి కంగారు పడిపోయి ఉన్నపాటున బయలుదేరి వచ్చేశాడు కొడుకు.

"మీరు కంగారు పడకండి. వేరేవరికో వెళ్లి పోయి ఉంటుంది ఎవరికి వెళ్ళిందో చూద్దాం. వాళ్ళకి ఫోన్ చేద్దాం!... వాళ్లు మర్యాదస్తులు అయితే తిరిగి ఇచ్చేస్తారు." అని నచ్చ చెప్పాడు.

నంబర్ చూస్తే కే. కాంతారావు అని వుంది. బట్టలకొట్టతను పీ.కాంతారావు... కె.కాంతా రావుకి ఫోన్ చేసాడు. సమాధానం లేదు.

ఆయనకి ఏడుపు వచ్చేస్తోంది. ఒకటా రెండా



రెండువేల రూపాయలు. చేజేతులారా ఎవరికో ధారపోశాను. ఇవన్నీ నాకు వద్దు రా...అంటే నువ్వు వినలేదు.ఒకసారి చేతిలో డబ్బు పడ్డాక ఎవ్వరూ తిరిగి ఇవ్వరు." అని గొడవ పెట్టేసాడు.

"జీపే చేస్తున్న సమయంలో నన్ను పలకరించద్దూ... అని లక్షసార్లు చెప్పాను. విన్నావా సరిగ్గా సమయానికి ఏదో పిచ్చి ప్రశ్న వేశావు నేను కాస్తా తప్పు నెంబర్ కొట్టి ఏడ్చాను. దీనంతటికీ కారణం నువ్వు!" అని భార్యను సాధించాడు.

కాసేపు నచ్చ చెప్పిన కొడుక్కి ఓర్పు నశించి పోయింది.

"పోతే పోయాయి. ఆఫ్టాల్ రెండు వేలు. హోటల్ నుంచి భోజనం తెప్పించుకుంటే అంతే అవుతుంది... మీరు ఊరికినే బాధపడి మీ ఆరోగ్యం పాడు చేసుకోకండి."అని గట్టిగానే చెప్పాడు.

అయినా ఆయన మనసు శాంతించలేదు. విసుగు చెందని విక్ర మార్కుడిలాగా రోజుకు మూడుసార్లు కే.కాంతారావుకి ఫోన్ చేస్తూనే ఉన్నాడు. అటునుంచి సమాధానం లేదు. ఎవడో ఆ శాల్తీ. అప్పనంగా నా డబ్బు తినీ కూర్చున్నాడు అని శాపనార్థాలు పెడుతున్నాడు.

"అసలు ఈ కష్టాలన్నీ ఆ జీపే వల్ల వచ్చాయి. ఇక దాని జోలికి పోకండి. పాత పద్ధతిలోనే డబ్బులే ఇవ్వండి ఎవరికైనా." అంది.

"బుద్ధి వచ్చింది... చెంపలు వేసుకుంటున్నాను! మళ్లీ దాని జోలికి పోను." అన్నాడు.

పది రోజులు గడిచాయి. ఆవేళ కూడా పొద్దునపూట జపం గట్రా అయ్యాక ఫోన్ చేసాడు.

మూడు రింగుల తర్వాత ఫోన్ తీసి– "హల్లో ఎవరండీ ?" అన్నాడు.

"మీరు కే.కాంతారావుగారేనా?" ఆత్రంగా అడిగాడు.

"అవును! తమరు ఎవరు?"

"నా పేరు ప్రసాదరావు. క్రిందటి నెల పదహారో తారీకు రాత్రి తొమ్మిది గంటలకు మీకు నేను జీపే ద్వారా రెండువేలు ట్రాన్స్‌ఫర్ చేశాను." అన్నాడు గబ గబా!

"అలాగా! మీకు శతకోటి వందనాలు బాబూ. మీ వంటి పుణ్యాత్ములు చేసిన సహాయం వల్ల బయట పడ్డాను." అన్నాడు.

గతుక్కుమన్నాడు ప్రసాదరావు. "ఎవరు మీరు?" అడిగాడు.

"మాది గుంటూరు జిల్లా జడవల్లి గ్రామం. పౌరోహిత్యం నా వృత్తి. కరోనాతో కొడుకు కోడలు మరణించారు. కంటిలో శుక్లాలు పెరిగి పని చేసుకోవడమే కష్టం అయిపోయింది. నాకు తెలిసిన ఒక పెద్దమనిషి ఈ విధంగా ఫోన్లో మెసేజ్ పెడితే ధర్మాత్ములు పుణ్యాత్ములు సాయం చేస్తారు అని చెప్తే మెసేజ్ పెట్టించాను.సాయం అందింది. ఒక కంటి ఆపరేషన్ అయింది. కంటికి శ్రమ అవుతుంది. ఓ పదిరోజులు ఫోన్ వాడకండి అన్నాడు డాక్టర్ అందుకే ఫోన్ తీయలేదు....

నేనెవరో తెలియకపోయినా సాయం చేశారు. మీకు సదా కృతజ్ఞుడిని. మీకు మీ కుటుంబానికి ఆయురారోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించాలని ఆ పరమేశ్వరుని ప్రార్థిస్తున్నాను." అన్నాడు

ప్రసాదరావుకి నోట మాట రాలేదు.

ఫోన్ కట్ చేసి అలాగే ఉండిపోయాడు.

## కేరాఫ్ హాస్యం



## విజయానందం

**పొత్తూరి** విజయలక్ష్మి గారి పేరు చెప్పగానే... వారు రాసిన మూడు వందలకథలు, ఇరవై నవలలూ మనకి గుర్తుకు వస్తాయి. రచయిత్రిగా వారు 1982 నుండి ఇప్పటివరకు సుదీర్ఘంగా హాస్య రచనలు చేస్తూ ఉండటం అనేది సాధారణ విషయం కాదు. ఇంత సుదీర్ఘ ప్రయాణం చేశారంటేనే, వారి కలం పదును ఏమిటో మనకు తెలిసిపోతుంది. నేను వారి హాస్య కథల సంపుటి చదివాను. ఆ సంపుటిలో ఏ కథకా కథే ఆణిముత్యం అనిపించింది. కుటుంబ నేపధ్యంలో సీరియస్ కథలు వ్రాసే మిగతా రచయిత్రులకు భిన్నంగా ఆలోచించి, హాస్యం వైపు అడుగులు వేయడమే విజయలక్ష్మిగారి మొదటి విజయం అని నేను భావిస్తాను. నేను వారితో కొన్నిసార్లు ఫోన్లో మాట్లాడడం జరిగింది. కొద్ది నెలల క్రితం విశాఖలో ఒక నలుగురైదుగురు మిత్రులు వారితో ఒక ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయడం... అందులో



ద్విభాష్యం రాజేశ్వరరావుగారు మరికొందరితో పాటు నేనూ పాల్గొ వడం జరిగింది. వారితో సాగిన ఆ మూడుగంటల ఆత్మీయ సమావేశం, మూడు క్షణాల్లా గడిచిపోయిందంటే అందులో అతిశయోక్తి ఏమీ లేదు. వారి గురించి రెండు ముక్కల్లో చెప్పాలంటే వారు స్నేహశీలి, నిగర్వి అని చెప్పొచ్చు.

పొత్తూరి విజయలక్ష్మిగారిపై హాస్యానందం ఓ ప్రత్యేక సంచిక తీసుకురావడం చాలా సంతోషంగా ఉంది. ఈ ప్రత్యేక సంచిక, వారి సాహితీ ప్రయాణంలో ఓ మైలు రాయిగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. ఈ విషయమై గౌరవ సంపాదకులు రాముగారు ఎంతో అభినందనీయులు. **–గంగాధర్ వడ్లమన్నాటి, రచయిత**

"ఏవండీ! సుధామయిగారు రెండో మోకాలిచిప్పకి ఆపరేషన్ చేయించుకుందా?" కొబ్బరిచిప్ప చేతిలో పట్టుకుని వచ్చింది సరస్వతి.

భర్త వాలకం చూసి ఆవిడకి కంగారు వచ్చేసింది.

"ఏవిటీ!? ఏమైంది?" అంది కంగారుగా.

అంతా చెప్పాడు.

ఆవిడకి కూడా జాలి వేసింది.

"పాపం ఎంత కష్టంలో వున్నాడో! అవసరంలో ఉన్న వాళ్ళని ఆదుకో గలగటం అన్నిటినీ మించిన అదృష్టం. దైవమే మీకు అదృష్టం కలిగించాడు. ఆ జీపే వల్ల మంచే జరిగింది." అన్నది.

"అవును!... వృద్ధాప్యమే దుర్భరం. అందులో ఆర్థిక దుస్థితి ఏర్పడితే మరీ నరకం!... ఆ దేవుడి దయ వల్ల నాకు ఏ లోటు లేదు పెన్షన్ వస్తుంది. ఆయనకి మరో రెండు వేలు జిపే చేస్తాను" అన్నాడు ప్రసాద రావు.



# విజయ విహారం



ఆరేళ్ళప్పుడూ...



పదహారేళ్ళప్పుడు.....






పెళ్లి ఫోటో... 1970 లో ప్రారంభమైన వైవాహిక జీవితం.



శ్రీమతి విజయలక్ష్మిగారి కుటుంబం(2017)



శ్రీవారికి ప్రేమలేఖ షూటింగ్ సందర్భంగా విశాఖపట్టణంలో...



శ్రీవారికి ప్రేమలేఖ 100 డేస్ ఫంక్షన్‌లో షీల్డ్ అందుకుంటూ...



పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ వారిచే షష్టిపూర్తి కలాలకు సన్మానం (2023)




చెన్నైలో కథాసాగర్ ఆవిష్కరణ- మాలతి చందూర్ దంపతులు, ఇంద్రగంటి జానకిబాల గారితో.



సుశీలా నారాయణ రెడ్డి అవార్డ్ 2022



ముళ్ళపూడి వెంకటరమణ అవార్డు 2022



పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ 'కీర్తి పురస్కారం'.



లేఖిని సంస్థ 'మాతృదేవోభవ పురస్కారం'



విజయనగరం విజయభావన వారి అవార్డు



అమృతలత హాస్య పురస్కారం



యద్దనపూడి సులోచనారాణి గారితో



బెంగళూరులో రచన పత్రిక ప్రారంభోత్సవం సందర్భంగా
శ్రీకాళీపట్నం రామారావు, శ్రీ వివినమూర్తిగారు,
కవనశర్మగార్లతో!



సాహితీ శిరోమణి
బిరుదు ప్రదానం (కావలి)



విజయానందం

# సుగుణకి దయ్యం పట్టింది

శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి

కథ

**సుగుణకి దయ్యం పట్టింది. పాత రోజుల్లో దయ్యాలు ఎక్కువగానే ఉండేవి. అర్ధరాత్రి తెల్లచీరె కట్టుకుని వికటంగా నవ్వుతూనూ, మిట్టమధ్యాహ్నం జుట్టు విర బోసుకుని గుడ్లురుముతూనూ బోలెడు మందికి కనిపించేవి. ఇక కొరివి దయ్యాలైతే కోకొల్లలు.**


ఆ తరువాత కాలంలో దయ్యాలూ లేవు భూతాలూ లేవు అంతా ఉత్తిదే అని కొట్టిపారేశారు జనాలు. మళ్ళీ ఇటీవల సినిమాలూ, టీవీ సీరియల్స్ పుణ్యమా అని దయ్యాల దశ తిరిగింది. ఎక్కడ చూసినా దయ్యాల కబుర్లే. అందుకే సుగుణకి దయ్యం పట్టింది అంటే... అవును పట్టే ఉంటుంది అనుకున్నారు అందరూ!

సుగుణ చాలా సౌమ్యురాలు. తెలివి కలది... తల్లిదండ్రులకు ఏకైక సంతానం... బి క్లాసు టౌన్‌లో వుంటారు. వాళ్లకి మెయిన్‌రోడ్డు మీదనే ఇల్లు. ఇంటిముందు రెండు కొట్లు. కిరాణా షాపులో నాన్న, ఫాన్సీ షాప్‌లో అమ్మా కూచుంటారు.

సుగుణకి పెళ్లిచేసి అల్లుడిని ఇల్లరికం తెచ్చుకుని వాళ్ళిద్దరికీ ఆ రెండు కొట్లూ అప్పగించాలని వాళ్ళ ఆలోచన. కానీ సుగుణకి మాత్రం ఇల్లరికం మొగుడంటే కంపరం. పెళ్ళిచేసుకుని ఎంచక్కా భర్త ఇంటికి వెళ్లి కొత్తింట్లో కొత్త మనుషులతో సుఖంగా ఉండాలని కోరిక.

ఇంటరు పరీక్షలు అయ్యాక ఓ రోజు కొట్లో కూచుని వుండగా క్లాస్‌మేట్ కుమారి ఓ మనిషితో షాప్‌కి వచ్చింది. అతన్ని చూసి నోరావలించింది సుగుణ. మనిషిని పోలిన మనుషులుంటారని విన్నది. డూప్లికేట్ అమితాబ్‌నీ షారూక్‌నీ చూసింది టీవీలో.అతగాడు డూప్లికేట్ ప్రభాస్‌లా వున్నాడు. అసలే ప్రభాస్ అంటే పిచ్చి సుగుణకి.

"ఏవిటలా చూస్తున్నావు? మా బావ... అచ్చు ప్రభాస్‌లా వున్నాడు కదూ?" అంది కుమారి.




సుగుణకి పైప్రాణంపైనే పోయింది.

కుమారికి ఓ బావ ఉన్నాడనీ... అతగాడితో తనకి పెళ్లి నిశ్చయం అయిపోయిందని... అందరికీ తెలుసు. మరదలితో పెళ్లి నిశ్చయం అయిపోయాక అతను ప్రభాస్‌లా వున్నా ఏమిటీ ప్రయోజనం? నీరసం వచ్చింది. పైకి మాత్రం నవ్వుతూనే– "ఈ బావతోనేనా నీకు పెళ్ళి?" అని అడిగింది.

"కాదు... కాదు! నా పెళ్లి మా నరసింహం బావతో. ఇతను మా వరాహం బావ." అంది కుమారి. పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లూ అయింది సుగుణకు.

సిగ్గుగా అతనివంక చూసింది.

'బతికించావు. నీ నరసింహం నీకే. ఈ వరాహం మాత్రం నాకు!' అనుకుంది.

అమ్మ నాన్నలని పీక్కుతిని, వద్దు వద్దు అని అందరూ అంటున్నా వినకుండా నెలతిర క్కుండాూ అతన్ని పెళ్లి చేసేసుకుంది.

దీని ఖర్మ ఇలా కాలింది అనుకున్నారు ఇరువైపుల చుట్టాలు స్నేహితులు.

వాళ్ళలా అనుకోడానికి తగిన కారణమే వుంది.

వరాహం చూడ్డానికి బావుంటాడు. డిగ్రీ పాసై కాస్త మంచిదే ఓ వుద్యోగం చేస్తున్నాడు. సుమారైన స్వంత ఇల్లు కూడా వుంది. హైదరాబాదు వంటి మహానగరాల్లో అటువంటి యావరేజ్ పెళ్లికొడుకులకి తలక్రిందులుగా తపస్సు చేసినా పెళ్లి కాదు గానీ చిన్న ఊళ్లలో పర్వాలేదు. కాస్త ప్రయత్నిస్తే పెళ్లి కుదురుతుంది. కానీ వరాహామూర్తి కథ వేరు. అతనిది ఓ విచిత్ర కుటుంబం. 'టి.వి.సీరియల్స్ చూసి మరీ అంత దుష్టులంటారా ఆడవాళ్ళలో!... అటువంటి కుటుంబాలుంటాయా?' అని విమర్శించే వాళ్ళని తీసుకొచ్చి... వీళ్ల ఇల్లు చూపిస్తే, 'మనం చూడలేదు గానీ వున్నాయి అలాంటి కుటుంబాలు' అని ఒప్పుకుంటారు.

ఉమ్మడి కుటుంబం. యజమాని పేరు కేసరి. వుత్త వెర్రి గొఱ్ఱె. వేళ్టికి ఇంత తిని రామకోటి రాసుకుంటూ ఉంటాడు. ఉన్న ఆరెకరాలల్లో అయిదు ఎకరాలు అమ్మటం తప్పించి ఇంకే పనీ చేసి ఎరగడు.

ఆయన భార్య శాంత... ఆవిడని చెరిపించి ముగ్గురు సూర్యకాంతాలనీ, ఇద్దరు ఛాయాదేవులనూ చేయించుకోవచ్చు.

వారికి ముగ్గురు సంతానం. పెద్దది అనన్య. పెళ్లయింది. అత్తగారితో పడక. మొగుడిని వదిలేసి పుట్టింటికొచ్చింది. రెండోది అపురూప పెళ్లయింది. ఆవిడ గయ్యాళితనం భరించలేక మొగుడు వదిలేస్తే పుట్టింట్లో వుంది. మూడో వాడు వరాహమూర్తి. ఇద్దరాడపిల్లల తరువాత మగపిల్లాడు కావాలని సింహాచలం వెళ్లి కప్ప స్తంభం కావలించుకుంటే పుట్టాడు. అందుకే వరాహమూర్తిఅని పేరు పెట్టుకుని గారాబంగా పెంచుకున్నారు. చూపులకి గంభీరంగా వున్నా మెతక మనిషి వరాహం. జాలి గుండె.

ఆ ఇంట్లో ఇంకో శాల్తీ కూడా వుంది.

శాంతకి అక్కగారు రాజ్యం. ఆవిడ మొగుడు అప్పుడెప్పుడో ఉత్తరదేశ యాత్రలకు వెళ్లి తిరిగి రాలేదు. ఆయన వెళ్ళాక రెండుసార్లు కృష్ణా పుష్కరాలు వచ్చి పోయాయి... ఆవిడకి ఓ ఎకరం పొలం వుంది.నన్ను చూసుకున్న వాళ్లకి నా తదనంతరం ఆ పొలం ఇస్తాను అని చెల్లెలి దగ్గరే వుంది.




## జగమెరిగిన హాస్య రచయిత్రి
## పొత్తూరి విజయలక్ష్మి



**జ**గమెరిగిన హాస్య రచయిత్రి శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మిగారు. నిరంతరాయంగా హాస్యరసప్రధానమైన రచనలు చేస్తూ, ప్రసిద్ధ హాస్య రచయిత శ్రీముళ్ళపూడి వెంకటరమణగారితో సమానమైన గౌరవానికి అర్హత సంపాయించుకున్న ఏకైక రచయిత్రి.

హాస్యం రాసి మెప్పించడం చాలా కష్టం. అది కత్తిమీద సాము లాంటిది. కొద్దిగా అటూఇటు అయినా అపహాస్యం పాలయ్యే ప్రమాదముంది. అటువంటి కష్టసాధ్యమైన పనిని కొన్ని దశాబ్దాలుగా ఇష్టంగా చేస్తూ పాఠకుల్ని హాస్య రసాస్వాదనలో ముంచెత్తుతున్న మహా రచయిత్రి... గొప్ప విదుషీమణి... హాస్యరస సామ్రాజ్ఞి!

హాస్యరసాన్ని ఎంత అద్భుతంగా పండించగలదో, కరుణరసాన్ని కూడా అంతే ప్రతిభావంతంగా సృజించగల నైపుణ్యం ఆమె స్వంతం. ఆమె రాసిన నవల ఆత్మకథ చదివినా, తెలుగుసాహిత్యంలో వచ్చిన గొప్ప కథల్లో ఒకటిగా గుర్తింపబడిన 'సన్మానం' కథ చదివినా ఈ విషయం అర్థమౌతుంది.

పరిచయస్తులెవరైనా ఎదురుపడితే నవ్వుతూ మాట్లాడటం ఆమెకున్న మంచి లక్షణం. మాట్లాడుతూనే నవ్వించడం ఆమెకు దేవుడిచ్చిన గొప్ప వరం. మొదటి నవల 'ప్రేమలేఖ' తోనే ఆమె అసంఖ్యాకమైన అభిమానుల్ని సంపాయించుకున్నారు. ఆ నవల జంధ్యాలగారి చేతుల్లో పడి 'శ్రీవారికి ప్రేమలేఖ' సినిమాగా రూపుదిద్దుకున్నాక, ఆమె కీర్తి ఆంధ్రదేశంలో నలుదిశలా వ్యాపించింది.

ఆమె రచనల్లో ఎక్కువగా సునిశితమైన, నిర్మలమైన హాస్యం కన్పిస్తుంది. అధిక్షేపణ హాస్యం తక్కువ. ఆమె రాసిన 'స్క్రిప్ట్ సిద్ధంగా ఉంది– సినిమా తీయండి' మాత్రం పూర్తిగా సెటైరికల్ నవల. ఆమెకు బాగా పేరు తెచ్చిన నవల కూడా ఇది. తన అనుభవాలు, తనకు తారసపడిన మనుషులు, వాళ్ళ స్వభావాలు, తన చుట్టూ ఉన్న సమాజం... ఇవే ఆమె సాహిత్యానికి ముడి సరుకు. వూహాజనితమైన పాత్రలు తక్కువ.

ప్రసిద్ధ నవల 'ఆత్మకథ'లోని బల్వీందర్ నిజంగానే రచయిత్రికి అతి సమీపంగా మెలిగిన స్నేహశీలి. ఈ నవల చదవడం పూర్తయ్యాక, చాలా రోజులు ఏదో తెలియని వేదన మనల్ని వెంటాడుతూనే ఉంటుంది.

'కృష్ణపక్షం శుక్లపక్షం' నవల్లో ప్రసాద్ అనే పాత్రని ఎంతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దారు. మానసిక వైకల్యం ఉన్న స్త్రీని వివాహం చేసుకొని, ఆమె సంతోషం కోసం, అభ్యున్నతికోసం ఎలా పాటుపడ్డాడో చదివిన పాఠకులు ప్రసాద్‌ని ప్రేమించకుండా ఉండలేరు. అంతటి ఉదాత్తమైన పాత్ర... మానవత్వం, త్యాగనిరతి నిండుగా ఉన్న పాత్ర.

'పూర్వి','ఝుమ్రు' వంటి కథలు, 'శంకరరావు పెళ్ళి' వంటి నవలలు, 'జ్ఞాపకాల జావళీలు,' అనేక పత్రికలకు ఆమె రాసిన కాలమ్స్... ఇలా ఎన్నో రచనలు ఆమె ప్రతిభకు నిదర్శనాలు.

రచయితలకు కూడా అభిమాన రచయితలుంటారు. శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మిగారు నా అభిమాన రచయిత్రి. నన్ను సోదర సమానులుగా భావించి ఆత్మీయంగా పలకరించే సోదరి.

ఆమె రచనా వైభవాన్ని, విస్తృతిని చర్చిస్తూ, హాస్యానందం పత్రిక ప్రత్యేక సంచికను తీసుకొస్తున్న శుభ సందర్భంలో హాస్య సరస్వతి శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి గారికి అభినందనలు.

**–సలీం,రచయిత**

వామ్మో! ఒక్కరూ ఇద్దరూ కాదు నలుగురు గయ్యాళి గంగమ్మలు... ఆ కొంపలో పడేస్తే పిల్ల ఏం సుఖపడుతుంది? అని ఎవరూ ఆ ఇంటిగుమ్మం తొక్కలేదు... అలాంటి వాడికి మంచి సంబంధం కుదిరి పెళ్లయింది...అంటే ఆశ్చర్యపోయారు.

మొదటిరాత్రి గదిలోకి వెళ్లిన సుగుణ అక్కడి దృశ్యం చూసి తెల్లబోయింది. వరాహం భుజాన వున్న తువ్వాలుతో కళ్ళొత్తుకుంటు న్నాడు.


భార్యని చూడగానే ఏడుపు ఎక్కువయింది.

ఎందుకిలా ఏడుస్తున్నాడు?... కొంపతీసి ఎవరినైనా ప్రేమించాడా అనుకుంది... అతన్నే అడుగుదాం అనుకునేలోగా భార్యని కావలించు కుని, నీలాంటి భార్య దొరకటం నా అదృష్టం అని ఏడిచాడు.

సంతోషంతో కళ్ళు చెమ్మగిల్లుతాయని తెలుసు గానీ ఆనందంతో అలా ఏడుస్తారని తెలియ దేమో అయోమయంగానే "యాడవకండి! నిజా నికి మీలాటి భర్త దొరకటం నా అదృష్టం అంది." అది విని ఇంకాసేపు ఏడిచాడు.

కాపురానికి వెళ్ళాక ఇంట్లో అంతమందిని చూసి సరదా పడిపోయింది. పుట్టింట్లో అమ్మా నాన్నా. వాళ్లిద్దరూ ఎప్పుడూ కొట్లోనే వుంటారు. నిశ్శబ్దంగా ఉండేది ఇల్లు. ఇక్కడ బోలెడు మంది జనం. కావలసినంత సందడి.

అంత పనీ నెత్తిన వేసుకుని... చేసేయటం మొదలు పెట్టింది. ఆ నలుగురు ఆడవాళ్లకి




కోతికి కొబ్బరికాయ దొరికినట్లూ అయింది. దమ్మిడీ పనిచెయ్యరు. ఊరూరికే సాధించటం. చేసిన ప్రతి పనికీ పేర్లు పెట్టటం. అయినా భరించింది. ఎందుకంటే భర్తకి తనంటే ఎంతో ప్రేమ. తాను అడగాలేగానీ అప్పో సప్పో చేసి బతికుండగానే తాజ్‌మహల్ కట్టిస్తాడు.

తాను ఇష్టపడ్డ వాడికి తనంటే అమిత ప్రేమ వుంది... అది చాలు! మిగతా విషయాలు వేచి చూద్దాం అనుకుంది.

అలా ఓ మూడు నెలలు గడిచాయి.

ఒకరోజు అందరూ భోజనానికి కూచు న్నారు.

సుగుణ వడ్డన చేస్తోంది.

"మీనాన్నని అడిగి ఆ రెండు కొట్లూ అమ్మేసి ఆ డబ్బు నీకు ఇమ్మను." అంటూ మొదలెట్టింది శాంత. మిగిలిన ముగ్గురూ వంత పాట.

సాంబారు గిన్నె తీసి వాళ్ళ నెత్తిన దిమ్మ రించింది సుగుణ. కుయ్యో మొర్రో మంటూ పరిగెత్తారు నలుగురూ.

కేసరి తెల్లబోయి చూసాడు...గుడ్లురిమి చూస్తూ... వికటంగా నవ్వుతూ గదిలోకి వెళ్ళి పోయింది సుగుణ.

మధ్యాహ్నం కాఫీల వేళ్టికి అందరూ భయం భయంగా చూస్తుంటే గదిలోంచీ వచ్చి–

"అత్తయ్యగారూ! టిఫిను ఏంచెయ్యనూ?" అని అడిగింది మర్యాదగా.

ఆ తరవాత అదే తంతు...రాజ్యం కూచుని టీవీ చూస్తుంటే గుడ్లురుముతూ నీళ్ళబిందె నెత్తిన బోర్లించేసింది... తలకాయ బిందెలో ఇరుక్కుపోయి ఆవిడని ఆ బిందెతోనే రిక్షా ఎక్కించి ఇత్తడి సామాన్ల షాపుకి తీసుకు పోయి తీయించుకు వచ్చారు.

ఇంకో రోజు అత్తయ్యగారూ తలకి నూనె రాసి అంటుతా...అని చెప్పి మధ్యలో వికటంగా నవ్వుతూ మెడని అటూ ఇటూ తిప్పి వదిలి పెట్టింది. ఆవిడకి మెడ బెణికి నాలుగు రోజులు పాపం కుడి వైపుకే చూస్తూ వుండి పోవాల్సి వచ్చింది.

ఇంకోరోజు అర్ధరాత్రి జుట్టు విరబోసుకుని గుడ్లురుముతూ ఆడపడుచులని లేవగొట్టి ఇద్దరి జుట్లూ మెడదాకా కత్తిరించి పెట్టింది.

ఇది కచ్చితంగాగాలిచేష్ట ! అన్నాడు కేసరి.



వణికి పోయారు ఆ నలుగురూ. పుట్టింటికి పంపించాలని చూసారు.

వద్దు! నేను సుగుణని వదిలి ఉండలేను అని కళ్లనీళ్లు పెట్టుకున్నాడు వరాహం.

"మరెలారా? ఈ దయ్యంతో ఎలా వేగుతాం?" అంది శాంత.

"భూత వైద్యుడి చేత నయం చేయిద్దాం! అగ్నిసాక్షిగా పెళ్లి చేసుకున్న భార్యని వదలను. నాకు దయ్యం పడితే తను నన్ను వదిలేస్తే మీకెలా వుంటుందీ?" అన్నాడు.

ఇంతకీ పాపం సుగుణకి ఈ దయ్యం గోల తెలియదు... అందరూ కూచుని మధ్యలో సుగుణని కూచోపెట్టుకుని విషయం చెప్పారు.

"అయ్యో! నావల్ల మీకెన్ని కష్టాలు?!" భోరున ఏడ్చింది సుగుణ.

"నీ తప్పేం లేదు. ఆ దయ్యం వల్ల ఇదంతా! నువ్వేడవకు!... నేను చూడలేను!" అని కళ్లనీళ్లు పెట్టుకున్నాడు వరాహం.

"మరైతే ఏంచేద్దాం?" అంది.

"భూతవైద్యుడి చేత వైద్యం చేయించుకోవాలి. అది చాలా కష్టం. పొగ వేస్తాడు. వేపమండలతో కొడతాడు." అంది అపురూప.

వరాహం ఒకటే ఏడుపు. సుగుణే ధైర్యం చెప్పింది.

"గుండె పనితీరు మందగిస్తే ఆపరేషను చేయించుకోటం లేదా?... మోకాళ్ళు అరిగిపోతే ఇనప కీళ్లు పెట్టించుకోటం లేదా... ఇదీ అంతే! వైద్యం చేయించుకుంటాను. ఇదంతా ఖర్చుతోకూడిన వ్యవహారం. భూత వైద్యుడిని వెతకటం గట్రా బోలెడంత శ్రమ కూడానూ. ఇదంతా ఎవరు పడతారు? మా అమ్మకి చెప్తాను...అంతా వాళ్ళే చూసుకుంటారు. ఆడ పిల్లకి దయ్యం పడితే పుట్టింటివాళ్ళు ఆ మాత్రం చేయలేరా?"అంది.

ఆ నలుగురికీ నెత్తిన పాలు పోసినట్లూ అయింది.

సుగుణ తల్లికి ఫోన్ చేస్తే... ఆవిడ ఓ వారం తరవాత భూత వైద్యుడిని పంపించింది. ఈలోగా మూడుసార్లు వచ్చిపోయింది దయ్యం. చుట్టు పక్కల అందరికీ తెలిసి పోయింది ఈ రహస్యం.

ఓరోజు మధ్యాహ్నం వచ్చాడు భూతవైద్యుడు.

సుగుణ తలుపు తీసింది. మంచినీళ్లు కాఫీ ఇచ్చింది.

అందరూ వచ్చారు అక్కడికి.

"ఎవరికమ్మా దయ్యం పట్టింది?"అని అడిగాడు.

"నాకేనండీ!" అంది వినయంగా.

అదిరిపడ్డాడతను... "నీకా!!?" అన్నాడు.

"దీనికే! ఉత్తప్పుడు ఇదుగో ఇలా మర్యాదగానే వుంటుంది. దయ్యం పట్టినప్పుడు కాల్చుకుని తింటుంది." అంది రాజ్యం కోపంగా.

"అవునండీ భూతవైద్యుడుగారూ! త్వరగా దయ్యాన్ని వెళ్ళగొట్టండి." అన్నాడు వరాహం.

"అదెంతపని?... యిట్టె వెళ్లగొట్టేస్తాను... ఆ మధ్య గంగయ్యగారనే పెద్దాయన ఇంట్లో కోడలిని కాల్చి చంపేశారు... ఆ పిల్ల దయ్యమై ఇలాంటి పిల్లల మీద వాలుతోంది. మొన్న మా ఊళ్ళో ఓ అమ్మాయి మీదికి వచ్చింది. అప్పుడు నేను లేక పోవటంతో ఓ చేతా వాతా గాని భూత వైద్యుడు వెళ్ళగొట్టాలని చూసాడు. వాడి వల్ల కాలేదు. అది కాస్తా తప్పించుకు పోయింది. ఇప్పుడు ఈ అమ్మాయి మీదికి వచ్చినట్లుంది.



## హాస్యరస సామ్రాజ్ఞికి అభినందన

## విజయానందం



**మా**ది వరంగల్ అయినా ఉద్యోగరీత్యా వైజాగ్‌తో పాటు అనేక ప్రాంతాల్లో బాధ్యతలు నిర్వర్తించడం వల్ల, నాకు రచయితలు, రచయిత్రులతో ఎక్కువ పరిచయాలు లేవు.

నేను కథలూ, నవలలూ రాస్తున్నా, విరివిగా, రెగ్యులర్‌గా రాసే అలవాటు లేకపోవడం వల్ల పెద్దగా గుర్తింపు లభించలేదు. అందుకే, ఒక సాధారణ పాఠకుడిలా ప్రముఖ రచయితలు, రచయిత్రులను ఆరాధించేవాణ్ణి. యండమూరి వీరేంద్రనాథ్, మల్లాది వెంకటకృష్ణమూర్తి, పొత్తూరివిజయలక్ష్మిగార్లు అంటే మహా అభిమానం. కానీ, వాళ్ళ దగ్గరకు వెళ్ళాలంటే భయం కూడా ఉండేది.

హైదరాబాదు వచ్చాక నెమ్మది నెమ్మదిగా పరిచయాలు పెరిగాయి. నా 'సినీవాలి' నవల ఆవిష్కరణ సందర్భంగా, హాస్యరస సామ్రాజ్ఞి పొత్తూరి విజయలక్ష్మిగారిని సత్కరించుకోవాలని అనిపించి ఆహ్వానించాము. అప్పుడు ఆమె నన్ను 'తమ్ముడూ' అని పిలిచారు.

పొత్తూరి విజయలక్ష్మిగారు కేవలం హాస్య రచనలే చేయడం



కాదు. వారి సమక్షంలో మనం కేవలం శ్రోతలమయిపోయి, ఆ హాస్యరసగంగా ప్రవాహంలో తలమునకలవ్వాల్సిందే. అశువుగా ఆమె అలా హాస్యరస గుళికలు వదులుతుంటారు.


కొంతమంది రచయితలు బాగా పేరున్న వాళ్ళు పత్రికల్లో చాలా రసస్ఫోరకమైన విషయాలు రాస్తుంటారు. కానీ, వారి దగ్గరకు పర్సనల్‌గా వెళ్ళి కలిసినప్పుడు, మనకు నీరసరసం తప్ప, మనం ఉత్తేజితులమవడం అంటూ ఏమీ ఉండదు. కానీ, పొత్తూరి విజయలక్ష్మిగారు ఎదుటివారిని కలుపుకు పోతారు.

పొత్తూరి విజయలక్ష్మి గారు కేవలం హాస్య రచనలే చేయలేదు. 'పూర్వి' వంటి గొప్ప కథా సంపుటి కూడా ప్రచురించారు. అందులో 'పూర్వి' కథను చదివి నా కళ్ళు చెమర్చాయి.

పొత్తూరి విజయలక్ష్మి గారి వంటి హాస్యరచయిత్రి పుట్టిన రోజు సందర్భంగా, 18 జులై, 2021న, మా సినీవాలి వారపత్రిక ముఖ చిత్రంగా వారి ఫోటో వేసి, వారి గురించి సంపాదకీయమ్ రాసి వారిని ఆత్మీయంగా సత్కరించుకున్నాము.

సిస్టర్! ఈ పుట్టిన రోజు సందర్భంగా నా మనవి– ఒక మహాగ్రంథ రచనకు పూనుకోండి... నేను, మా ఫౌండేషన్ ద్వారా పబ్లిష్ చేస్తాను.

**–డాక్టర్ ప్రభాకర్ జైనీ, చీఫ్ ఎడిటర్, 'సినీవాలి' పత్రిక**




మొండిదయ్యం. వదిలించటం శ్రమతో కూడిన పని." అన్నాడు.

"నాకు ఎంత కష్టమయినా ఓర్చుకుంటాను. యెంత ఖర్చు అయినా పర్వాలేదు... మీరేదో పూజ చెయ్యాలికదా!... ఏమేం సరుకులు కావాలో చెప్పండి!" అంటూ ఓ తెల్లకాయితం పెన్నూ తెచ్చుకుని కూచుంది సుగుణ.

చెప్పటం మొదలు పెట్టాడు.

"ముగ్గు, ఎర్రని కుంకుమ, పసుపు, కుండ, నల్లదారం, సాంబ్రాణి, బొగ్గులు, నిమ్మ కాయలు, వేపమండలు..." రాస్తూ ఉండగానే 'హూ' అని హుంకరించి లేచి నిలబడి... జుట్టు విరబోసుకుని వికటాట్టహాసం చేసింది సుగుణ.

"అదుగోరా దేవుడా మళ్ళీ వచ్చింది!" అంటూ అందరూ పారిపోయారు.

అప్పటిదాకా వినటమే గానే దయ్యాన్ని చూడని వరాహం కూడా పరిగెట్టాడు.

ఓ అరగంట తరువాత మెల్లిగా ఒక్కొక్కరే వచ్చారు. హాల్లో భూతవైద్యుడు మాత్రమే నెత్తిన చెయ్యి పెట్టుకుని కూచుని వున్నాడు.


"అది ఏదీ?" అంది శాంత.

బయటికి పోయింది అని సైగ చేసాడు.

కాసిని నీళ్ళుతాగి పెదవి విరిచాడు.

"లాభం లేదండీ!... గంగయ్యగారి కోడలు కాదు. అసలు మన దేశం దయ్యం కాదు... విదేశం దయ్యం!... బోడేస్ కొవ్, వోడేస్‌కొవ్ అని మాట్లాడుతోంది. బహుశా రష్యన్ దయ్యం అనుకుంటాను." అన్నాడు.

"రష్యన్ దయ్యం ఇక్కడెందుకుంటుందీ? రష్యాలో ఉంటుంది గానీ..." అంది అనన్య.




"మనదేశం చూడ్డానికి వచ్చి... ఇక్కడే చచ్చి, దయ్యం అయి ఉంటుంది... మళ్ళీ అంత దూరం ఏంపోతాంలే అని... ఇక్కడే వుండి పోయిందేమో?" అన్నాడు.

"సరే... రష్యనో? ఫ్రెంచో? ఏ దయ్యం అయితేనేం వెళ్లగొట్టడానికి? వెళ్ళగొట్టండి." అంది అపురూప.

"అలా ఎలాగమ్మా? దయ్యానికీ భూత వైద్యుడికి కమ్యూనికేషన్ ఉండాలి కదా! నువ్వెవరో ఏమిటీ అని అడగాలి... ఎందుకొచ్చావు అని అడగాలి. తాను చెప్పాలి... అప్పుడు కదా వెళ్ల గొట్టేదీ? భాషే రాకపాయె... ఎలా వెళ్ళగొడ తాను?" అన్నాడు.

"మరైతే ఏం చెయ్యాలి?" అంది శాంత.

"రష్యను భాష తెలిసిన భూతవైద్యుడు బాగు చెయ్యగలడు. అలాంటి వాడికోసం వెతకాలి. నేనూ ప్రయత్నిస్తాను. మీరూ ప్రయత్నించండి. వెరీసారీ..." అనేసి వెళ్ళిపోయాడు.

అందరూ తలపట్టుకుని కూచున్నారు.

కాసేపటికి వచ్చింది సుగుణ .

చీకట్లో కూచున్నారేం ? అని లైటు వేసింది.

విషయం తెలుసుకుని– "అయ్యో! ఆ దిక్కుమాలిన రష్యన్ దయ్యానికి నేనే దొరికానా?" అని ఏడిచింది.

"ఊరుకో! దేశం అంతా గాలించి అయినా రష్యను భాష తెలిసిన భూతవైద్యుడిని వెతికి నీకు వైద్యం చేయిస్తాను...నువ్వేడిస్తే నేను చూడలేను!" అని కళ్లనీళ్లు పెట్టుకున్నాడు వరాహం.

రానురాను దయ్యం మరీ పెట్రేగి పోయింది. రాత్రిపూట లేపి ఏదో భాషలో ఏవిటో అడగటం... సమాధానం చెప్పలేక వెర్రిమొహం వేస్తే లెంపకాయలు... మొట్టికాయలు వెయ్యటం.

"నావల్ల కాదె తల్లీ! అక్కడెక్కడో ఏదో ఆశ్రమం ఉందిట. అక్కడికి పోతాను. నా పొలం వాళ్ళకే రాస్తాను!" అని వెళ్ళిపోయింది రాజ్యం.

అనన్య కూడా ఈ దయ్యం పట్టిన మరదలితో పోల్చుకుంటే మా అత్తగారు దేవత. అని మొగుడింటికి వెళ్ళిపోయింది.

అపురూపకు ఆ అవకాశం లేదు. ఆవిడ భర్త ఎప్పుడో మళ్ళీ పెళ్లి చేసుకున్నాడు. అపురూపకు హార్మణీ వాయించటం తెలుసు. ఓ భజన బృందంతో పరిచయం వుంది. వాళ్ళతో ఊరూరూ తిరుగుతూ రోజులు వెళ్లబుచ్చుతాను. కాలక్షేపంతో బాటు పుణ్యం కూడా వస్తుంది!" అని వెళ్ళిపోయింది.

అలా ఒక్కొక్కరే వెళ్తూవుంటే కళ్లనీళ్లు పెట్టుకుంది సుగుణ. నావల్లే ఇదంతా! నాకు నయం అయ్యాక మళ్ళీ వద్దురు గాని... అని బాధతోనే సాగనంపింది.

వంటరిగా మిగిలింది శాంత. నేనేం చెయ్యను?... మనం కూడా ఇల్లొదిలి వెళ్లిపోదామా అంది భర్తతో. జీవితంలో మొదటిసారి తనను సలహా అడిగిన భార్యని చూసి జాలి వేసింది కేసరికి. మనం ఈ వయసులో ఇల్లొదిలి ఎక్కడికి పోతాం?...నువ్వు గమనించావో లేదో ఆ దయ్యం నా జోలికి రాలేదు. కారణం నేను రామకోటి రాస్తున్నాను. రామనామం జరిగేచోట ఆంజనేయస్వామీ ఉంటాడు. ఆయనంటే దయ్యాలకు భయం. రేపట్నుంచీ నువ్వు కూడా రామకోటి రాయి!" అన్నాడు. మర్నాడే రామకోటి రాయటం మొదలు పెట్టిందావిడ.

పూర్తిగా కాదుగానీ దయ్యం ఉధృతి తగ్గింది. అదివరకులా చీటికీ మాటికీ రావటంలేదు. వచ్చినప్పుడు మాత్రం ఓ గంటసేపు ఆవిడని పీక్కు తింటోంది... ఆవిడ కూడా కోడలి జోలికి రావటానికి వణికి పోతోంది. అత్యవసరం అయితే తప్ప భర్తని వదలటం లేదు. మొత్తానికి ఇల్లు ప్రశాంతంగావుంటోంది.

ఓ రోజు సుగుణ తండ్రి కూతురికి ఫోన్ చేసాడు. "నీకో శుభవార్త మన గణేష్‌కి సీరియల్‌లో వేషం దొరికిందిట!" అన్నాడు.

"అలాగా చాలా సంతోషం! చాలా రోజులుగా ప్రయత్నం చేస్తున్నాడు." అంది సుగుణ.

"అవును! ఆ యింట్లో ఆరు దయ్యాలు అనే సీరియల్‌లో భూత వైద్యుడి వేషంట. ఇదంతా అక్క మహిమ... దాని ఇంట్లో భూతవైద్యుడిగా నటించిన అనుభవమే పనికొచ్చింది. అక్కకు థాంక్స్ చెప్పండి పెద్దనాన్నా అన్నాడు..." అని చెప్పాడు.

"నా బెస్ట్ విషెస్ చెప్పండి!" అంది సుగుణ. ఫోన్ పెట్టేసింది.

పెళ్ళికి ముందు జరిగింది గుర్తుకొచ్చింది– "నువ్వు ఇష్టపడ్డావని మాకు ఇష్టం లేకపోయినా పెళ్లి చేస్తున్నాం... ఏ మాత్రం కష్టం కలిగినా వదిలేసి వచ్చేయ్! ఇది నీ ఇల్లు!" అన్నాడు తండ్రి.

"పర్వాలేదు నాన్నా మరి పెళ్లంటే కాస్త సర్దుకుపోవాలికదా. ఇష్టపడి చేసుకున్న తర్వాత అది నాయిల్లు... నా సంసారం. నేనే దిద్దుకుంటాను. అవసరం అయితే సామ దాన భేద దండోపాయాలు వుపయోగించి అయినాసరే సాధిస్తాను. ఓడిపోయి మాత్రం పుట్టింటికి రాను నాన్నా!" అంది.

ఆ సంఘటన గుర్తొచ్చి నవ్వుకుంది సుగుణ.

నా మాట నిలబెట్టుకున్నాను అనుకుంది మనసులో.



## విజయానందం

**ఎందరో అమ్మ అని మనసారా పిలుస్తారు.**



**పొ**త్తూరి విజయలక్ష్మి గారితో నా పరిచయం దాదాపు పన్నెండు సంవత్సరాల కంటే పాతది. ఒకసారి అనుకోకుండా పొత్తూరి విజయలక్ష్మి హాస్య కథలు పుస్తకం దొరికినప్పుడు నా ఆనందం అంతా ఇంతా కాదు. నాకు శ్రీవారికి ప్రేమలేఖ కంటే శంకరరావు పెళ్లి నవల వల్ల అంతకు ముందే ఆవిడ తెలుసు. ఇంటింటి రామాయణం, కొంచెం కష్టం కొంచెం ఇష్టం లాంటి రచనలు చదివి మనసులోనే ఆవిడకి వీరాభిమానిని అయిపోయాను. ఆత్మకథ రచన చదివి చాల రోజులు బాధ పడ్డాను. జ్ఞాపకాల జావళి పుస్తకం చదివాకా ఇంక వారికి ఫోన్ చెయ్యకుండా ఉండలేకపోయాను.

ఆ తర్వాత నేను ఒకరోజు వారింటికి వెళ్ళాను.

వేళావిశేష మేమిటో కానీ నాకు ఆవిడ మాతృసమానురాలు అయ్యారు. ఎందరో ఆవిడని అమ్మ అని నోరారా... కాదు కాదు... మనసారా పిలుస్తారు.

రోజూ అందరూ మాట్లాడుకునే మాటలే అవ్వడం వల్ల అందరి మనసుల్లోకి అంతగా చొచ్చుకుని పోయాయి వారి చేతిలో ప్రాణం పోసుకున్న పాత్రలు.

పుస్తకాలు చదవడం పెద్దగా అలవాటు లేదని చెప్పే ఎంతో మంది చేత మళ్లీ చదవడం మొదలు పెట్టించిన ఘన చరిత్ర శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి గారికే చెందుతుందని గర్వంగా చెప్పగలను. ఇందుకు తార్కాణం, వారి హాస్య కథలు పుస్తకం తిరిగి రీప్రింట్ అవ్వడమే. అదీ ఏడవసారి.

వారి రచనలు చదివి చదివి నాకొక అలవాటు అయ్యింది. చాలా గంభీరమైన పరిస్థితిలో ఉన్నపుడు అనుకోకుండా అమ్మ గారి కథల్లో ఒక హాస్యఘట్టం గుర్తుకు వచ్చి, వెంటనే నవ్వడం మొదలెట్టేస్తాను.

వారికి దేవుడు ఆనందంతో, ఆరోగ్యంతో కూడిన చిరాయువు ని ఇవ్వాలని, ఇంకా ఇంకా మంచి రచనలు చేసి ఇంకా పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలని మాలాంటి వాళ్ళకి ఇంకా ఇంకా ఆనందం కలగజేయాలని మనస్ఫూర్తిగా భగవంతుని ప్రార్థిస్తున్నాను.

**–విస్సా రామక్రిష్ణ, ఒక అభిమాని, విశాఖపట్నం**



విజయానందం

# సైలింగ్ ఇన్ ది సేమ్ బోట్.

శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి
కథ

**ఉదయం ఎనిమిది గంటలయింది... కూరగాయల మార్కెట్‌లో సందడి మొదలైంది. తెల్లపంచె, తెల్లషర్టు వేసుకుని చేతిలో సంచి పుచ్చుకుని మార్కెట్‌లోకి వచ్చాడు కృష్ణారావు.**

**చాలా చిరాగ్గా వుంది అతనికి. నా ఖర్మ కొద్దీ దొరికారు ఈ కుటుంబం. అని వందోసారి తిట్టుకున్నాడు.**

ఆవేళ అతగాడి పెద్ద బావమరిది వస్తున్నాడు ఊరినించి. మామూలుగానే మాంచి పవర్‌ఫుల్‌గా ఉంటుంది అతని భార్య కృష్ణవేణి. ఇక రాత్రివేళ అసుర శక్తులు విజృంభించినట్లు వాళ్ల వైపు వాళ్లు వస్తే ఆ పవర్ నాలుగు రెట్లు పెరుగుతుంది.

వాళ్ళు నెలకోసారి వచ్చినా సరే జీవితంలో మొదటిసారి వచ్చినట్టు మర్యాదలు చేస్తుంది.

సరే పోనీ చెయ్యని... అని వూరుకుందాం అనుకునేటందుకు లేదు. భారం తనమీద పడు తుంది. అదేం విచిత్రమో... ఆ కుటుంబంలో అందరివి విలక్షణమైన రుచులు. తమ్మకాయ, కొబ్బరిపువ్వు, పనసగింజలు, నేతి బీరకాయ వంటివి కావాలి.

ఒక్కసారి చార్జీలు పెట్టుకొని ఈ గుంపుని కాశీకి తీసుకెళ్లి ఈ కూరలన్నీ అక్కడ వదిలించేసి తీసుకురావాలని కోరిక కృష్ణమూర్తికి.

ఇవాళ రాబోతున్న ఆ శాల్తీకి వాక్కాయ పచ్చడి ఇష్టంట. సంచి పుచ్చుకుని మార్కెట్‌కి వచ్చాడు. వాక్కాయలు ఎలా ఉంటాయో తెలియదు అతనికి. ఎవరినో అడిగితే అదుగో ఆ బండి మీద ఉన్నాయి చూడండి అన్నారు. తెలుపు, ఎరుపు, వూదా రకరకాలైన రంగుల్లో ఉన్నాయి. ఏమిటోయ్ అన్ని రంగుల్లో వున్నాయ్ అని అడిగాడు. వాక్కాయలు అట్లాగే ఉంటాయి సార్ అన్నాడు అతను.


ఇరుకున పడ్డాడు కృష్ణమూర్తి. ఒకమారు ఇలాగే బీరకాయలు ఎంత ముదురుగా ఉంటే అంత శ్రేష్టం అని ఒకడు చెప్తే నమ్మి తీసుకువెళ్లాడు. తల వాచేలాగా పడ్డాయి చీవాట్లు.

ఫోటో తీసి, వాట్సాప్‌లో అడుగుదాం అనుకుని ఫోన్ చేశాడు. చార్జింగ్ లేదు.

కడుపులో నుంచి దుఃఖం తన్నుకొచ్చింది. ఎప్పుడు ఇంతే! తను చార్జింగ్ పెట్టుకుంటే చాలు ఎవరో ఒకళ్ళు వచ్చి పీకేసి వాళ్ల ఫోన్ ఛార్జింగ్‌కి పెట్టుకుంటారు. పోనీ వాళ్ల చార్జింగ్ అయ్యాక తన ఫోన్ పెడతారా అంటే పెట్టరు. అనాథలాగా పడి ఏడుస్తూ ఉంటుంది తన ఫోన్.

ఏం చేయాలా అని చూస్తూ ఉంటే...తన లాంటి మనిషి అదే వయసు, అదే ఆహార్యం, అదే విధమైన అయోమయంతో అక్కడికి వచ్చాడు.

ఆయనకి ఆకాకరకాయలు కావాలి.



వెతుక్కుంటూ వచ్చాడు.

అతగాడి పేరు రామారావు.

ఆ బండి పక్కనే ఉన్నాయి ఆగాకరకాయ బండి. "కిలో ఎంత?" అని అడిగాడు.

"చాలా చీప్ సార్! కిలో రెండు వందలే!" అన్నాడు ఆ బండి అతను.

రామారావు గుండె దడదడ లాడింది.

"ఏమిటీ యాపిల్ కూడా ఉండవు అంత ధర." అన్నాడు.

"ఇవి ఎప్పుడూ ఇంతే సార్!" అన్నాడు ఆ అబ్బాయి.

రామారావు ఇరకాటంలో పడ్డాడు. ఆవేళ వాళ్ళింట్లో కిట్టీ పార్టీ. రెండుకిలోల ఆగాకర కాయలు తెమ్మని పంపించింది భార్యమణి సీతామహాలక్ష్మి. తీసుకువెళితే ఏమంటుందో, తీసుకోకపోతే ఏమంటుందో... ఏం చేయాలో తేల్చుకోలేక పోయాడు.

ఒకసారి ఇలాగే తన సొంత తెలివితేటలు ఉపయోగించి చవగ్గా ఇస్తున్నాడు కదా అని పదికిలోల దోసకాయలు కొన్నాడు. ఇంకో కిలో కొసరు వేసాడు కొట్టువాడు.

అవి తీసుకుని వెళ్లి ఇదిగో వీటితో చక్కగా దోసావకాయ పెట్టు అంటే తిట్టి పోసింది.

"మామూలు ఆవకాయలాగ దోసావకాయ ఏడాదికి సరిపడా పెట్టరు. ఓ పని చేయండి గోనె పట్టా, గొడుగు తీసుకువెళ్లి అట్లా వీధి చివర కూర్చుని అమ్మేసి రండి!" అంది భార్య.

ఇప్పుడు ఫోన్ చేసి కనుక్కుందాం అని భార్యకు ఫోన్ చేస్తే ఎంగేజ్! విసుగు వచ్చింది అతనికి.

కృష్ణారావుకి రామారావుని చూస్తే ఆశ కలిగింది.

"మాస్టారూ! ఒక్కసారి మీ ఫోన్ ఇస్తారా?.. నా ఫోను చార్జింగయిపోయింది." అన్నాడు.

ఆయన్ని చూడగానే... ఓ విధమైన గౌరవ భావం కలిగింది రామారావుకి.

ఇచ్చాడు... వెంటనే ఫోటో తీసి భార్య నెంబర్‌కి వాట్స్అప్ చేశాడు... నా ఫోన్లో చార్జింగ్ లేదు. ఈ నెంబర్‌కి మెసేజ్ పెట్టు అని మెసేజ్ పెట్టాడు.


రామారావు ఫోన్ చేస్తూనే ఉన్నాడు... మామూలుగానే రోజులో 14 గంటలు ఫోన్లో మాట్లాడుతూ ఉంటుంది ఆయన భార్య. మరి ఆవేళ కిట్టీపార్టీ కూడానూ... ఎంగేజ్!

"కాస్త నీడలోకి వెళదాం రండి!" అన్నాడు కృష్ణారావు. ఆ పక్కనే మూసేసిన కొట్టు, దాని ముందు ఒక బెంచీ ఉన్నాయి.

అక్కడ కూర్చున్నారు ఇద్దరూ. పరిచయం చేసుకున్నారు. ఇద్దరికీ ఇద్దరు ఉన్నత పదవులు నిర్వహించి ఇటీవలే రిటైర్ అయ్యారు. దర్జాగా పెన్షన్ పుచ్చుకుంటున్నారు.




## సాహిత్యం అర్థం, పరమార్థం తెలిసిన విదుషీమణి



శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మిగారిని హాస్య రచయిత్రి అన్నారు– పాఠకులూ, విమర్శకులూ, పండితులున్నూ!

నవ్వు నానావిధాలు అని వాటి పేర్లని కూడా కవి తిక్కనగారు రూఢి చేసారు. నవ్వు నాలుగు విధాల చేటు–అని తెలుగు నానుడి. కాని విజయలక్ష్మిగారికి చేటు కాని, చేటు చేయని నవ్వుని పండించడం తెలుసు. పాఠకుని పెదవులు కదిలీ కదలకుండా – అలతి నవ్వుతో ఆనందింపజేయడం ఆమెకు తెలిసిన రసవిద్య.

300 పైగా కథలు, 20 నవలలు, 3 సినిమాలు, 2 సీరియల్స్ ఆమె సాహిత్య కృషిఫలం. అన్నిటా శుచీశుభ్రం. శుద్ధిబద్ధం కలిగిన హాస్యం. ఆమె ఆనాటి నవల 'ప్రేమలేఖ' ఈనాటికీ 'ఆహా' అనిపించే సంస్కారవంతమైన హాస్య ప్రకరణం.

విజయ లక్ష్మిగారి కథల్లో హాస్యం కోసం వేసే కుప్పిగంతులూ, చేసే వెకిలి చేష్టలూ వుండవు. ఏదీ కృతకంగా, కృత్రిమంగా, అశుద్ధంగా ఉండదు.

విజయలక్ష్మిగారి రచనల్లో హాస్యం–అధిక్షేపంగా నిలవేస్తుంది. వ్యంగ్యంగా ఆలోచింపజేస్తుంది. మనుషుల స్వభావాల్లోని వైరుధ్యాల్ని పట్టుకుని–ఒక నిరసననో, ఒక తిరస్కారాన్నో ఆలోచనాప్రేరకం చేస్తుంది. విజయలక్ష్మి గారికి తెలుగు ఆచారవ్యవహారాలూ, సంప్రదాయం, కుటుంబ సంబంధాలు, మానవ సంబంధాలూ–ఆరోగ్యకరంగా నిలవాలని ఆకాంక్ష. వాటిని 'నిలుపుకోండ్రా' అని సున్నితంగా ఆమె మనల్ని హెచ్చరిస్తారు.

ఆమె సాహిత్యంలో అత్యంత విలువైన మెరుపు 'పాజిటివ్' దృక్పథం. ఏ కథా విషాదాంతం కాదు. 'చంద్రహారం' కథ పెద్ద ఉదాహరణ. ఒక మనవడు మామ్మగారి చంద్రహారాన్ని, పట్టుబట్టి వేలంలో అధిక వెలకు కొనుక్కుంటాడు. వారూ వీరూ తిట్టినా, అతనంటాడు– 'వాళ్ళకంటికది పాత బంగారం కావచ్చు కానీ నాకు మాత్రం అది మా మామ్మకు ప్రతిరూపం. మమ్మల్ని అందరినీ ఆదుకున్న కల్పతరువు. చెక్కుచెదరకుండా అలా వుండిపోవలసిన గుర్తు' అని. ఇదీ–కథని అనుభూతిప్రదం చేసే మమతల ప్రతిఫలం!

'తిథి–నక్షత్రం', 'పొగ', 'సన్మానం', 'అప్పిచ్చువాడు', 'బాలరాజు కథ' వంటి కథలు చదివీ–నేను ఆమె కేవలం హాస్య రచయిత్రి మాత్రమే అనే ముద్రను ఒల్లనివాడనైనాను. అవన్నీ గుండె పట్టేసినట్లు మనల్ని అతలాకుతలం చేసేస్తాయి. కన్నుని చెమరింపజేస్తాయి. ఆమె కథాశిల్ప మర్మజ్ఞతకు జయధ్వానం చేయిస్తాయి.

విజయలక్ష్మిగారి రచనల్లో అత్యంత విలువైన శైలీ విశేషం–తెలుగు పలుకుబడీ, నుడీ, నానుడీ, సామెతల గుబాళింపు. అందునా కొన్నిటిని కవితాత్మకంగా చెప్పటం కళాత్మక సాఫల్యం.

విజయలక్ష్మి గారు సాహిత్య సభల్లో చాలా సరదాగా ప్రసంగిస్తారు. 'రిపార్టీ'తో అలరిస్తారు. వాక్యాల్లో చాలా చెణుకులూ, చమత్కారాలూ తళతళలాడతాయి. ఆ ప్రసంగమొక హైలైట్! ఆమె హాస్యం ఆలోచనా ప్రేరకంగా సాగుతుంది. లోకజ్ఞత వాస్తవికత, వర్తమానత – ఆమె రచనలో, మాటల్లో, ప్రసంగంలో – సిల్హౌటీలో దర్శనమిస్తూ వుంటాయి.

విజయలక్ష్మిగారి సాహిత్య వ్యక్తిత్వం గురించీ, వ్యక్తిత్వం గురించీ, 'హాస్యానందం' ఇలా ప్రత్యేక సంచిక తేవటం చాలా ఆనందాన్నిస్తోంది... వారికీ, వీరికీ, చదువరులకూ, అభినందనలు!!

**–విహారి, 9848025600**

“రిటైరయ్యాక...ఇంకెక్కడా జాబ్ చెయ్యటం లేదా?” అని అడిగాడు కృష్ణారావు.

బరువుగా నిట్టూర్చాడు రామారావు.


“లేదండి! అదే నేను చేసిన బుద్ధి తక్కువ పని. చేసినన్నాళ్లు చాకిరీ చేశాను. ఇక ఇంటి పట్టున ఉండి విశ్రాంతిగా ఉందామనుకున్నా. విశ్రాంతి లేదు. మనశ్శాంతి లేదు.” అన్నాడు.

“నా పనీ అంతే! నోరు మూసుకుని ఊరు కోక.. ఇకనుండి బయట పనులు... బజారు పనులు... నేనే చేస్తాను అని నా గొయ్యి నేనే తవ్వుకున్నాను.” అన్నాడు కృష్ణారావు.

“నిజమే! బయట ఎన్నో క్లిష్ట పరిస్థితులు ఎదుర్కున్న అనుభవం ఇంటిపనుల విషయంలో పనికి రావటం లేదు... ఎప్పటికీ అప్పుడే పరగడుపన్నట్లు ఉంది.” చెప్పాడు రామారావు.

“మా బాగా చెప్పారు. ఎవరైనా వస్తారు అనుకోండి. వాళ్లతో గలగలా మాట్లాడితే ఏమిటా వాగుడు. ఎప్పుడో మీరు ఉద్యోగంలో ఉన్నప్పుడు ఎదురైన అనుభవాలన్నీ ఆ జానకి గారికి చెప్పటమెందుకు?... అని విసుక్కుం టుంది. అలా అని నోరు మూసుకుని ఉంటే మావాళ్ళు వస్తే... బెల్లంకొట్టిన రాయిలా కూర్చుంటే వాళ్లు ఏమనుకుంటారు అంటుంది చచ్చిపోతున్నాం అనుకోండి...” అన్నాడు కృష్ణారావు.

“విజయవంతమైన జీవితానికి ఉపాయాలు, డబ్బు సంపాదించడానికి మార్గాలు... అని పుస్తకాలు రాశారు గానీ ఇంటిపట్టునే ఉంటూ భార్య మనసు గ్రహించి ఆనందపరచడం ఎలా అని ఎవరు పుస్తకాలు రాయలేదు.” అన్నాడు




రామారావు.

“ఎవరికైనా తెలిసి ఏడిస్తేగా రాయటానికి!” అన్నాడు కృష్ణారావు.

వాళ్ళు మాట్లాడుకుంటూ ఉండగానే... ఆ కొట్టు అతను వచ్చాడు.

అతను లేవమనకుండానే లేచారు ఇద్దరూ.

“మీ మెసేజ్ రాలేదు. నాకు ఫోన్ కలవడం లేదు. ఆఖరిసారిగా ప్రయత్నం చేద్దాం. మీరు మళ్లీ మెసేజ్ పెట్టండి!” అని ఫోన్ కృష్ణారావు ఇచ్చాడు.

మళ్లీ మెసేజ్ పెట్టాడు కృష్ణారావు. అదృష్టం బాగుండి వెంటనే మెసేజ్ వచ్చింది.

‘బయటికి వెళ్ళేటప్పుడు ఫోన్‌లో ఛార్జింగ్ ఉందో లేదో చూసుకోమని లక్షసార్లు చెప్పాను బుర్రకి ఎక్కితే కదా!!... బాగానే ఉన్నాయి వాక్కాయలు. తీసుకోండి.’

రామారావు ఫోన్ చేస్తే మళ్ళీ ఎంగేజ్ ఇలా కాదని... మరో మార్గం ఆలోచించాడు. అదృష్ట వశాత్తు ఇంట్లో పనిచేసే అమ్మాయి నెంబర్ ఉంది అతని దగ్గర.

తనకి ఫోన్ చేశాడు– “ఇదిగో నేను 402 అయ్యగారిని మాట్లాడుతున్నాను....”

అనగానే...“మీ ఇంట్లోనే ఉన్నాను అయ్య గారూ...” అన్నది.

“అమ్మయ్య బతికించావు! మీ అమ్మగారితో మాట్లాడాలి కాస్త ఫోన్ ఇవ్వు.” అన్నాడు.

ఇచ్చింది. “ఏమిటండీ మీ గోలా! ఎప్పుడనగా వెళ్లారు మార్కెట్‌కి? ఇంకా అక్కడ ఏం చేస్తున్నారు?” అంది సీతామహాలక్ష్మి.

ఆవిడ మీద విసుక్కునే ఓపిక కూడా లేదు రామారావుకి. పరిస్థితి వివరించి చెప్పాడు.

“ఆగాకరకాయలు ధర ఎక్కువే ఉంటాయి ఆ మాత్రం తెలీదా? రెండున్నర కిలోలు తీసుకోండి.” అంది.

ఆయన వాక్కాయలు ఈయన ఆగాకర కాయలు కొనుక్కున్నారు.

“సమయానికి దేవుడిలా సాయం చేశారు.” అని కృతజ్ఞతలు తెలుపుకున్నాడు కృష్ణారావు.


ఫోన్ నంబర్స్ ఇచ్చిపుచ్చుకున్నారు.

మరుసటి వారం రామారావు కృష్ణారావుకి ఫోన్ చేశాడు. వాట్సాప్‌లో ఒక గ్రూపు ఉంది. అందులో అందరూ మనలాంటివాళ్లే... తమ తమ అనుభవాలు పంచుకొంటున్నారు... బావుంది!... నన్ను ఎవరో చేర్చారు నేను మిమ్మల్ని చేరుస్తున్నా.” అన్నాడు.

“అలాగే చేర్చండి!” అన్నాడు కృష్ణారావు.

ఆ గ్రూప్ పేరు...

‘సైలింగ్ ఇన్ ద సేమ్ బోట్.’





విజయానందం

# కారులో షికారు

శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి

కథ

**నా జాతకం చాలా మంచిదనేవారు తాతగారు. చిన్నతనం నించీ వాహనయోగం వుంది. నాకు బుద్ధి తెలిసేసరికి పాతకాలం ఫోర్డుకారు ఉండేది మా నాన్నగారి దగ్గర. పన్నెండొందలు పెట్టి కొన్నారుట.**

**"ఎందుకిది?... ఈ డబ్బుకి బోలెడంత బంగారం వచ్చేది!" అని సణిగింది మా అమ్మ. ఇంట్లో కూర్చునే అమ్మకేం తెలుసు కారు విలువ?**

మా స్కూల్లో అందరూ వీళ్ళకి చిన్నకారుంది అని గొప్పగా చెప్పుకునేవారు. చండశాసనుడు మా లెక్కల మాష్టారు... నేను లెక్కలు తప్పు చేసినా ఏమీ అనేవారు కాదు. క్లాసు లీడరును కూడా ఎప్పుడూ నేనే.

మరి ఇదంతా కారు ఉండడం వల్లే కదా!

అప్పుడప్పుడూ మా కార్లో మా తాతగారి ఊరికి వెళ్ళేవాళ్ళం.

దార్లో ఏదో జాడ్యం వచ్చి ఆగిపోయేది... కార్లో రిపేరు సామగ్రి సిద్ధంగా ఉండేది.

మా నాన్నగారు కారు కింద పడుకుని... రిపేరు చేసేవారు... అలా అంచెలంచెలుగా గమ్యం చేరేవాళ్ళం.

ఊరు అంతదూరం ఉండగానే చుట్టుపక్కల చేలల్లో పనిచేస్తున్న జనం మా కారు చూసి–

'కరణంగారి అల్లుడుగారి కారొచ్చింది' అని పరుగున వచ్చేవాళ్ళు. 'తోసేస్తాం తోసేస్తాం' అని కారుని తోసుకుంటూ ఊళ్ళోకి తీసుకొచ్చే వాళ్ళు... ఇంటికి జేర్చి– 'అమ్మాయిగారూ! పదిరోజులుంటారుగా' అని అడిగేవాళ్ళు.

'లేదు... సోమవారం వెళ్ళిపోతా!' అనేది అమ్మ.

'సరే అయితే సోమవారం వస్తాం, కారు తోసేస్తాం!' అని హామీ ఇచ్చి వెళ్ళేవారు.

అమ్మమ్మ లోపలినుంచి ఇంత మొహం చేసుకుని వచ్చేది.

"వచ్చారా! ఇంత ఆలస్యమైతే దార్లో కారాగి పోయి ఉంటుంది అనుకున్నాను!' అని ఆద రంగా తీసుకు వెళ్ళేది.

"అల్లుడుగారూ! కారు ట్రబుల్ ఇచ్చిందా?" అని అడిగేవారు తాతగారు.

"ఆఁ... లేదండీ! కాకపోతే పొన్నూరు దాటాక ఒకసారి... లాకులదగ్గర ఒకసారి... చందోలు మలుపులో ఒకసారీ... ఆగింది. బాగుచేశాను. బస్టాండుకి అంతదూరంలో ఉండగా మళ్ళీ అనుమానం వచ్చింది... మన వాళ్ళంతా వచ్చి తలో చెయ్యి వేశారు!" అనే వారు నాన్నగారు.

"మన ప్రాంతాలకు వస్తే ఢోకాలేదు... మన బలగం ఉందిగా! మీరు వెళ్ళేరోజు ఒకగంట ముందు చెప్తే వచ్చి వాలిపోతారు!" అనేవారు తాతగారు.

"ఎందుకండీ? అది నడుస్తూనే వుందిగా" అంటే–

"మనిషి సాయం లేనిచోట... దానికెలాగూ తప్పదు! పాపం... మనుషులున్న చోటైనా విశ్రాంతి తీస్కోనివ్వండి!" అనేవారు తాతగారు.

శని, ఆదివారాలు ఉండి తిరుగు ప్రయాణం అయ్యేవాళ్ళం.


మామూలుగా చేయించిన భారీ పిండి వంటలతో బాటు అడుగూ బొడుగూ మిగి లిన నాలుగు కజ్జికాయలూ, రెండు గారె ముక్కలూ కూడా బాదం ఆకుల్లో పొట్లం కట్టేది అమ్మమ్మ.

'ఎందుకే అవన్నీ?' అని అమ్మ అంటే–

'ఉండనీ. కారాగిపోయినప్పుడు పిల్లలు నోట్లో వేసుకుంటారు' అనేది.

ఎక్కడికి వెళ్ళినా మధ్యలో కారాగి పోవడం మా అమ్మకు చిరాగ్గా ఉండేది. కానీ మాకు మాత్రం సర దాగానే ఉండేది.

చేల వెంబడి పరు గులు తీయొచ్చు... పిల్లకాలువ ఉంటే ఆడుకోవచ్చు... రాళ్ళు





**నేను పొత్తూరి విజయలక్ష్మి గారి వీరాభిమానిని.**

# విజయానందం



**మ**నస్ఫూర్తిగా నవ్వుకునే సినిమా అనగానే ముందుగా గుర్తొచ్చేది నాకైతే మాత్రం 'శ్రీవారికి ప్రేమలేఖ'. ఆ సినిమా ఇప్పటికి ఎన్నిసార్లు చూశానో తెలీదు! ఆ సినిమా రచయిత్రి పేరు 'శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి' అని తెర మీద చూసినప్పుడు ఎవరో భలే రాశారనుకున్నాను. కొన్నేళ్ళ క్రితం ఆవిడ ఫోన్ చేసినప్పుడు అదేదో పాత పరిచయం ఉన్నట్టే ఆవిడ చాలా ఆప్యాయతతతో మాట్లాడితే నేను కూడా పెద్ద రచయిత్రితో మాట్లాడుతున్న భయం పొగొట్టుకొని దొడ్డమ్మగారితోటో, మేనత్తతోటో మాట్లాడుతున్నట్లు అనుకున్నాను.

ఆ తరువాత ఎన్నోసార్లు కలిశాను, కలిసిన ప్రతిసారి అదే ఆప్యాయత. చాలామంది హాస్య రచయితలు/రచయిత్రులు చాలా ముభావంగా ఉంటారు, వారి హాస్యమంతా వారి రచనలలోనే ఉంటుంది, కానీ విజయలక్ష్మి అమ్మగారు మాటల్లో కూడా అదే హాస్యం చూపిస్తారు. ఆవిడతో గడిపిన క్షణాలు నవ్వులనదిలో తేలినట్టుగా ఉంటాయి.

ఇక ఆవిడ రచనల గురించి చెప్పాలంటే బహుశా నాకు తెలియని వయసునుంచే ఆవిడ రచనల్ని ఆరాధించడం మొదలెట్టానేమో... ఆ ఆరాధన, అభిమానంగా మారి, తరవాత ఆ రాతలని అనుసరించడం కూడా అయ్యింది. మొన్న ఎవరో నాతో, "మీ రచనలు కాస్త పొత్తూరి వారి రచనల్లా నవ్వు తెప్పిస్తాయి" అని అన్నారు. ఆ ప్రశంస నాకు 'పద్మశ్రీ' దక్కినట్టుగా అనిపించింది.

ఆవిడ రచనలలోని పాత్రలన్నీ మన చుట్టుపక్కన ఉన్నవాళ్ళలాగానే అనిపిస్తాయి. అరే మన జీవితంలో కూడా ఇటువంటి వాళ్ళున్నారే అనిపించకమానదు. అన్నీ కథలు హాయినా నవ్వించేవే అయితే, 'ఆత్మ కథ' చదివాక మనసు మనసులో లేదు.

ఆవిడ భానుమతి అవార్డ్ పొందారు మరెన్నో అవార్డులు ఆవిడని వరించాయి, వరిస్తాయి కూడా, ఆవిడకు హాస్యానందం వారు ప్రత్యేక సంచిక విడుదల చేస్తున్నారని తెలిసి చాలా సంతోషించాను.

ఆవిడ గురించి ఒక్క మాటలో చెప్పాలంటే ఆవిడ 'అమ్మ' అంతే! దసరా పండక్కి చీర తీసుకొని, స్వయంగా ఆవిడే ఫాల్ కుట్టి నాకు ఇచ్చారు... ఎంత అదృష్టమో నాది. ఆవిడతో నాకున్న పరిచయం ఎంతో అమూల్యము. హాస్య రచయిత్రిలో ఆవిడ ఎప్పుడూ అగ్రగణ్యురాలే.

ఆవిడకు భగవంతుడు ఆయురారోగ్యాలను, ఆనందాలను... ఇవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ ఆవిడ అభిమాని..పుత్రిక.

**-విశాలి పేరి (రచయిత్రి)**

వేసి చింతకాయలు కొట్టుకోవచ్చు.

ఒకసారి సెలవుల్లో తిరుపతి ప్రయాణం పెట్టుకున్నాం.

తాతయ్యగారు రాలేనన్నారుట... అమ్మమ్మ మాత్రం వచ్చింది. బోలెడన్ని చిరుతిళ్లు మూటలు కట్టి 'కారాగిపోయినప్పుడు తిందాం' అంది సరదాగా.

దూరాభారం మా కారులో ప్రయాణం కష్టం అవుతుందని టాక్సీ మాట్లాడారు. తెల్లగా రాజహంసలా ఉంది అంబాసిడర్ టాక్సీ.

పెందలాడే భోజనాలు చేసి బయలుదేరాం.

రివ్వున దూసుకుపోతోంది టాక్సీ.

కాసేపటికి మాకు విసుగేసింది.

"నాన్నగారూ కారెప్పుడాగిపోతుంది?" అని అడిగాం.

"నోళ్లు ముయ్యండి! అపశకున పక్షుల్లారా!' అని తిట్టింది అమ్మ.

మరి కాసేపటికి అమ్మమ్మకీ విసుగువేసింది.

"బాబూ!... కారెప్పుడు ఆగిపోతుందో నాన్నగారిని అడుగు!" అంది మా అన్నయ్యతో.

ఆవిడ నేరుగా అల్లుడితో మాట్లాడదు మరి!

"ఇదెక్కడి గొడవే!... కావాలంటే చెప్పండి ఆపుతారు... అంతేగానీ ఆగిపోదేం... ఆగిపోదేం... అంటే ఇదేమైనా మన డొక్కుకారా? బోలెడు డబ్బుపోసి తెచ్చిన టాక్సీ!" అని కసిరింది అమ్మ.

ప్రయాణం బాగానే జరిగింది. ఇంటికి తిరిగివచ్చాం.

అమ్మ సంతోషంగా ఉంది. మాకూ... మా అమ్మమ్మకు... మాత్రం అసంతృప్తిగా ఉంది. ఆ టాక్సీ వ్యవహారం మాకు నచ్చలేదు.

"అదేం పీడాకారం బయలుదేరితే ఇహ అదే పరుగా!... నిలుపూ నిదానం ఉండద్దూ? మన కారు బంగారం. ఒకసారి రోడ్డుమీద కారాగిపోతే అల్లుడుగారు రిపేరు చేసే లోపల అడ్డదోవన గోవాడ వెళ్ళి మా పినతండ్రి కూతుర్ని చూసొచ్చాను. విడిగా వెళ్ళాలంటే కుదుర్తుందా? ఇంకోసారి చక్కగా మిరపచేను పక్కన ఆగిపోయింది... దిగి మేలైన మిరపకాయలు చవగ్గా కొనుక్కున్నాం.ఎంతైనా మనకారుకి మన వీలూ వివరం తెలుస్తాయి గానీ... పరాయి కారుకేం తెలుస్తాయి? డబ్బు పోసినంత మాత్రాన విశ్వాసం ఉంటుందా!?" అంది అమ్మమ్మ.

నిజమే, ఇక పరాయి కారుల్లో ప్రయాణం చెయ్యకూడదని గట్టిగా తీర్మానించుకున్నాం.

ఆ రోజుల్లోనే మా నాన్నగారికి ప్రమోషనొచ్చి బాపట్ల ట్రాన్స్ఫర్ చేశారు.

ఇక తాతగారు అమ్మమ్మల ఆనందం చెప్పనలవి కాదు. కూతురు కూతవేటు దూరంలో ఉంటుందంటే ఆనందం కాదా మరి!

బాపట్ల వచ్చాక మరోసారి ఊరు వెళ్లాం. మామూలుగానే మంచినీళ్ళ బావి దగ్గర ఆగిపోతే అక్కడున్న ఆడంగులే తోసుకొచ్చేశారు.

నాన్నగారు రిపేరు చేసినా బాగుపడలేదు.

ఆయన వెళ్ళి ఒక లారీనీ అదనంగా మరో డ్రైవరునీ పంపించారు.

ప్రయాణం అయ్యాం.

భావనారాయణస్వామి దర్శనం చేసుకుంటానని అమ్మమ్మ కూడా

మాతో బయలుదేరింది.

సావిట్లో గుంజకి తగిలించిన మోకులు తెచ్చి లారీకీ–కారుకీ కట్టారు.

లారీ కదిలింది... దానివెంటే కారు.

"మరి యజమానికి పదోన్నతి వస్తే వాహనానికి రాదా!... ఈ దర్జా చూడు, చక్కగా పూల వాడలో ఊరేగుతున్నట్లు ఉంది!..." అంది అమ్మమ్మ మహదానందంతో.

అమ్మ పళ్ళు కొరుక్కుంది.

అందరం, కార్తీకమాసంలో సంగం జాగర్లమూడి వెళ్ళాం మా కార్లోనే.

షరా మామూలే.

వెంటనున్న మనిషి రోడ్డుమీదకి వెళ్ళి బస్సు ద్వారా కబురు పంపించాడు. మా స్నానాలూ, దర్శనాలూ, భోజనాలూ అయ్యేసరికి ఖాళీ లారీ వచ్చేసింది.

మెకానిక్కు, డ్రైవరూ దిగారు.

కాసేపు తర్జనభర్జనలు పడి చెక్కలు వేసి కారుని లారీలోకి ఎక్కించారు.

మేము కార్లోనే ఉన్నాం.

అమ్మమ్మ ఆనందం వర్ణనాతీతం.

దారంతా ఏ...ఏ...ఏ...అని చేతులూపుతున్న పిల్లలకు తనూ చేతులూపి సమాధానం చెప్పింది.

"అమ్మాయ్! మన కారు హోదా రోజురోజుకీ పెరిగిపోతుందే. దిష్టి తగుల్తుందేమో...అని భయంగా ఉంది!" అంది.

"చాల్లే వెధవ వాగుడు! అందరం ఇట్లాగే మంగళగిరి వెళ్ళి కొండమీదనుండి కిందకు దూకుదాం! పీడా విరగడవుతుంది!" అంది అమ్మ ముక్కు చీదుకుంటూ.

ఇంటికి చేరాక అమ్మ లేకుండా చూసి–

"ఏమన్నానని నా మీద విరుచుకు పడుతోంది మీ అమ్మ?" అని అడిగింది.

"మన కారుని చూసి దారంతా ఎగతాళిగా నవ్వారు కదా!... అది చూసి అమ్మ చిన్నబుచ్చుకుంది!" అని చెప్పాను.

"ఎవడా నవ్వేది?మన కారు, మనిష్టం! లారీ మీద కాకపోతే విమానంమీద ఎక్కించి తిప్పుకుంటాం. వాళ్ళకేం కష్టం?... ఇటు రమ్మను మాడు పగలగొడతాను!" అంది ప్రేమగా చీర కొంగుతో కారును తుడుస్తూ.



# విజయానందం

## నవ్వుల పూల పొట్లాలు – పొత్తూరి పుస్తకాలు



**స**మస్యలెదురైనపుడు చర్చించుకుని పరిష్కరించుకునే సమయం లేక, చిన్నచిన్న విభేదాలు కూడా ప్రాణాంతకమైన వివాదాలుగా మారిపోతున్న రోజుల్లో అనేక మానసిక సామాజిక సమస్యలకి హాయిగా నవ్వించగలిగే హాస్యరచనని మించిన పరిష్కారం లేదని కనిపెట్టి అసంఖ్యాకమైన హాస్యరచనలని సృజించిన శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మిది సరళ సుందరమైన శైలి.

ఏ భాషలోనైనా భావ ప్రధానమైన హాస్యం రాసే రచయితలు అతి తక్కువని మనకి తెలిసిందే. ఆ తక్కువమందిలో ప్రథమశ్రేణిలో నిలిచే విజయలక్ష్మిగారు శ్వాశించేది సున్నితమైన హాస్యాన్నే.

ఈమె రచనలు చదవడం మొదలుపెట్టి ముగించేలోపు ఎన్నో అడ్డంకులొస్తాయి. కళ్ళనీళ్ళు కారిపోతాయి, బుగ్గలు నొప్పెడతాయి, డొక్కలు చేత్తో పట్టుకుని ఒకటే అవస్థ పడాల్సివస్తుంది. 'ఇంత కష్టపడి వీటిని చదవకపోతే ఏం?' అంటారేమో. నవ్వలేకపోవడమొక రోగం అంటారు కదా! ఆ రోగానికి ఔషధం ఈమె రచనలు. ఇవి చదువుతూ నవ్వకుండా ఉండడం అసాధ్యం.

ఆంధ్రభూమి దినపత్రికలో ఏడాది పైగా నడిచిన ధారావాహిక కాలమ్ 'కొంచెం ఇష్టం–కొంచెం కష్టం' వల్ల తపాళాశాఖ వారూ, టెలిఫోన్ డిపార్ట్మెంట్ వారూ ఎంతగానో లాభపడ్డారు. ఏడాదిపాటు ఈ కాలమ్ అచ్చయ్యే ప్రతి గురువారం విజయలక్ష్మి గారింట్లో ఫోను ఆగకుండా మోగుతూనే ఉండేది. తన రాతలతో డొక్కలు నెప్పెట్టేలా నవ్వించినందుకు పగ పట్టిన ఎందరో పాఠకులు ఈవిడని చిన్న కునుకు కూడా తీయనివ్వకుండా ఫోన్ల మీద ఫోన్లు చేసి చెవులు నొప్పి పెట్టేలా పొగిడి, కసి తీర్చుకున్నారు. ఇందులో ఉన్న 56 కాలమ్స్ అన్నీ నవ్వించే కాప్స్యూల్స్ అంటే అతిశయోక్తి కాదు. ఈ ధారావాహిక పుస్తకంగా వెలువడే వరకూ అభిమానులు ఊరుకోలేదు. ఈ పుస్తకమే కాదు ఈమె రాసిన హాస్య కథా సంపుటులేవైనా ఒకసారి చదివి వదిలేసేవి కాదు. కొనుక్కుని మళ్ళీ మళ్ళీ చదువుకోదగ్గవి. అందుకే తమ వారంతా నవ్వుతూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించే అభిమానులు ఈ పుస్తకాలని ఇతోధికంగా కొని ఆత్మీయులకి బహుమతిగా అందించుకున్నారు. హాస్యాన్ని అవలీలగా పండించ గలిగే వీరు ఆర్ద్రత నిండిన మానవీయ కోణాన్ని కూడా అంతే సరళంగా తన కథల్లో దర్శింపజేయగల ప్రతిభాశాలి.

వీరి గురించి మాట్లాడుతూ ప్రఖ్యాత కథకులు శ్రీకవనశర్మ గారు 'హాస్యం ఒక రోగం. అదో అంటువ్యాధి. *She carries the germs of humour* అంటారు.

ప్రతి కథ పూర్తిచేయగానే మనం మరికాస్త మనుషులుగా మారుతున్న అనుభూతి కలుగుతుంది. ఈ కథల మధ్యలో 'గజల్' కథ చల్లని వెన్నెల రాత్రి వీనుల విందుగా వినిపించిన గజల్‌లాగే మధురంగా సాగుతుంది. ఆనాటి వాన చినుకులు కథ తొలకరి వర్షపు జల్లుల్లో తడిపి వదిలితే 'ఈ పని చాలు నాకు' కథ పూర్తి చేసేటప్పటికి ఎంత దుఃఖభరితమైన జీవితంలోనైనా శాంతిమార్గం సాధ్యమే అనిపిస్తుంది. చివర్లో 'శతకోటి దరిద్రాలకు, ఇదే నా సలహా' లాంటి చిట్టి కథల్లోని చమత్కారపు కొసమెరుపులు ఆపకుండా చదివిస్తాయి.

జీవితం విసుగ్గా అనిపించినపుడల్లా పొత్తూరి పొత్తమొకటి తీసి ఓ కథో, కబురో చదివితే చాలు, నవ్వుల వానజల్లు కురుస్తుంది. పరుగు జీవితంలో కాస్తంత విశ్రాంతీ, సాంత్వనా లభిస్తాయి.

**–వారణాసి నాగలక్ష్మి, రచయిత్రి**



విజయానందం

# నేను చావను... నువ్వు చచ్చిపో!

శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి
కథ

**"నాకు బతకాలని లేదు.."**

**"సరే..."**

**"ఏవిటి సరే!... అని వెంటనే సమాధానం చెప్పేసావ్? నేను చెప్పింది సరిగ్గా విన్నావా? నాకు చావాలని ఉంది."**

**"ఆ మాటే చెప్పావు కదా! బతకాలని లేదు అంటే చావాలని ఉందనే కదా అర్థం! చిన్నపిల్లలు తెలుగు పాఠంలో పర్యాయపదాలు పల్లె వేసినట్లు మళ్లీ చెప్పటం ఎందుకు?"**

"నేను చచ్చిపోతాను అంటే నీకు చీమకుట్టినట్లైనా లేదా?"

"ఇది మరీ బాగుంది... నీ జీవితం నీ ఇష్టం!... చావాలనుకుంటున్నావు. నాకెందుకు చీమ, దోమ కుట్టినట్టు ఉండటం?"

"చెట్టంత మనిషి చచ్చిపోవాలి అనుకుంటే బాధగా లేదూ నీకు?"

"నన్ను చంపుతానంటే బాధ గానీ, నువ్వు చస్తాను అంటే నాకేం బాధ?"

"నేను చావటానికి కారణం ఏమిటి తెలుసుకుందాం అని కుతూహలం అయినా లేదా?"

"ఆ! తెలుసుకుని మాత్రం ఏం చేస్తాను?"

"మహా మొండివాడివి నువ్వు. నేనే సర్దుకుపోవాలి మరి. నిజం చెప్పాలి అంటే నేను చచ్చిపోవడానికి ఇదీ అని కారణం లేదు."

"అయితే మరీ మంచిది. ఏదైనా బలమైన కారణం ఉంటే అప్పుల బాధకు తట్టుకోలేక రైతు ఆత్మహత్య. భార్య అక్రమ సంబంధం పెట్టుకుందని భర్త ఆత్మహత్య. పరీక్షల్లో మంచి మార్కులు రాలేదని విద్యార్థి ఆత్మహత్య అని ప్రపంచానికి తెలిసిపోతుంది. ఇలా కారణం లేకుండా చచ్చిపోతే జనానికి మంచి చేసిన వాడివి అవుతావు... నువ్వు ఎందుకు చచ్చిపోయావో తెలియక బుర్రలు బద్దలు కొట్టుకుంటారు. వాళ్ళకి కాస్త కాలక్షేపం కలగజేసిన వాడివి అవుతావు."


"కారణం లేదు అంటే... ఒకటి రెండు కాదు చాలా కారణాలు ఉన్నాయి."

"మరిఏం? అధికస్య అధికం ఫలం."

"ఏవిటి ఆ కారణాలు అని అడగొచ్చుగా!"

"అడగకపోయినా నువ్వు చెప్తావుగా!"

"మా నాన్న వున్నాడా?"



"ఏమో నాకేం తెలుసు?"

"వున్నాడు."

"సరే వున్నాడు."

"తెలుసుగా ఆయన తిక్క మనిషి."

"నాకెలా తెలుస్తుంది మీ నాన్న ఎలాంటివాడో?"

"ఇప్పుడు నేను చెప్తున్నానుగా తెలుసుకో. చాలా తిక్కమనిషి. తనకు తోచదు. ఇంకొకడు చెబితే వినడు. ఇప్పటికే ఇరవై ఎకరాల పామాయిల్ తోటలు వున్నాయి. ఇంకో ఇరవై ఎకరాల తోట కొంటాను అంటాడు."

"అమ్ముతానంటే ఏడవాలి కానీ కొంటాను అంటే నీకేం కష్టం?"

"నాకు కాక ఇంకెవరికి? ఆయనకేం?... కొని పారేస్తాడు. తర్వాత తలనొప్పి అంతా నాది. వద్దయ్యా మగడా! దాని బదులు బంజరు భూమి కొని ఓ కంచె వేసి పడేస్తే దానంతట అదే పెరుగుతుంది కొన్నాళ్ళు పోయాక విల్లా ప్లాట్లు చేసి అమ్మితే కోట్లు వస్తాయి... అని ఎంత చెప్పినా వినిపించుకోడే."

"నువ్వు చెప్తే వినకపోతే మీ అమ్మ చేత చెప్పించు. పెళ్లాం చెబితే వినని మానవమాత్రుడు ఈ భూమ్మీద ఉండడు కదా!"

"అయ్యో రామా! నాకు అంత అదృష్టం కూడానా!... మా అమ్మ ఉత్త చాదస్తపు మనిషి. ఈ రోజుల్లో కూడా ఇల్లు దాటి బయటికి రాని ఇల్లాలు. ఆవిడకు చెప్పే కంటే ఆ గోడకు చెప్పటం నయం."

"మరి గోడకే చెప్పు."

"చెప్పటం కాదు. ఎన్నోసార్లు తలకాయ వేసి బాదుకున్నా! తలకాయ బొప్పి కట్టడం తప్ప ఫలితం శూన్యం."

"అంతే మరి... అదే కదా గోడ యొక్క స్వభావం!"

"పోనీ కట్టుకున్న భార్యతో చెప్పుకుందాం అంటే ఆ భాగ్యం కూడా లేదు."

"అయ్యో పోయిందా పాపం?"

"అయ్యో కాదు. పుట్టింట్లో వుంది."

"ఓస్ అంతేనా! రాగానే చెప్పుకో. నీ బాధలన్నీ."

"ఆవిడ రాదు."

"ఆహాఁ... విడాకులు పుచ్చేసుకుందా?"

"లేదు... మా పెళ్ళయిన దగ్గరనుండి అక్కడే ఉంది."

"నూతన వధువు చేత గృహప్రవేశం చేయించడానికి మీ వాళ్ళకి మంచి రోజు దొరకలేదు కాబోలు పాపం."

"ఎప్పటి గృహప్రవేశం పెళ్ళయి పదేళ్ళు కావస్తోంది. అది కాదులే. ఏవో ఆస్తి గొడవలు."

"కట్నం గొడవలా?"

"కాదు. అదో పెద్ద తిరకాసు వ్యవహారం. మా అమ్మ కుదిర్చింది ఈ సంబంధం. మా మామగారి పేరు కనకారావు... ఆయనకు ఇద్దరు కూతుళ్ళు. ఒక్కో కూతురికి ముప్పై ఎకరాల భూమి, వూళ్ళో సినిమా హాలులోనూ, కమర్షియల్ కాంప్లెక్స్‌లోనూ చెరిసగం వాటా వున్నాయి. అక్కా, బావా ఆ ఊర్లోనే వుంటారు. ఇద్దరికీ తగని డబ్బు యావ. తను పెళ్ళయి వెళ్లిపోతే అక్క, బావ తండ్రికి మస్కా కొట్టి ఆస్తి కాజేస్తారేమో

నేను పొత్తూరి విజయలక్ష్మి గారి వీరాభిమానిని.



## విజయానందం



**ఆ**మె నవ్వుల వెన్నెలజాబిలి...

పేరు–పొత్తూరి విజయలక్ష్మి అయినా... ఆమె హాస్య సామ్రాజ్యలక్ష్మి.

వీరి తల్లిదండ్రులు సత్యవాణి , వల్లూరు వెంకటకృష్ణమూర్తిగార్లు ఏ నోము నోచారో గానీ ఈమె నవ్వులదేవత వరాన 1953 జులై పద్దెనిమిదిన పుట్టారు. పోనీ పుట్టారే అనుకోండి! అందరిలాగే ఆటలాడుకుని, అల్లరి చేసి, చదువుకుని, పెళ్లి చేసుకుని, పిల్లల్ని కని, పెంచి, పెద్దజేసి, వంటా వార్పూ చేసుకుంటూ, టీవీ సీరియళ్లు చూసుకుంటూ కూర్చుందా?! లేదు!! జీవితంలో మెట్లెక్కుతూనే వీణ మెట్లు సవరించారు. బ్రతుకురథం నడుపుతూ సాధన చేస్తూనే సంగీత సాధన చేశారు.

రైల్వే అధికారి భార్యగా రైల్వే విమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్‌లో ముప్పై ఏళ్ల పాటు కీలక పదవులను నిర్వహించారు. మాతృభాష తెలుగును కాపాడుకుంటూనే వీటిని మాత్రం ఎందుకు వదలాలి అనుకున్నారో ఏమో ఇంగ్లీష్, హిందీ, బెంగాలీ, కన్నడ భాషలు నేర్చుకున్నారు.

ముచ్చటగా తన మూడుపదుల ప్రాయంలోనే తెలుగు పాఠకులకు ఒక సామూహిక ' ప్రేమలేఖ ' రాశారు. ఆ మొట్టమొదటి నవలే పెద్ద హిట్టు కొట్టి,1984లో శ్రీవారికి ప్రేమలేఖ సినిమాగా వచ్చి అఖండ విజయం సాధించింది.


మానవ సంబంధాలు, ఆశావహ దృక్పథం ఆమె రచనల్లో ముఖ్యాంశాలు అయినా హాస్యం మరింత అలవోకగా రాసేయగల ప్రత్యేకత ఉన్నందున హాస్యానికి కేరాఫ్ అడ్రెస్‌గా మారిపోయారు.

'కరెంటు సంబరం ' కథ మహారాష్ట్ర ప్రభుత్వం వారిచే పన్నెండవ తరగతి తెలుగు వాచకములో పాఠంగా ప్రచురింపబడినది. వీరి 'పూర్వి 'కథల సంపుటి మీద మద్రాస్ విశ్వవిద్యాలయ విద్యార్థిని బోయిని మాధవి ఎం.ఫిల్ చేశారు.

ఇరవై అయిదు సంవత్సరాలుగా ఆల్ ఇండియా రేడియోలో కథా పఠనం చేస్తున్న వీరు శ్రోతల మీద ఏమాత్రం దయ చూపకుండా వారిని పొట్ట చెక్కలయ్యేలా నవ్విస్తూ ఉంటారు.

డల్లాస్ నగరంతో సహా భారతదేశంలోని ఎన్నో నగరాలలో సన్మానాలు పొందిన విజయలక్ష్మిగారు పలు పురస్కారాలు పొందారు.

అభిమానుల పెదవుల మీద విరిసే నవ్వు పువ్వుల్నివసివాడనీయని హాస్య వ్యవసాయం చేస్తున్న ప్రముఖ రచయిత్రి పొత్తూరి విజయలక్ష్మి గారిపై హాస్యానందం ప్రత్యేక సంచిక వెలువరుస్తున్న సందర్భంగా అభినందనలు. **–నెల్లుట్ల రమాదేవి, కవి, రచయిత్రి, కార్టూనిస్టు**




అని భయంతో పెళ్ళికూతురు కనకమంజరి అంటే నా భార్య అక్కడే ఉండిపోయింది. పోన్లే అక్కడే ఉండనీ.ఆయన తదనంతరం ఆస్తి తీసుకుని వస్తుంది అని చూసి చూడనట్లు ఊరుకున్నారు మా వాళ్ళు అదీ అసలు విషయం."

"ఎంత ముందుచూపు? ఎంత జాగ్రత్త. పోనీ సంతానమైనా ఉందా?"

"కనకమంజరి కాపరానికే రాకపోతే నాకు సంతానం ఎలా కలుగుతుంది?"

"ఆవిడ రాకపోతే తమరు ఆవిడ దగ్గరకు వెళ్ళొచ్చు కదా!"

"ఇక్కడ నాకు సవాలక్ష వ్యవహారాలు. తీరి చావదు."

"శభాష్! నిష్పుచీ!! నిరాచింత!!!"

"నాకు అంతటి అదృష్టం కూడానా? అన్నీ చింతలే."

"ఓహెూ!"

"ఏం మనిషివయ్యా. ఏం చెప్పినా ఆహా ఓహెూ అంటావు. ఒక ఎక్సైట్‌మెంట్ లేదు... ఏం జరిగిందో తెలుసుకుందామని కుతూహలం లేదు. నీలాంటివాడితో మాట్లాడటం నాదీ బుద్ధి తక్కువ."

"నాతో మాట్లాడమని ఎవడు ఏడిచాడు?"

"ఇంకెవరితోనైనా మాట్లాడదామంటే ఇక్కడ నువ్వు నేను తప్ప ఇంకెవరూ లేరు. కష్టాల్లో మునిగిపోయి చచ్చిపోదాం... అనుకుంటున్న వాడి మాట విని అయ్యో పాపం అనలేవా?"

"సరే అంటాను... ఏమిటీ నీ చింతకు కారణం?"

"ఔటర్ ఔటర్ రింగ్ రోడ్డు!"

"ఔటర్ ఔటర్ రింగురోడ్డా?"

"అవును! ఇప్పుడు ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు కాక దాని చుట్టూ వచ్చే ఇంకో రింగురోడ్డు."

"అవున్లేమరీ... నగరం ఇలా విస్తరించి పోతుంటే శనిగ్రహం చుట్టూ వలయాలంలా రింగురోడ్డు చుట్టూ... ఇంకో రింగురోడ్డు చొప్పున వేస్తూ పోవాలి."

"వెయ్యాలి. కానీ ఒకసారి ప్లానింగ్ చేసాక ఆ ప్లాను ప్రకారం పోవాలి. అంతేకానీ అధికారాలు మారినప్పుడల్లా ప్లాన్ మార్చేస్తే ఎట్లా?"

"అవును నిజమే! ఆడపిల్ల ఒకరోజు మధ్య పాపిడి ఒకరోజు పక్క పాపిడి తీసుకున్నట్టు ఇష్టం వచ్చినట్టు ప్లాను మార్చేస్తే అన్యాయమే."

"నేను అట్లాగే అన్యాయం అయిపోయాను. అప్పుడు ప్లాన్ వెయ్యగానే దాని పక్కనే 45 ఎకరాల స్థలం కొన్నాను. ఇప్పుడు మారుస్తాం అంటున్నారు. మారిస్తే ధరలు పడిపోవూ? నేనే గంగలో దూకనూ?"

"అంత ఆత్రం ఎందుకయ్యా?ఆ రోడ్డు కార్యరూపం దాల్చాక అప్పుడు కొనొచ్చు కదా?"

"అప్పటిదాకా ఆగితే ధరలు ఆకాశానికి అంటుతాయి. మనం కొనలేము."

"ఓహెూ! అంతేలే. అయ్యవారు వచ్చేదాకా అమావాస్య ఆగుతుందా?"

"అమావాస్య పేరెత్తకు. అమావాస్య వల్లనే నేను అన్యాయం అయిపోయాను."

"ఇందాక నా చింతకు కారణం ఏదో రోడ్డు అన్నావు. ఇప్పుడు అమావాస్య వల్ల అన్యాయం అయిపోయాను అంటున్నావ్... నీకేమైనా పిచ్చా?"

"విషయం విను. మావాడు ఒకడు వూరికి 70 కిలోమీటర్ల దూరంలో వెంచర్ మొదలు పెట్టాడు. మొన్ననే భూమిపూజ అయ్యింది. ఆరుటవర్లు. ఈ దశలోనే మొత్తం డబ్బు కట్టేస్తే చదరపు అడుగు నాలుగు వేలకు ఇస్తానన్నాడు. మూడు ఫ్లోర్లు కొందాం అనుకున్నా."

"అమ్మో! ఎవడైనా ఒక ఫ్లాట్ కొంటారు. నువ్వు ఏకంగా ఫ్లోర్లు కొంటావా?"

"ఎక్కడ నా బొంద! 14,15,16 అంతస్థులు కొందాం... అడ్వాన్స్ కట్టి బ్లాక్ చేసుకుందాం అనుకున్నాను. మా అమ్మ అడ్డుపడింది. రేపు అమావాస్యరా. పంచమినాడు ఇవ్వు అడ్వాన్సు అంది. సరే అని ఆగిపోయాను."

"తల్లిప్రాణం నీ మంచి కోరి చెప్పింది."

"ఏం మంచీ? ఆవిడ చాదస్తం కారణంగా నేను వెనక్కి తగ్గాను. నా మిత్రుడు వైదీశ్వరన్ పరుగున వెళ్ళి అడ్వాన్స్ ఇచ్చేసి ఆ మూడు అంతస్థులు బ్లాక్ చేసుకున్నాడు. తీరా నేను వెళ్ళేసరికి మిగిలినవి అన్నీ సోల్డ్ ఔట్. 20,21,22 ఫ్లోర్‌లు వున్నాయి. కావలిస్తే బ్లాక్ చేసుకో అన్నాడు."

"మరి చేసుకో."

"ఏమిటి చేసుకునేది?! ఎత్తుకి వెళ్ళినకొద్దీ ధరలు పెరుగుతాయి కదా! చదరపు అడుగు 6000 చెప్తున్నారు. ఎంత తేడా వచ్చిందంటే తలచుకుంటేనే గుండె పగిలిపోతోంది. దానికి తోడు మా నాన్న తిట్టి పోస్తున్నారు. ఇలా దెబ్బ మీద దెబ్బ తగులుతూ ఉంటే తట్టుకోవటం కష్టం కదా! జీవితం మీద విరక్తి పుట్టి ఆత్మహత్య చేసుకుందాం అని ఇటు వచ్చాను."

"అదా నీ బాధ?"

"అవునూ–మరి నువ్వెందుకు వచ్చావు?"

"సూసైడ్ పాయింట్‌కి ఎవరైనా ఎందుకు వస్తారు?"

"చావడానికి."

"నేనూ అందుకే వచ్చాను."

"నీకు కూడా నష్టాలు వచ్చాయా?"

"హమ్మయ్య! వచ్చిన దగ్గర నుంచి నీ సొద చెప్పడం తప్ప... నా గురించి ఒక్క ముక్క అడగలేదు.

"పోన్లే. ఇప్పుడు అడిగానుగా చెప్పు!"

"మాది చాలా పేద కుటుంబం. చాలా కష్ట పడి నన్ను చదివించారు మా అమ్మ నాన్న... డిగ్రీలో మంచి మార్కులే వచ్చాయి. కానీ ఉద్యోగమే రాలేదు. ప్రభుత్వం వారు వేలకొద్దీ ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని చెప్తూ ఉంటే వాటికోసం కోచింగులు తీసుకోవటం ప్రారం భించాను. పరీక్షలు పెట్టారు... రాసాను... ఫలితాలు రాకముందే ఏవో మోసాలు జరి గాయి అని గ్రహించి... పరీక్షలు క్యాన్సిల్ చేసేసారు."

"అవును. నేనూ పేపర్లో చదివాను."

"అది పోతే పోయింది... అప్పుడు కానిస్టే బుల్ ఉద్యోగం కోసం ప్రకటన వెలువడింది. దరఖాస్తు చేసుకుని చదవటంతో పాటు పరుగు కూడా ప్రాక్టీస్ చేయటం మొదలుపెట్టాను."

"ఆ పరీక్షకి అదే కదా ముఖ్యం... మంచి పని చేసావు."

"నాలుగు రోజులు పరిగెత్తేసరికి రోడ్డు మీద కుక్క నా వెంటపడి పిక్క మీద కరిచింది."

"కుక్క కరిచిందా?... పాదచారులు ఊర కుక్కల బారిన పడకుండా... తీసుకోవలసిన జాగ్రత్తలు అని అన్ని పేపర్లలోనూ వేసారు. నువ్వు చదవలేదా?"

"నేను చదివాను. కానీ ఆ కుక్క చదివినట్టు లేదు. నేను కదలకుండా నుంచుని దాని కళ్ళ ల్లోకి చూసినా అది నా కళ్ళలోకి చూడకుండా నా మీద పడి కరిచేసింది."

"గాయం అయిందా?"

"చాలా పెద్ద గాయం. హాస్పిటల్లో వారం రోజులు వున్నాను. పూర్తిగా కోలుకోవడానికి రెండు నెలలు పట్టింది."

"ఓ!... అయితే మరి కానిస్టేబుల్ పరీక్షకు వెళ్ళలేదా?"

"లేదు! నడవడమే కష్టంగా వున్న పరిస్థి తులు–పరిగెత్తడం అసాధ్యం కదా!"

"అయ్యో పాపం! మళ్లీ ఎప్పుడు వస్తాయి కానిస్టేబుల్ పరీక్షలు?"

"ఎప్పుడు వచ్చినా నాకేమీ లాభం లేదు... గవర్నమెంట్ ఉద్యోగాలకి నా ఏజ్ బార్ అయి పోయింది. అందుకే విరక్తి చెంది చచ్చిపోదా మని సూసైడ్ పాయింట్‌కు వచ్చాను."

"మరైతే ఇద్దరం కలిసి దూకేద్దాం. సరేనా?"

"ఉండు! ఇప్పుడిప్పుడే నాకు మా కృష్ణారావు చెప్పిన మాటలు గుర్తు వస్తున్నాయి."

"మధ్యలో కృష్ణారావు ఎవడు?"




"నా మిత్రుడు. నా జీవితం అతని జీవితం ఒకేలా నడుస్తున్నాయి. నాలాగే అతను కూడా పోటీ పరీక్షలు రాసాడు. కానిస్టేబుల్ పరీక్షకి అతను ప్రిపేర్ అయ్యాడు. నాకు కుక్క కరిస్తే అతనికి కాలు విరిగింది. అతని పేరు నిజానికి నిత్యానందరావు అని ఉండాలి...

ఎన్ని కష్టాలున్నా చిద్విలాసంగా ఉంటాడు. నేను జీవితం మీద విరక్తి పెంచుకుంటే నాకు సలహా చెప్పాడు."

"ఏమనీ?"

"మన దేశంలో మనం అనుకున్నట్లు కాక పోయినా ఏదో విధంగా బతకడం సాధ్యమే... కాయకష్టం కూడా చేయకుండా... జీవనం సాగించవచ్చు. నిత్యం అన్నదానం చేసే పుణ్యా త్ములు బోలెడుమంది వున్నారు. కాబట్టి తిండి సమస్య లేదు... ఏ మీటింగులోనో పాల్గొంటే ఎంతో కొంత చేతుల్లో పెడతారు. ఏదైనా దీక్ష తీసుకుంటే ఒక మండలం కాలం గడిచి పోతుంది. ఉద్యోగాలు ఇవ్వకపోతే నిరుద్యోగ భృతి ఇస్తారేమో ప్రభుత్వం వారు. ఇలా కొంతకాలం గడిపితే వృద్ధాప్య భృతి తీసుకునే అవకాశం ఏర్పడుతుంది. కాబట్టి నేను చచ్చినా చావను అని చెప్పాడు.

అప్పుడు నాకు వాడి మాటలు నచ్చలేదు. కానీ ఇప్పుడు ఆలోచిస్తూంటే వాడు చెప్పింది నిజమే అనిపిస్తోంది. ఆదర్శం, ఆత్మాభిమానం, ఆవకాయ పచ్చడి అనే చాదస్తాలు పెట్టు కున్నాను... నిన్ను చూసాక నాకు జ్ఞానోదయం అయింది. నీ సమస్యలతో పోల్చుకుంటే నా సమస్యలు చిన్నవే."

"అయితే మరి చావవా?"

"ఊహూఁ! చావను వెనక్కి వెళ్ళిపోతాను."

"మరి నేనో?"

"నీలాంటి వాళ్ళ కష్టాలు జన్మలో తీరవు. కాబట్టి నువ్వు చచ్చిపో!!"





విజయానందం

# రోలు మోడల్

శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి

కథ


**కార్లో వెళ్తున్నాడు ప్రసాద్. హైవే... వంద కిలోమీటర్ల స్పీడుతో వెళ్తోంది కారు. వెనక సీట్లో కూర్చుని హాయిగా ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ వున్నాడు.**

**వాతావరణం కూడా మబ్బుపట్టి ఆహ్లాదంగా వుంది. పచ్చని చెట్లు, పంటపొలాలు, చిన్న చిన్న ఊళ్ళు.**

**అలా వెళ్తూ వుంటే ఒక వస్తువు అతని కళ్ళ పడింది. ఒక్క క్షణం మెరుపులా. ఆ విషయం మైండ్‌లో రిజిస్టర్ అవడానికి ఓ అర నిముషం పట్టింది.**

"ఆపు! ఆపు కారాపు!!" అని కేక పెట్టాడు. అదిరిపడ్డాడు డ్రైవర్. ఏం జరుగుతుందో జీర్ణించుకోవడానికి అతనికి ఓ అరనిమిషం పట్టింది.

సడన్‌బ్రేక్ వేస్తే కారు ఎగిరి పడు తుంది కాబట్టి... కాస్త మెల్లిగా కంట్రోల్ చేస్తూ పక్కకి తీసి ఆపాడు. అందుకు ఓ నిముషం పట్టింది. కారు ఆపాక ఆ షాక్ నుండి తేరుకోవడానికి ఓ ఐదు నిముషాలు పట్టింది.




"ఏవిటి సార్!... ఏమయింది?... అయినా ముందు చెప్పకుండా అలా సడన్‌గా ఆపమని కేకలు పెడితే డేంజరు కదా! నేను అను భవం వున్న వాడిని కాబట్టి సరిపోయింది కానీ ఏ కుర్రకుంకో అయితే మీ అరుపుకి భయపడి స్టీరింగ్ వదిలేసేవాడు."

"సారీ" అన్నాడు ప్రసాద్.

"సరే... ఇంతకీ ఎందుకు అరిచారు. ఏమైనా వస్తువు పడి పోయిందా?"

"లేదు. ఎన్నాళ్ళనుండో వెతుకుతున్న వస్తువు దొరికింది."

అర్థం కాలేదు డ్రైవర్‌కి. అంతవేగంగా పోతూ వుండగా కార్లో కూచున్న వ్యక్తికి ఏం వస్తువు దొరుకుతుంది? అదే అడిగాడు.

"చెప్తా నువ్వు కారు వెనక్కి తిప్పు." అన్నాడు ప్రసాద్.

"వెనక్కి తిప్పాలా? ఎందుకు సార్?"

"చెప్తాను. నువ్వు ముందు వెనక్కి తిప్పు."

"హైవేలో వెనక్కి తిప్పటం అంటే... మరి ఎంత దూరం పోవాలో?"

"ఎంత దూరం అయినా పర్వాలేదు. తిప్పు. మనం వెనక్కి వెళ్ళాలి."

"మరి పదకొండు గంటలకు పది నిము షాలు ముందుగానే అక్కడ వుండాలి అన్నారు. లేట్ అవుతుందేమో!"

"అయినా కొంపలేం అంటుకోవు... నేను వెళ్ళి ఇంటర్వ్యూలు తీసుకోవాలి... నేను ఇంటర్వ్యూకి వెళ్లక్కర్లేదు. నువ్వు వెనక్కి తిప్పు." అన్నాడు.

నెమ్మదిగా పోనిచ్చాడు డ్రైవర్. ఎంత దూరం పోయినా కట్ రాదు. ఆరు కిలోమీటర్లు పోయాక అప్పుడు వుంది కట్.

యూ టర్న్ తీసుకుని వెనక్కి పోవటం మొదలు పెట్టాడు.

మళ్లీ ఎనిమిది కిలోమీటర్లు వెళ్ళి అక్కడ యుటర్న్ తీసుకుని– "ఇప్పుడు చెప్పండి సార్! ఎక్కడ ఆపాలి?" అని అడిగాడు.

"లెఫ్ట్‌లో నెమ్మదిగా పోనీ!" అన్నాడు ప్రసాద్.

మెల్లగా పోతోంది కారు. అద్దం దించేసి తలకాయ బయట పెట్టి– "ఆ...పోనీ! ఇంకాస్త ముందుకు పోనీ" అని చెప్తుంటే పోయి పోయి ఒక దగ్గర ఆపేసాడు.

"ఆపావేం పోనీ!" అన్నాడు ప్రసాద్.

"ఇందాక మీరు అరిచి ఆపేసింది ఇక్కడే సార్." చెప్పాడు డ్రైవర్.

"అవునా! మరి ఏదీ?"

"ఏది?"

"అదేనోయ్. ఇందాక కనిపించింది... ఇప్పుడు కనిపించలేదు."

"ఏవిటి సార్ అది?"

"వుండవోయ్!అసలే నాకు టెన్షన్‌గా వుంది. కనిపించినట్లు కనిపించీ అంతలోనే మాయం అయింది. ఇంతలోకే ఏమయిపోయింది?... ఓ పని చెయ్. మళ్లీ వెనక్కి తిప్పు!"

డ్రైవర్‌కి చిరాకు వచ్చేసింది.

కారు ఆపేసి... దిగిపోయి నీ దిక్కున్నచోట చెప్పుకో అని ఏ లారీనో ఎక్కి ఇంటికి వెళ్లి పోదాం అనిపించింది.... కానీ అలా వెళ్లిపోతే ఇంట్లోనే వుండిపోవాలి... ఉద్యోగం ఊడి పోతుంది, కస్టమర్ వివిఐపి జాగ్రత్త అని ముందే హెచ్చరించారు కంపెనీవాళ్ళు. ఇస్త్రీ మడత నలగని తెల్లటి యూనిఫామ్ తల మీద టోపీ పెట్టుకుని డ్యూటీకి వచ్చాడు.

"మళ్లీ వెనక్కి వెళ్ళాలా సార్? మీకు లేట్ అవుతుందేమో?" మరోసారి అడిగాడు.

"అయితే అయింది. నువ్వు వెనక్కి తిప్పు!" అన్నాడు ప్రసాద్ చిరాగ్గా.

అతనికి చాలా టెన్షన్‌గా వుంది. మళ్లీ సీను రిపీట్ అయింది.

కారు ఆపమని– "ఏదీ...ఇంతలోకే ఏమై పోయిందీ?..." అని దిగాలు పడిపోయాడు ప్రసాద్.

"ఎవడో ఎత్తుకుపోయి వుంటాడు సార్!" అన్నాడు డ్రైవర్.

"రోలు ఎవరు ఎత్తుకుపోతారు?...అదీ ఈ కాసేపట్లో! నీ వెర్రి కాకపోతేనూ!!"

నోరావలించాడు డ్రైవరు.




"రోలా!?"

"అవునోయ్ రోలు!..." అన్నాడు ప్రసాద్ దిగులుగా.

ఆయన వంక అనుమానంగా చూసాడు డ్రైవర్.

పెద్దవాళ్ళకి, మేధావులకే వేపకాయంత వెర్రి ఉంటుందిట. ఈయన కూడా ఆ బాపతేనేమో అనుకున్నాడు.

"రోలేవిటి సార్?... రోలెందుకు మీకు?... ఏం చేసుకుంటారు?" ఆయన వంక అనుమా నంగా చూస్తూ అడిగాడు.

"రోలుతో ఎవరైనా ఏం చేస్తారోయ్! పచ్చడి నూరుకుంటారు!" చెప్పాడు ప్రసాద్.

"కానీ సార్ మీకు రోలు కావాలంటే సిటీలో కొనుక్కోవచ్చు కదా!"

"ఈ మోడల్ రోలు కావాలంటే... సిటీలో ఎంత వెతికినా దొరకలేదు. నువ్వో పని చెయ్ వెనక్కి తిప్పు." అన్నాడు.

ఏడుపు ఒక్కటే తక్కువ డ్రైవర్‌కి. పొద్దున్న లేచి ఎవరి మొహం చూసానో ఈ మెంటల్ కేస్ దొరికాడు అనుకున్నాడు.

"సార్!...మీరు సరేనంటే ఒక పని చేద్దాం. దిగి నడుచుకుంటూ వెళ్లి చూద్దాం. కనిపిస్తుం దేమో!" అని సలహా ఇచ్చాడు. లేకపోతే ఎంత సేపు ఇలా ప్రదక్షిణలు చెయ్యటం అనే భయం కూడా వేసింది.

"అవునోయ్! మంచి ఆలోచన." అన్నాడు ప్రసాద్.

ఇద్దరూ కారు పక్కగా ఆపి బయలుదేరారు. జాగ్రత్తగా చూసుకుంటూ వెళ్తూ ఆగిపోయాడు ప్రసాద్– "అదుగో! అదీ సంగతి... రోలు మీద ఆ గళ్ళలుంగీవాడు కూర్చున్నాడు. అందుకే కనిపించలేదు." అన్నాడు సంతోషంగా.

ఓ చిన్న ఇల్లు. దాని ముందు కాస్త ఖాళీ స్థలం. అందులో ఓ రోలు. దాని మీద ఓ మనిషి కూచుని బీడీ కాలుస్తున్నాడు.

"ఇదుగో...నువ్వు అతన్ని పిల్చి ఆ రోలు మనకి కావాలని చెప్పి తీసుకురా!" అన్నాడు ప్రసాద్.

తెల్లబోయాడు డ్రైవర్.

"వాళ్ళ రోలు...ఎందుకు ఇస్తాడు?"

"ఊరికే వద్దులే... దాని ధర ఇచ్చేద్దాం! దాంతో ఇంకో రోలు కొనుక్కుంటారు."

"మనమే కొత్తది కొనుక్కోవచ్చు కదా?"

"ఈ మోడల్ రోలు కోసం ఎంత వెతికినా దొరకలేదు మొర్రో అంటుంటే అర్థం కావటం లేదా నీకు?"

తన ఇంటి ఎదురుగా ఓ నీలం సూట్



ఆయన, తెల్లడ్రెస్ ఆయనా ఏదో మాట్లాడు కోవటం చూసి కాస్త భయంగా లేచి వచ్చాడు ఆ లుంగీ అతను.

అతని పేరు మంగపతి.

నమస్కారం పెట్టాడు.

"ఊ...అడుగు." అన్నాడు ప్రసాద్.

నేరుగా అడగటానికి కాస్త మొహమాటం వేసింది డ్రైవర్‌కి. అతనికి తనని పరిచయం చేసుకుని "ఈయన చాలా గొప్పవారు." అని ప్రసాద్‌ని పరిచయం చేసాడు.

"నీ పేరు ఏమిటి?" అని అడిగాడు.

ఇంత పెద్దవాళ్ళు తన దగ్గరకు ఎందుకు వచ్చారో అని కంగారు పడుతూ...

"నమస్కారం సార్! నా పేరు మంగపతి. మీరు ఎవరు? నాతో ఏం పని? ఏదైనా అడ్రెస్ కావాలా?..." అని వినయంగా అడిగాడు.

"అడ్రస్ కాదు. నీ రోలుకావాలి." చెప్పాడు డ్రైవర్. అర్థం కాలేదు మంగపతికీను.

అర్థం అయ్యాక... అతని ధోరణి మారి పోయింది. దర్జాగా బీడీ అంటించి నిర్లక్ష్యంగా చూసాడు.

అది గమనించి... డ్రైవర్ అతన్ని పక్కకు తీసుకువెళ్లాడు.

ఇద్దరి మధ్య మాటలు జరిగాయి... నేను ఇవ్వను పొమ్మంటాడు... మంగపతి.

"కాదులే ఇవ్వు! డబ్బు ఇప్పిస్తాను అయినా రోలు రోలుగా వాడుకుంటున్నావా?... కుర్చీ లాగానేగా ఉపయోగిస్తున్నావు... సార్‌కి ఇచ్చెయ్!" అంటాడు డ్రైవరు.

"అది మా తాతలనాటి రోలు నేను ఇవ్వను" అంటాడు మంగపతి.

"కాదులే పెద్దాయన సరదా పడుతున్నాడు ఇవ్వు!" అని నచ్చ చెబితే కాస్త మెత్తబడ్డాడు.

కాకపోతే 'వైద్యానికి కావాలి. ఆముదం ఆకు ఇమ్మంటే ఆకు ఆరు వరహాలు అన్నాడు' అని సామెత చెప్పినట్లు ఆ తాతలనాటి రోలుకి ఓ అయిదు వేలు ఇమ్మన్నాడు.

"ఓ రెండు వందలు ఇప్పిస్తా!" అన్నాడు డ్రైవర్.

చివరికి పదిహేను వందల దగ్గర బేరం కుదిరింది. రోటితో పాటు పొత్రం కూడా.

ఆ విషయం తెలుసుకుని చాలా సంతోషిం చాడు ప్రసాద్.

ఆనందంతో పర్స్ తీసి డబ్బు ఇచ్చేసి... భూకైలాస్ సినిమాలో రావణాసురుడులాగా రోలుని ఎత్తుకోబోతుంటే డ్రైవరు వారించాడు.


"మీరు ఆగండి సార్!... కారు తీసుకు వస్తాను." అని వెళ్లి కారు తీసుకువచ్చాడు.

బూట్ ఓపెన్ చేసి అందులో రోలు ఎక్కిం చారు. పొత్రం కూడా పక్కన పెట్టారు.

మూసేయబోతుంటే ఆగాగు అని ఫోన్‌లో ఫోటోలు తీసుకున్నాడు ప్రసాద్.

ఇదుగోనోయ్ అని ఓ ఐదువందల నోటు డ్రైవర్ చేతుల్లో పెట్టాడు.

అతను వద్దు వద్దు అన్నా వినలేదు. ఆయన మొహం విజయగర్వంతో వెలిగిపోతోంది.




కారులో ఎక్కగానే మొదలుపెట్టాడు ప్రసాద్.

"దొరకదేమో అని నిరాశ పడ్డాను. మొత్తా నికి దొరికింది." అన్నాడు ఆనందంగా.

"ఏమిటి సార్! ఈ రోలు మీకు ఇంకా ఇంత ఇంపార్టెంట్ ఏమిటి?" అని అడిగాడు.

న్యాయంగా డ్రైవర్ కారులో కూర్చున్న పెద్ద వాళ్ళనీ అలా ప్రశ్నలు వేయకూడదు... కానీ పట్టలేక అడిగేసాడు.

"అవునోయ్! ఇంపార్టెంట్... ఈ మధ్య కాలంలో మళ్లీ పాతపద్ధతులన్నీ వచ్చేస్తున్నాయి కదా? రాగి పాత్రలోని నీరు తాగటం...మట్టి పాత్రల్లో వండుకోవటం...రోట్లో పచ్చడి నూరు కోవటం...మా ఇంట్లోనూ అదే పద్ధతి మొదల యింది. అవన్నీ ఆన్‌లైన్‌లో దొరికాయి. కానీ రోలు దొరకలేదు. అప్పటికీ అన్ని చోట్లా వెతి కాను. రోళ్ళల్లో అన్ని మోడల్స్ వుంటాయి అని నాకు తెలియదు. నాలుగైదు మోడల్స్ వున్నాయి కానీ అవేమీ ఆవిడకి నచ్చలేదు. అందులోనూ మా ఆవిడ ఇటువంటి విషయాల్లో చాలా ఖచ్చితం మనిషి. యశోదమ్మ కృష్ణుడిని తాడు తో కట్టేసిన మోడల్ రోలు మాత్రమే కావాలట. అది దొరికితే చూడండి, లేకపోతే మానేయండి అని చెప్పేసింది... నాకూ అదుగో ఇదుగో అంటూ అరవై ఏళ్ళు వస్తున్నాయి. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు తీరుస్తాను భార్య కోరిక! అయినా తను వజ్రవైఢూర్యాలు అడిగిందా? ఆఫ్ట్రాల్, తను కావాలనుకున్న మోడల్ రోలు అడిగింది. అదీ తనకోసం కాదు. నాకు పచ్చడి నూరి పెట్టడానికి. మొత్తానికి దొరికింది. ఫోటో పెడితే ఎంత సంబరపడిపోయిందో...

ఏవిటోనోయ్!... ఎంత పెద్ద ఉద్యోగం చేస్తున్నా, ఎంత సంపాదిస్తున్నా కలగని తృప్తి, భార్య కోరిక తీరిస్తే కలుగుతుంది." అన్నాడు ప్రసాద్.

అప్పటిదాకా ఆయన పట్ల ఉన్న... తేలిక భావం పోయి యెనలేని గౌరవం కలిగింది డ్రైవర్‌కి.

'ఈయన కారణంగా నేనూ ఓ పాఠం నేర్చు కున్నాను.

తనకు కావలసిన మోడల్ రోలు ఈయనకు దొరికితే నాకు ఒక రోలు మోడల్ దొరికాడు.' అనుకున్నాడు.




# హాస్య సాహితీ సామ్రాజ్య లక్ష్మి...
# శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి!

**-ద్విభాష్యం రాజేశ్వరరావు**

**తె**లుగు సాహిత్యంలో అద్భుతమైన హాస్యం పండించిన వారిలో చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు, పానుగంటి లక్ష్మీనరసింహ రావుగారు, మొక్కపాటి నరసింహశాస్త్రిగారు, భమిడిపాటి కామేశ్వరరావుగారు, ముని మాణిక్యం నరసింహారావుగారు మొదలైన వారు సుప్రసిద్ధులు.

తర్వాత రోజుల్లో సోమంచి యజ్ఞన్నశాస్త్రి గారు, రావికొండలరావుగారు, నండూరి పార్థసారథిగారు, ఆదివిష్ణుగారు, యర్రంశెట్టిశాయి గారు, గుండు సుబ్రహ్మణ్య దీక్షితులుగారు, పెండ్యాల నాగాంజనేయులుగారు మొదలైన వారు అడపాదడపా పత్రికల్లో తమ కథలతో కనువిందు చేసి మనసును హాస్యంతో గిలిగింతలు పెట్టినా తెలుగు పాఠకులందరినీ వినూత్నమైన హాస్యరసంలో ముంచెత్తుతూ తమ వైపుకు తిప్పుకున్న వారు మాత్రం శ్రీముళ్ళపూడి వెంకటరమణ గారే!!

ముళ్ళపూడి వారు, జంధ్యాల గారు సినిమా కథలలో మునిగిపోయిన తర్వాత తెలుగు పత్రికలలో చక్కటి హాస్యం అందించే వారికి కొంతమేర కరువు ఏర్పడింది! హాస్య కథలకు ఒక రకమైన శూన్యత చోటుచేసుకుంది!!

అదిగో ఆ సమయంలో, 'నేనున్నాను!' అంటూ ప్రేమలేఖ నవలతో తెలుగు పత్రికా సాహిత్యంలోకి దూసుకు వచ్చిన హాస్య రచయిత్రి శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మిగారు! సుమారు పాతిక వరకు నవలలు, రెండు వందలకు పైగా కథలు తనదైన శైలిలో పండిస్తూ, పాఠకులకు అభిమాన రచయిత్రి అయ్యారు.

“మానవ సంబంధాలకే నేను ఎక్కువ ప్రాధాన్యతనిస్తాను... మంచి గురించి, ఆనందాన్ని ఇచ్చే సంగతులు గురించి రాయటానికి మాత్రమే ప్రయత్నిస్తాను. మా ఇంట్లో విలన్లు ఎవరూ లేరు...హీరోలు అంతకంటే లేరు! ఓ రకంగా చెప్పాలంటే అందరూ హాస్యనటులే!! అందుకే... చిన్నప్పటినుండి నాకు తెలియకుండానే, 'నేను హాస్యం రాస్తున్నాను!' అనే భావన లేకుండానే రాసేవన్నీ హాస్యస్ఫోరకంగానే వచ్చాయి!” అంటారు విజయలక్ష్మి గారు.

సుమారు ఇరవైమంది సభ్యులు గల ఉమ్మడి కుటుంబంలో ఛలోక్తులు విసురుకుంటూ తన బాల్యం గడిపిన విజయలక్ష్మిగారు, అదృష్టం



అంటే ఏమిటో ఒక్క వాక్యంలో చెబుతారు!

'అందరూ కలిసి ఉండటమే గొప్ప అదృష్టం!' అని. అంతేకాదు, 'నా కథలు, నవలలు చదివి నిత్యం నన్ను ఎంతో ఆదరంతో అభిమానించే పాఠకులే నా ధనము అనుకుంటే నా అంత ధనవంతులు భూమ్మీద మరి ఎవరూ ఉండరు! నేనొక మల్టీ బిలియనీర్ని!...' అని కూడా సంతృప్తితో మురిసిపోతారు ఆవిడ!

నిత్యజీవితంలో ఎదురయ్యే ప్రతి వస్తువునూ ప్రతి సందర్భాన్నీ తన నిశిత దృష్టితో పరికిస్తూ, 'కాదేది హాస్యానికి అనర్హం?' అనే రీతిలో దినచర్యలో ఎదురయ్యే ప్రతి చిన్న విషయాన్ని పరిశీలిస్తూ... ఎదుటివారి అమాయకత్వంలో నుండీ, తెలివితక్కువతనంలో నుండి అద్భుతమైన హాస్యాన్ని పిండి చదువరులకు అందించ గలిగే ప్రతిభావంతురాలు విజయలక్ష్మిగారు.

వారి హాస్యం గిల్లదు!...
గిలిగింతలు పెడుతుంది!

వారి హాస్య రచన చదవడం పూర్తయ్యాక, ఏకాంతంలో కూర్చుని, చదివిన దాన్ని గుర్తుకు తెచ్చుకుని పదేపదే మనలో మనమే నవ్వుకుంటూ ఆనందిస్తాం! ఎందుకంటే చిన్న చిన్న పదాలతో బుల్లి బుల్లి వాక్యాలతో ఆవిడ కథలో చిత్రించిన హాస్య సన్నివేశాలు అంత బలంగా మనకు గుర్తుండిపోతాయి!

తన చుట్టూ ఉన్న పరిస్థితుల ఎడల ఒక నిశితమైన అవగాహనతో, జీవితం యెడల కొంత తూకంతో... అలవరుచుకున్న ఒక దృక్పథంతో, ఉమ్మడి కుటుంబంలోని పరిస్థితులు నేర్పిన సమదృష్టితో పోహళించి రాసిన రచనలే వీరి కలం నుండి విరివిగా వెలువడ్డాయి. అందుకే అవి ముఖ్యంగా మధ్య తరగతి వారికి ఎంతో ప్రీతిపాత్రమైన కథలుగా నిలిచిపోయి... ఆహ్లాదం, ఆనందం పంచుతున్నాయి.

సుమారు రెండుసంవత్సరాల క్రితం రేణిగుంట నుండి శ్యామలత అనే ఒక పాఠకురాలు ఫోన్ చేసి... మాటల సందర్భంలో తన ఆరాధ్య రచయిత్రి శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మిగారనీ, తనకు ఏదైనా చికాకు లేదా కష్టం వస్తే పొత్తూరివారి హాస్య కథల పుస్తకం కాసేపు చదువుకుంటాననీ చెబుతూ ఉంటే... నాకెంతో ఆనందం కలిగింది!

పాఠకులకు అంతటి ఉపశమనం కలుగ చేయడం కంటే ఏ రచనకైనా సార్థకత ఏముంటుంది?!

ఏ రచయిత్రికైనా, రచయితకైనా అంతకంటే సంతోషం, తృప్తి ఎవరివ్వగలరు?!

ప్రముఖ హాస్య రచయిత్రి శ్రీమతి విజయలక్ష్మిగారికి నా శుభాకాంక్షలు! అభినందనలు! శుభాశీస్సులు!

శ్రీమతి విజయలక్ష్మి గారి గౌరవార్థం ఒక ప్రత్యేక సంచిక విడుదల చేస్తున్న హాస్యానందం యాజమాన్యానికి, సంపాదకవర్గానికి... నా అభినందనలు తెలియజేస్తున్నాను.



విజయానందం

# చిన్ని ప్రశ్న

శ్రీమతి పొత్తూరి విజయలక్ష్మి

కథ

**ఒక చిన్న ఇంటిలో డ్రాయింగ్ రూమ్.**

**తొమ్మిదేళ్ళ బాబు, ఏడేళ్ల పాప హోంవర్క్ చేసుకుంటున్నారు.**

**"మద్యపానము ఎంతయో ప్రమాదకరమైన వ్యసనము... మద్యపానం ఎంతయో ప్రమాదకరమైన వ్యసనము ...' అని వల్లె వేస్తోంది చిన్ని.**


హఠాత్తుగా ఒక సందేహం వచ్చింది

"వ్యసనము అంటే ఏమిటి రా అన్నయ్య?" అని అడిగింది.

"వ్యసనము అంటే అలవాటు." చెప్పాడు రవి.

"అలవాటు అంటే?' అడిగింది చిన్ని.

"నీ తలకాయ్ నన్ను చదువు కోనీ" అని విసుక్కున్నాడు.




అప్పుడే గదిలోకి వచ్చింది సునీత– "ఏంట్రా చిన్నపిల్ల తెలియక అడిగితే విసుక్కుంటావ్!" అని కొడుకుని మందలించింది

"నేను చెప్తా రా... చిన్నీ!" అని కూతురిని పిలిచింది.

పుస్తకం తీసుకుని తల్లి దగ్గరకు వెళ్ళింది చిన్ని.

"అలవాటు అంటే రోజు ఒకే పని చేస్తూ వుండటం. నువ్వు అన్నయ్య ప్రతిరోజూ హార్లిక్స్ తాగుతారు. నేను నాన్న తాగము. మీకు హార్లిక్స్ తాగడం అలవాటు అన్నమాట..." అని వివరంగా చెప్పింది.

ఓహో అని మళ్లీ పాఠం లోకి వెళ్ళిపోయింది చిన్ని.

మద్యపానమునకు గురి అయిన వ్యక్తి యొక్క ఆరోగ్యం క్రమముగా క్షీణించును.

మళ్లీ సందేహం వచ్చింది.

"క్షీణించటం అంటే ఏమిటి అమ్మా?" అని తల్లిని అడిగింది.

నవల చదువుకుంటూ–

"క్షీణించటం అంటే కృశించటం!..." సమాధానం చెప్పింది సునీత.

పిల్లి అంటే మార్జాలం అన్నట్టు వుంది చిన్నికి.

"కృశించటం అంటే?..." అడిగింది.

"అబ్బా!.. నువ్వు నీ ప్రశ్నలూ!... చంపుతున్నావు!" అని విసుక్కుంది సునీత.

ఆఫీస్ నుంచి వచ్చి స్నానం చేసి హాల్లోకి వచ్చిన ప్రభాకర్ భార్యని మందలించాడు.

"ఏమిటది సునీ! ఇదేనా పిల్లలతో మాట్లాడే పద్ధతి!" అని.

"ఇట్లా రా తల్లీ నేను చెప్తాను!" అన్నాడు.

తండ్రి దగ్గరికి పరిగెత్తుకొచ్చింది చిన్ని.

"ఒకరోజు కొంచెం నీరసంగా ఉంటుంది. ఇంకొన్నాళ్ళకిఇంకా పాడై పోతుంది ఆరోగ్యం. అలా కొన్నాళ్ళకి అసలు లేవలేరు... అది కృశించడం అంటే!" చెప్పాడు.

తలాడించి... మళ్ళీ పాఠంలోకి వెళ్ళింది చిన్ని.

"మద్యపానం ప్రమాదకరమైన వ్యసనము... మద్యపానమునకు గురి

అయిన వ్యక్తి ఆరోగ్యం క్రమముగా క్షీణించును. క్షీణించి చివరకు మరణమునకు దారి తీయును.' అని చదువుతూ ఉండగా మళ్ళీ డౌటు...

"మరణం అంటే ఏమిటి నాన్నా?..." అడిగింది.

"చచ్చిపోవటం. అంటే దేవుడి దగ్గరికి వెళ్లి పోవడం. తాతయ్యగారు వెళ్ళి పోయారు కదా! అలా అన్నమాట!" చెప్పాడు ప్రభాకర్.

మళ్లీ చదవటం మొదలు పెట్టింది చిన్ని.

"మద్యము తాగిన వ్యక్తి..." అంటూ ఆగి పోయింది.

"మద్యం అంటే ఏమిటి నాన్నా ?" అంది.

"అది ఒక మత్తు పదార్థం!..." అంటూ ప్రభాకర్ చెప్తూ ఉండగానే...

రవి అందుకున్నాడు–

"మద్యం అంటే డ్రింక్. సీసాల్లో ఉంటుంది ప్రతి శనివారం మధుఅంకుల్, గిరి అంకుల్, శంకర్అంకుల్, నాన్న అందరూ కలిసి డ్రింక్ చేస్తారు... మధు అంకుల్ వాళ్ళ ఇంట్లో ఉంటుంది. ఈసారి చూపిస్తాను..." అన్నాడు ఉత్సాహంగా.

చిన్ని మొహం చిన్న బోయింది.

ఆ మొహంలో భయం! కళ్ళలో నీళ్ళు తిరిగాయి, పుస్తకం విసిరేసి ఒక్క పరుగున వెళ్లి తండ్రి ఒళ్లోకి ఎక్కి కూర్చుంది.

అతని తల నిమిరింది. మెడ చుట్టూ చేతులు వేసింది.

"మరణమునకు దారితీయును... అయితే ఎందుకు తాగుతారు నాన్నా??" అని కావలించుకుని బావురుమని ఏడ్చేసింది.



## 'హాస్య రచనల రారాణి'






సాహిత్యాభిమానుల్ని తెలుగులో వున్న గొప్ప హాస్య రచయితలు ఎవరు అంటే ఒక్కొక్కరి అభిరుచి దృష్ట్యా చాలా పేర్లు చెప్పవచ్చు.

అదే తెలుగులో గొప్ప హాస్యరచయిత్రి ఎవరూ అంటే దాదాపు నిర్వివాదాంశంగా (కొన్ని మినహాయింపులు వుండొచ్చు) ఒకే పేరు చెబుతారు పొత్తూరి విజయలక్ష్మి అని.

పొత్తూరి విజయలక్ష్మి పేరు, పి.విజయలక్ష్మి అని కూడా కొన్ని సందర్భాల్లో రాస్తారు. ఇక్కడ 'పి' అనే మాటకు నేను మరో పదంతో నింపుతాను. అదేమిటంటే 'పొట్టచెక్కలు చేసే' అని. అంతటి గొప్ప హాస్య రచనలు చేసారామె.

నాకో అనుమానం... చిన్నప్పుడు ఆమెకు పాలు పట్టేటప్పుడు గ్రైప్‌వాటర్ లాంటిది ఇచ్చేటప్పుడు వాటిలో కచ్చితంగా ఆమె తల్లి 'హాస్యరసాన్ని' చుక్కలుగా కలిపిచ్చిందేమోనని. తలంటునూనెలో కూడా హాస్యరసం చేర్చబట్టే మెదడులోకి హాస్యధోరణి ఇంకి, కర్ణుడికి కవచకుండలాలు లాగా, ఊహ తెలిసేసరికే సహజసిద్ధంగా హాస్యం ఆమె సహజ లక్షణంగా మారిందేమో అని! ఆమె అసంఖ్యాక రచనల ద్వారా అందించిన హాస్యం పాఠకలోకానికి బాగా పరిచయం.

కుక్కపిల్లా, సబ్బుబిళ్ళ, అగ్గిపుల్లా కాదేదీ కవితకనర్హం అన్నాడు మహాకవి శ్రీశ్రీ. దోసె వెయ్యటం, పాలుకాయటం, భర్తకు కాఫీ ఇవ్వటం, కూరగాయలు కొనటం, ఇంటికి చుట్టాలు రావటం, ఇంకా ఇలాంటి జీవితంలో తారసపడే సహజమైన విషయాలన్నీ ఈమెని హాస్యం వండి వడ్డించడానికి దినుసులే.

'హాస్య రచనల రారాణి' అన్న బిరుదును నిర్ద్వంద్వంగా అర్హురాలంటాను.

అలా నేను హాస్యరచనల అభిమానిగా ఉండగా, ఆమె రాసిన 'ఆత్మకథ' అన్న పుస్తకం చదవటం జరిగింది. ఎక్కడో ఉద్యోగరీత్యా ఉన్నప్పుడు వీరికి ఇరుగుపొరుగుగా ఉన్న ఒక సర్దార్జీతో అనుబంధాన్ని వివరించిన రచన అది.

అది చదివి నేను పొందిన అనుభూతి ఎలాంటిదంటే, ఆమె హాస్య రచనలన్నీ ఒకవైపు, ఈ పుస్తకం ఒకవైపు త్రాసులో వేసి తూస్తే, ఆత్మకథ వైపే తూకం ఒంగుతుందని నేను భావించేంతగా గొప్ప అనుభూతి కలిగించిన రచన అది.

రెండు మూడు సందర్భాలలో సినిమా కథా చర్చలలో మేమిద్దరం కలిసి పాల్గొన్న సందర్భాలు ఉన్నాయి. అక్కడ కూడా అంతే తంతు. అలవోకగా సినిమాకి సీన్లు చెప్పే క్రమంలో కూడా, కబుర్ల హాస్యం వడ్డించే వారీవిడ.

నేను సంకలనం చేసిన 'ఆనాటి వానచినుకులు' కథా సంకలనానికి, ఈ కాలపు సమస్యగా మధ్యతరగతి కుటుంబాల్లో ఆర్థిక స్థితిగతులు, వ్యక్తుల జీవితాల్ని తన ఆధీనంలోకి తీసుకొని ఎలా ఆటలాడిస్తాయో చక్కగా చెప్పిన కథ అందించారు. ఆ కథ ప్రచురించే అవకాశం లభించినందుకు గర్వపడ్డాను. ఆమెకి కృతజ్ఞుడిని. ప్రచురితమైన ఈమె పుస్తకాలసెట్ బంధు మిత్రులకు బహూకరించటానికి గొప్ప విలువైన కానుక అవుతోంది.

చివర్లో ఒక మాట. హాస్యరచనల విషయంగా ఆమెలా రాయలేకపోతున్నందుకు నేను చాలా ఈర్ష్యపడుతున్నాను. నాతోపాటు ఇలా ఈర్ష్యపడే వారి సంఖ్య అపరిమితం అని నమ్ముతున్నాను కూడా. ముందు ముందు ఇలాగే తన రచనలద్వారా పాఠకుల్ని అలరించాలని విజయలక్ష్మిగారిని, చనువుగా కోరుతున్నాను.

**–వేమూరి సత్యనారాయణ**

# పదానందం 12

కూర్పు: **పోపూరి విశ్వనాథ్, 9133197111**



| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | | | 3 | |
| | | | | 4 | | | |
| 5 | | | | | | | |
| | | 6 | 7 | | | 8 | |
| | 9 | | | | 10 | | |
| 11 | | | | | | | 12 |
| | | | 13 | 14 | | | |
| 15 | | | | | | | |

**ఆధారాలు:**

**అడ్డం:**

1. రెండుచేతులతోనూ బాణాలు వేయగలవాడు (4)
3. ఇది ఎందులోనూ మంచిదికాదు (2)
4. కాలుష్యంవలన ఆకాశంలో ఈ వాయుపొర ఛిద్రం అవుతోంది (3)
5. జీతం (3)
6. భూమి (3)
8. అస్పష్టంగా మాట్లాడడం (ముక్కుతో) (2)
11. ముట్టుకుంటే ముడుచుకునే సిగ్గాకు (4)
13. 'వీటి వెనకాల' అంటే జైల్లో అని. (5)
15. ఆంధ్రా ఊటీ (3)

**నిలువు**

1. కలయిక (4)
2. గౌరవంగా పంపించు (4)
3. ఇది పెనుభూతం! (4)
4. అపజయం (3)
7. గద్గదస్వరం (4)
9. కరివేపాకుకు చెల్లెలులాంటిది (4)
10. ఈ దెబ్బలాంటిది వేయడమంటే... మందలించడం (3)
12. ఈ పక్షి జోస్యం చెబుతుంది (3)
14. తెలుగులో 'పోస్టు' (2)

సమాధానం వచ్చే సంచికలో...

**గత సంచిక సమాధానం**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 వి | ను | 2 ర | పే | 3 మ | | 4 చి | |
| చ్ఛ | | చ | | 5 తి | మ్మ | రు | సు |
| 6 ల | డా | యి | | మ | | నా | |
| వి | | 7 త | యా | రు | | 8 మా | 9 ర్పు |
| 10 డి | 11 తో0 | | | 12 పు | 13 లి | | దా |
| | ద | | 14 న | | 15 క | 16 పి | ఓ |
| 17 పె | ర | 18 స | ల్లి | 19 ఊ | | చ్చి | |
| ల్ల | | జ్జ | | 20 హ | రి | క | ధ |




Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Rainbow Print Pack, Hyderabad. Edited by.Ramu.P

# PRIYANKA PANDA
DESIGNER STUDIO



**One stop shop for your designer wear**

- Women
- Men
- Kids

## Designing & Stitching

Call: +919959222411.
email: labelpriyankapanda@gmail.com

Hasyanandam July-2024. RNI No. APTEL 08387/01/1/2003-TC

